ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026

ప్రతి అక్షరం ప్రజల కోసం www.prajapaksham.in

# ప్రజాపక్షం

PRAJAPAKSHAM ★

బిఆర్ఎస్‌ది పైశాచిక ఆనందం
కాంగ్రెస్ రావడం వల్లనే రాష్ట్రంలో కరవు వచ్చిందని మాట్లాడటం మిడిమిడి జ్ఞానానికి నిదర్శనం
తెలంగాణకు శాశ్వత మరణ శాసనం రాసిందే కెసిఆర్
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
10

సంపుటి 09, సంచిక: 316 | శుక్రవారం | 16-10-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# కేంద్ర సాయం కోసం ఢిల్లీకి అఖిలపక్షం



**ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం**

● దసరా తర్వాత అఖిలపక్షం ● కార్మిక, వివిధ ప్రజాసంఘాలతో ఉప సంఘం భేటీ ● భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన ● రానున్న 10 నెలలు అత్యంత గడ్డు పరిస్థితి ● ప్రజలు, రైతులు నీటిని, విద్యుత్‌ను ఆదా చేయాలి ● యాసంగిలో వరిసాగు వాయిదావేసి ఆరుతడి పంటలు వేసుకోవాలి ● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి ● 'ఎల్ నినో ప్రభావం – తీసుకోవాల్సిన జాగ్రత్తల'పై మంత్రులతో సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ వ్యాప్తంగా వంద దేశాలను వణికిస్తున్న 'సూపర్ ఎల్‌నినో' ప్రభావం తెలంగాణ రాష్ట్రం పైనా తీవ్రంగా పడనున్న నేపథ్యంలో రానున్న 8 నుంచి 10 నెలల కాలం అత్యంత గడ్డు పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఇందుకు ప్రతి పౌరుడూ, రైతులు అప్రమత్తమై నీటిని, విద్యుత్‌ను ఆదా చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర సహాయం నిమిత్తం తన (సిఎం) నేతృత్వంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వాన్ని కలుస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశామని, ఈ ఉప సంఘం దసరా పండగ తర్వాత అఖిలపక్షం, కార్మిక, వివిధ ప్రజా సంఘాలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తుందని సిఎం వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రిజర్వాయర్లలో కలిపి కేవలం 209 టిఎంసిల నీళ్లే ఉన్నాయని, ఈ నీటిని తాగునీటికే తొలి ప్రాధాన్యతనిస్తామని, యాసంగిలో వరి సాగును వాయిదా వేసుకోవాలని, ఆరుతడి పంటలను వేసుకోవాలని సిఎం కోరారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలని సిఎం విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సిఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. సమావేశం అనంతరం సిఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. 1950 తర్వాత ఎన్నోసార్లు ఎల్‌నినో వచ్చి కరవు పరిస్థితులను చూశామని, కానీ ఈసారి అతిపెద్ద ప్రకృతి విపత్తు అని, 2026 ప్రారంభంలోనే తీవ్ర ఎండలు, నీటి కొరతపై శాస్త్రవేత్తలు హెచ్చరించారని, వారు ఊహించినట్టే చేయి దాటే పరిస్థితులు కనిపిస్తున్నాయని సిఎం తెలిపారు. ఎల్‌నినో ప్రభావం భూమిపై ఉన్న ప్రతి జీవరాశి పైనా ఉంటుందన్నారు.

**వర్షపాతం.. నీటి లోటు**

రాష్ట్రంలో 23 శాతం లోటు వర్షపాతం నమోదవ్వగా, కృష్ణా బేసిన్‌లో 72 శాతం, గోదావరి బేసిన్‌లో 40 శాతం నీటి నిల్వలు పడిపోయాయని సిఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్లలో సాధారణంగా ఉండాల్సిన 460 టిఎంసిలకు గాను కేవలం 209 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నదని వివరించారు. ఈ నీటిని తరువాయి 8లో



# సొంత ప్రజలపైనే మోదీ సర్కార్ యుద్ధం

● సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను రక్షిస్తున్న ప్రధాని, హోంమంత్రి
● ఓటర్ల తొలగింపుల ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు కుట్ర : అభిజీత్ దీప్కే



**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్‌ను రక్షించడం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తమ సొంత దేశ ప్రజలపై యుద్ధం చేస్తున్నారని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. సిఇసి రాజీనామాను డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న వారిని, ప్రతిపక్ష నాయకులను నిర్బంధించడాన్ని ఆయన ప్రశ్నించారు. ఓటర్ల తొలగింపుల ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లను తొలగించడం ఒక కుట్ర అని అన్నారు. ఐసా జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా, ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, ఎస్ఎఫ్ఐ నాయకురాలు ఐషే ఘోష్, నటుడు ప్రకాష్ రాజ్ తదితరులతో కలిసి తరువాయి 8లో

**కన్నాట్ ప్లేస్ మూసేస్తున్నట్లు ఎన్ఎండిసి ప్రకటన**

కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శుక్రవారం తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన పిలుపు నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ మరోసారి భారీ సంఖ్యలో పోలీసులు, పారా మిలిటరీ బలగాల కంపెనీల మోహరింపునకు సమాయత్తమవుతోంది. శుక్రవారం సాయంత్రం 5గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో సిజెపి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. అయితే పరిపాలనాపరమైన కారణాలతో 16, 17 తేదీలలో ఈ రెండు ప్రాంతాలు మూసివేస్తున్నట్లు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్ఎండిసి) ప్రకటన చేసింది.





ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారీ వర్షం మధ్యనే 'తిరంగా మార్చ్' (త్రివర్ణ పతాక ప్రదర్శన) నిర్వహించారు. 'జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి!', 'జంతర్ మంతర్ హమారా హై!' వంటి నినాదాలతో కన్నాట్ ప్లేస్ మార్మోగిపోయింది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.

## 'నైరుతి' నిష్క్రమణ

ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో దక్షిణ భారతంలో వర్షాలు ప్రారంభం : ఐఎండి

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు గురువారం నిష్క్రమించాయి. అయితే అదే రోజు దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాల వర్షాలు ప్రారంభమయ్యాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ, దక్షిణ అంతర్గత కర్ణాటక, కేరళ, మాహేలలో ఈశాన్య రుతుపవనాల ప్రభావం కనిపించిందని ఐఎండి పేర్కొంది. 'ఈశాన్య రుతుపవనాల ప్రారంభంతో, ఈనెల 21 వరకు దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలోని అనేక ప్రాంతాలలో అక్కడక్కడా భారీ వర్షాలతో కూడిన తడి వాతావరణం ఉండే అవకాశం ఉంది' అని ఐఎండి రోజువారీ అంచనాలో పేర్కొంది. భారతదేశంలో రెండు ముఖ్యమైన రకాల రుతుపవనాలు ఉన్నాయి: జూన్ నుండి సెప్టెంబర్ వరకు చురుకుగా ఉండే నైరుతి రుతుపవనాలు, అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు తరువాయి 8లో



## సంపద సృష్టికర్తలకు ప్రభుత్వం అండ

● తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం ● సింగిల్‌విండో విధానంలో అనుమతులు, అవసరమైన భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు ● 'గ్లోబల్ బిజినెస్ మీట్– 2026'లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందు కొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయడంతోపాటు అవసరమైన భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించారు. పారిశ్రామికవేత్తలకు తాను గార్డియన్‌గా ఉంటూ, పరిశ్రమల ఏర్పాటులో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనలో భాగస్వాములు కావాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో గురువారం నిర్వహించిన సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్–2026లో భట్టి విక్రమార్క మాట్లాడారు. సంపద సృష్టించే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, పెట్టుబడులకు అవసరమైన మౌలిక తరువాయి 8లో

## ఎసిబికి చిక్కిన ప్రభుత్వాధికారులు

● లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు ● హైదరాబాద్, కీసర, వేములవాడలో ఘటనలు

ప్రజాపక్షం/హైదరాబాద్/మేడ్చల్/వేములవాడ

సామాన్యుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకోవాలనే దురుద్దేశంతో ప్రభుత్వాధికారులు లంచాలకు ఎగబడుతున్నారు. ఏ ప్రభుత్వ విభాగంలో అయినా ఏ పని కావాలన్నా ముడుపు ఇవ్వనిదే పనులు కావడం లేదు. అయితే ఎసిబి అధికారులు కూడా దూకుడుగా వ్యవహరిస్తూ లంచాలు తీసుకుంటున్న అధికారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. అయినా ఏ మాత్రం భయపడడం లేదు. గురువారం నాడు రాష్ట్రంలో పలువురు అధికారులను దర్యాప్తు సంస్థ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండల రెవెన్యూ కార్యాలయం డిప్యూటీ తహసీల్దారు సందీప్ రెడ్డి, హైదరాబాద్ సంతోష్‌నగర్‌లో విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ తరువాయి 12లో

## కుప్పకూలిన స్కూల్ భవనం

● 34 మందికి పైగా విద్యార్థులు మృతి ● పాకిస్థాన్‌లో సంతాపదినం

**పెషావర్:** పాకిస్థాన్ నగరం పెషావర్‌లో మూడు అంతస్తుల స్కూలు భవనం మొదటి అంతస్తు పైకప్పు కుప్పకూలిపోవడంతో 34 మంది విద్యార్థులు దుర్మరణం చెందారు. ఈ ఘటనలో స్కూలు భవనం యజమానిని పోలీసులు అరెస్టు చేశారు.మరణించినవారిలో ఎక్కువమంది 13 ఏళ్ళ లోపు పిల్లలే ఉన్నారని ఆసుపత్రి వర్గాలు తెలియజేశాయి. పెషావర్ లేడీ రీడింగ్ ఆసుపత్రి తరువాయి 8లో



## మతం మారితే బిసి కోటా వర్తించదు



● సుప్రీంకోర్టు స్పష్టీకరణ ● మతం మారిన వ్యక్తులు పాత సామాజికవర్గం ఆధారంగా బిసి కోటా కోరలేరని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** మతం మారినంత మాత్రాన బిసి రిజర్వేషన్ పొందలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హిందూ మతం నుంచి ఇస్లాం వంటి ఇతర మతాల్లోకి మారిన వ్యక్తులు, తమ పాత సామాజిక వర్గం ఆధారంగా బిసి రిజర్వేషన్‌ను కోరలేరని తేల్చిచెప్పింది. ఒక మతంలో ఉన్న సామాజిక వెనకబాటుతనాన్ని మరో మతంలోకి మారిన తర్వాత కూడా అదే విధంగా పరిగణించలేమని పేర్కొంది. ఈ మేరకు తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన తరువాయి 8లో



ప్రజాపక్షం దినపత్రిక
యాజమాన్యానికి,
పాఠకులకు, పాత్రికేయులకు, సిబ్బందికి
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు
బతుకమ్మ & దసరా శుభాకాంక్షలు

I.SAMBASIVA RAO
General Secretary
Cell : 99080 70121



P.N. SWAMY
President :
Cell : 98490 45583

SCWA, MALLAPUR
SENIOR CITIZEN WELFARE ASSOCIATION, MALLAPUR
(Regd. No. 01/2020, Govt.of Telangana) Medchal-Malkajgiri Dist.
Senior Citizen Bhavan, NFC Colony, Opp. Noma Kalyana Vedika, Mallapur, Hyderabad - 500 076, Telangana State.



# ఇలాంటి వారు గవర్నర్లా!?

మోదీ ప్రభుత్వ సిఫార్సు మేరకు నాలుగు రోజుల క్రితం రాష్ట్రపతి నియమించిన నలుగురు గవర్నర్‌లలో ఇద్దరు వివాదాల్లో చిక్కుకున్నారు. వారు ఒడిశా గవర్నర్ బ్రజ్ మోహన్ రామ్, సిక్కిం గవర్నర్ దుష్యంత్ గౌతమ్. ఇందులో ముఖ్యంగా దుష్యంత్ గౌతమ్ నియామకం అత్యంత వివాదాస్పదంగా మారింది. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన ఈయన ఒక యువతి అత్యాచారం, హత్య కేసులో తన ప్రమేయంపై సిబిఐ దర్యాప్తును ఎదుర్కొంటున్నారు. సిక్కిం గవర్నర్‌గా ఈయన నియామకం జరిగిన వెంటనే, దానిని వ్యతిరేకిస్తూ బాధితురాలు అంకితా భండారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఢిల్లీలోని ఇండియా గేట్ ఎదుట బుధవారం నిరసనకు దిగారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వచ్చి వారికి సంఘీభావాన్ని ప్రకటించారు. ఒక యువతికి సంబంధించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ, సిబిఐ దర్యాప్తు కొనసాగుతున్న తరుణంతో దుష్యంత్ గౌతమ్ నియమకంపై పునరాలోచన చేయాలని భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు లేఖ రాశారు.

మరో వ్యక్తి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బ్రజ్ మోహన్ రామ్ ఒడిషా గవర్నర్‌గా నియమితులైన వెంటనే, తాను నిబద్ధత కలిగిన బిజెపి కార్యకర్తను అని అన్నారు. అంతే కాకుండా గవర్నర్‌గా నియమితుడైన వ్యక్తి ఒడిషాలో బిజెపిని సంస్థాగతంగా క్రియాశీలం చేసి, మరిన్ని ఓట్లు లభించేందుకు కృషి చేస్తానంటూ చెప్పినట్లు మీడియాలో వచ్చిన వార్తలు దూమారం రేపాయి. ఒకసారి ఎంఎల్‌ఏ, మూడు సార్లు ఎంపిగా గెలిచిన వ్యక్తికి గవర్నర్ పదవి, బాధ్యతల గురించి తెలియదనుకోవడం పొరపాటే. రాష్ట్ర ప్రథమ పౌరుడిగా పార్టీలకు అతీతంగా నిష్పాక్షికంగా ఉండాల్సిన గవర్నరే ఆ రాష్ట్రంలో అధికార పార్టీని బలోపేతం చేస్తాననడం ఎలాంటి సంకేతాన్నిస్తోంది. గవర్నర్‌గా నియమితుడైన వ్యక్తి, తన గత రాజకీయ కార్యకలాపాలకు, భవిష్యత్ రాజ్యాంగ విధులకు మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని ప్రదర్శించగలగాలి. ఒడిషాలో బిజెపి ప్రభుత్వమే ఉన్నందున పెద్ద ఇబ్బంది లేనప్పటికీ, సిక్కింలో పరిస్థితి వేరు. అక్కడ గతంలో బిజెపి మిత్రపక్షంగా ఉన్న సిక్కిం క్రాంతికారి మోర్చ( ఎస్‌కెఎం) మొత్తం 32 ఎంఎల్‌ఏల స్థానాలలో అన్నిటినీ గెలుచుకొని తిరుగులేని మెజారిటీతో అధికారంలో ఉంది. తక్కువ స్థానాలు ఉండడంతో ఏమైనా జరగవచ్చనే అభిప్రాయం ఉంది.

మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన 12 ఏళ్ళలో గవర్నర్‌లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వత్తాసుగా వ్యవహరిస్తున్నారు. బిజెపి, దాని మిత్రపక్షాల యేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలకు అనేక అంశాలలో మోకాలడ్డడమే కాకుండా, పరిపాలనకు ఆటంకాలు సృష్టిస్తున్నారు. అలాంటి వారిలో తమిళనాడు గవర్నర్‌గా వ్యహరించిన ఆర్.ఎన్.రవి, కేరళ గవర్నర్‌గా వ్యవహరించిన రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ వంటి వారు ముఖ్యమంత్రులతో ప్రత్యక్షంగా తలపడడం చూశాము. శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులపై సంతకం చేయకుండా ఏళ్ళ తరబడి నాన్చడం, వైస్ ఛాన్స్‌లర్‌ల నియామకాలలో తలదూర్చడం వంటి సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించే చర్యలకు ఒడిగట్టారు. రవి కుమార్ అయితే, తమిళులకు అత్యంత ప్రీతిపాత్రమైన తమిళ భాషపై ఉద్దేశ్యపూర్వక వివక్ష ప్రదర్శిస్తూ, హిందీకి ప్రాముఖ్యతనిచ్చేవారు.

శాసనసభ సమావేశాల ప్రారంభం సందర్భంగా సంప్రదాయం ప్రకారం రాష్ట్ర క్యాబినెట్ ఆమోదిత ప్రసంగాన్ని కాకుండా తమకు నచ్చి న పంక్తులను చేర్చడమో, లేదా ఉన్నవాటిని విస్మరించటమో చేసేవారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలో సైతం తమిళసై సౌందర్‌రాజన్ గవర్నర్‌గా ఉన్న సమయంలో నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రభుత్వం పంపిన ఫైళ్ళను ఆపిన ఉదంతం మరుగునపడలేదు. అలాగే గతంలో పశ్చిమ బెంగాల్, ఢిల్లీలో సిఎంలుగా మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్‌లు ఉండగా, గవర్నర్‌లే ప్రత్యక్ష పరిపాలనలో తలదూర్చడం తెలిసిందే. ఆర్‌ఎస్‌ఎస్ వాది అయిన ఆర్లేకర్‌ను తమిళనాడుకు పూర్తికాలం గవర్నర్‌గా నియమితులు కావటం విజయ్ ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగించక మానదు.

నిజానికి గవర్నర్‌గా వివిధ రంగాలలో నిష్ణాతులు, అనుభవజ్ఞులు, నైతిక విలువలతో గౌరప్రదులుగా గుర్తింపు ఉన్న వారిని నియమిస్తుంటారు. ఎందుకంటే రాష్ట్రంలో రాజ్యాంగాధిపతిగా, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఉంటూనే, సమాఖ్యవాదానికి పట్టంగట్టిన రాజ్యాంగానికి అనుగుణంగా కేంద్ర–రాష్ట్ర సంబంధాలను సుహృద్భావ వాతావరణంలో నడపాల్సిన బాధ్యతలు గవర్నర్ భుజాలపైన ఉంటాయి. గవర్నర్ ప్రధానమంత్రికి రాజకీయ ప్రతినిధి కాదు, అలాగే ముఖ్యమంత్రికి బేషరతు మద్దతుదారుడు కూడా కాదు. ఆ పదవి రాజ్యాంగ పరిమితుల్లో పనిచేయాలి, న్యాయ నిర్ణయాలను గౌరవించాలి, అలాగే కేంద్ర అధికారానికి, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ అధికారానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పాటించాలి. కానీ, ఇటీవల నియామకాలు లోక్‌భవన్‌లు అధికార పార్టీకి అనుబంధంగా మారుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఒకే దేశం ఒకే ఎన్నిక వంటి కేంద్రీకృత చట్టాలను తీసుకురావాలని తలపోస్తున్న కేంద్రానికి రాష్ట్ర గవర్నర్‌ల పాత్ర కీలకంగా మారింది.

రాజ్యాంగబద్ధమైన పదవుల భర్తీలో అనుసరిస్తున్న తీరును, రాజ్యాంగ సంస్థలు, పదవులపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. నిజానికి బ్రిటీష్ పాలన నాటి అవశేషం లాంటి గవర్నర్ పదవి కొనసాగింపుపై గత కొంత కాలంగా చర్చ జరుగుతోంది. ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం నియమించే గవర్నర్ పెత్తనమేమిటనే ప్రశ్న ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రస్ఫుటమవుతోంది. అందుకే గవర్నర్ వ్యవస్థను తొలగించాలనే డిమాండ్ కూడా ఉపందుకున్నది.

ఒడిషా గవర్నర్‌గా నియమితులైన బ్రజ్ మోహన్ రామ్ తన రాజకీయ అస్థిత్వాన్ని బహిరంగంగా చాటుకోవడం ఆందోళనకరం. ఒక సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ గౌతమ్ నియామకం నైతిక విలువల పతనానికి పరాకాష్ఠ. ఆయన గవర్నర్‌గా ఉన్న కాలంలో సిబిఐ దర్యాప్తు నుంచి ఆయనకు రక్షణ ఉంటుంది. అలాంటప్పుడు ఒక యువతి దారుణ హత్యకు ఏ విధంగా న్యాయం జరుగుతుంది. భేటీ బచావో అని నినాదాలు చేసే మోదీ ప్రభుత్వం ఈ నియామకం ద్వారా ఎలాంటి సంకేతాలిస్తోంది. ఈ రెండు నియామకాలు మోదీ ప్రభుత్వంలోని నైతిక పతనానికి నిదర్శనం. ఇప్పటికే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా సర్ పేరిట 13 కోట్ల ఓట్లను గాలిలో దీపంలాగా మార్చిన మోదీ సర్కార్, తాజాగా గవర్నర్‌ల నియమకాల ద్వారా మరో అడుగు పాతళంలోకి వేసింది. ఇప్పటికైనా ఆ రెండు నియామకాలను ఉపసంహరించుకుంటే గుడ్డిలో మెల్లలాగా పరువు దక్కుతుంది. ●



## 'విబి-జి-రామ్ జి' బిల్లు బలవంతంగా ఆమోదం

**'నరేంద్రమోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో 'విబి-జి-రామ్ జి' బిల్లును బలవంతంగా ఆమోదింపజేసింది. రాజ్యాంగబద్ధమైన పనిహక్కును ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ కింద హామీ ఇవ్వబడిన వేతన పెంపు హక్కును అంతం చేసింది. ఇప్పుడు గిరిజన, ఇతర సాంప్రదాయ అటవీ నివాసవర్గాలకు చెందిన లక్షలాది మంది అటవీ హక్కుల చట్టం (ఎఫ్‌ఆర్‌ఎ)-2006 లబ్ధిదారులు కూడా 150 రోజుల అర్హతను కోల్పోవడం బాధాకరం. జాబ్ కార్డుల తొలగింపు, ఆధార్ ఆధారిత బ్రిడ్జ్ పేమెంట్ సిస్టమ్స్ (ఎబిపిఎస్), నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్)ల తప్పనిసరి వినియోగం ద్వారా ఇలాంటి వర్గాలకు చెందిన లక్షలాది మందిని ఈ పథకం నుంచి మినహాయించిన దానికి ఇది అదనం. 'విబి-జి-రామ్ జి' కింద ఉన్న ఏకైక హామీ సాంకేతిక ఆధారిత బహిష్కరణ కేంద్రీకరణ గ్రామ పంచాయతీలను బలహీనపర్చడమే'.**

— కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్




# వైద్య రంగంలో నిశ్శబ్ద విప్లవం 'అనస్థీషియా'

మానవ వైద్యచరిత్రలో శస్త్రచికిత్సను ఒక భయంకరమైన నరక యాతన నుండి సురక్షితమైన ప్రక్రియగా మార్చిన మహోన్నత ఆవిష్కరణ 'అనస్థీషియా' (నిర్మగ్నత/మత్తు మందు). 1846 అక్టోబర్ 16 న అమెరికాలోని బోస్టన్ నగరంలో విలియం థామస్ గ్రీన్ మోర్టన్ అనే డెంటిస్ట్ ప్రదర్శించిన 'డై ఈథైల్ ఈథర్' విజయవంతమైన ప్రయోగం శస్త్రచికిత్సల రూపురేఖలనే మార్చివేసింది. ఈ చారిత్రాత్మక ఘట్టానికి గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 16న 'ప్రపంచ అనస్థీషియా దినోత్సవం' నిర్వహిస్తారు. ఆధునిక వైద్యంలో నొప్పి లేని చికిత్సను సాధ్యం చేసి, కోట్లాది మంది ప్రాణాలను కాపాడుతున్న అనస్థీషియాలజిస్టుల సేవలను స్మరించుకోవడమే ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

అనస్థీషియా ఆవిష్కరణకు ముందు శస్త్రచికిత్స అంటే రోగికి వర్ణించలేని శారీరక, మానసిక చిత్రహింస. శస్త్రచికిత్స సమయంలో నొప్పిని తట్టుకోలేక రోగులు స్పృహ తప్పిపోవడం, షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోవడం సర్వసాధారణంగా జరిగేది. ఆధునిక అనస్థీషియా రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇది కేవలం నొప్పిని నివారించడమే కాకుండా, శస్త్రచికిత్సలు చేసే సమయంలో వైద్యులకు తగిన సమయాన్ని, రోగి శరీరంలో స్థిరమైన ఉష్ణోగ్రత, రక్తపోటు, ఆక్సిజన్ స్థాయిలను నిర్వహించే అవకాశాన్ని కల్పించింది. ఫలితంగా సంక్లిష్టమైన గుండె, మెదడు మరియు అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు సాధ్యమయ్యాయి.

చాలామంది భావించేట్లుగా అనస్థీషియాలజిస్ట్ బాధ్యత కేవలం శస్త్రచికిత్సకు ముందు మత్తు మందు ఇవ్వడం ముగిసిపోదు. ఆపరేషన్ థియేటర్‌లో రోగి ప్రాణాలకు రక్షణ కల్పించే తెరవెనుక కథానాయకుడు 'అనస్థీషియా' వైద్యుడే. ఆపరేషన్ ప్రారంభానికి ముందు రోగి ఆరోగ్యాన్ని అంచనా వేయడం, శస్త్రచికిత్స జరుగుతున్నంత సేపూ గుండె స్పందనలు, రక్తం ప్రసరణ, శ్వాసక్రియలను క్షణక్షణం పర్యవేక్షించడం మరియు శస్త్రచికిత్స అనంతరం రోగి స్పృహలోకి వచ్చే వరకు అత్యంత జాగ్రత్తగా చూసుకోవడం వీరి విధి. ఐసియు, అత్యవసర సంరక్షణ మరియు తీవ్రమైన నొప్పి నిర్వహణ లో కూడా వీరి పాత్ర కీలకం. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా సరైన అనస్థీషియా సేవలు అందుబాటులో లేకపోవడం నేటికీ ఒక పెద్ద సవాలుగా మిగిలిపోయింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నైపుణ్యం కలిగిన అనస్థీషియాలజిస్టుల కొరత తీవ్రంగా ఉంది. దీనితో పాటు అనస్థీషియా పట్ల రోగుల్లో ఉన్న అనవసరమైన భయాలు, అపోహలను తొలగించాల్సిన అవసరం ఉంది. సురక్షితమైన శస్త్రచికిత్స అనేది ప్రతి మానవుడి ప్రాథమిక ఆరోగ్య హక్కుగా మారినప్పుడే అందరికీ నాణ్యమైన వైద్యం అందుతుంది. వైద్యశాస్త్ర చరిత్రలోనే అత్యంత గొప్ప ఆవిష్కరణలలో ఒకటైన అనస్థీషియా, మానవాళిని నొప్పి అనే బంధనం నుండి విముక్తి చేసింది. మానసిక ధైర్యాన్ని, శారీరక ఉపశమనాన్ని ఇస్తూ ప్రతిరోజూ లక్షలాది శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించడంలో సహాయపడుతున్న అనస్థీషియాలజిస్టుల కృషి అమోఘమైనది. ఈ ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా సురక్షితమైన వైద్య సేవ ల విస్తరణకు పునరంకితం అవుతూ, రోగి ప్రాణ రక్షణలో రాత్రింబవళ్లు శ్రమించే అనస్థీషియా నిపుణులకు కృతజ్ఞతలు తెలుపుకోవడం మన అందరి బాధ్యత.

(అక్టోబర్ 16 ప్రపంచ అనస్థీషియా దినోత్సవం)



సుధాకర్ ఎవి,
9000674747

# ఢిల్లీలో శక్తివంతమైన రాజ్యం, పౌరుల మధ్య పోరాటం



డాక్టర్ అరుణ్ మిత్రా

ఢిల్లీలో మునుపెన్నడూ లేని రీతిలో చేసిన భద్రతా ఏర్పాట్లు రాజధానిని వాస్తవంగా ఒక సైనిక స్థావరం (కంటోన్మెంట్)గా మార్చేశాయి. ఇది బ్రిటిష్ పాలనను గుర్తుకు తెస్తున్నాయి. అప్పట్లో వలస పాలకులు ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు, అసమ్మతిని అణగదొక్కేందుకు క్రూరమైన బలప్రయోగాన్ని ఉపయోగించేవారు. కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా సిజెపి, ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎ నాయకులను, కార్యకర్తలను, అలాగే విద్యార్థులను, యువతను పెద్ద సంఖ్యలో అరెస్టు చేయడం, మోదీ ప్రభుత్వంలో పెరుగుతున్న భయాందోళనలను, అభద్రతాభావాన్ని బట్టబయలు చేస్తోంది.

జంతర్‌మంతర్ వద్ద తమ పౌరులు చేస్తున్న శాంతియుత నిరసనను ఎదుర్కొనేందుకు సన్నద్ధతలాగా కాకుండా, ఢిల్లీ ఏదో శత్రు సైన్యంపై దండ యాత్రకు సిద్ధమవుతున్నట్లుగా ఈ భద్రతా మోహరింపుల స్థాయి, తీరు కనిపిస్తోంది. ప్రజలు ఢిల్లీకి చేరుకోకుండా నిరోధించేందుకు రైళ్లను రద్దు చేయటం, ఇతర రవాణా మార్గాలపై తనిఖీలను కఠినతరం చేయడం వంటివి ప్రజాస్వామ్య అసమ్మతిని అణచివేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి మరిన్ని సాక్ష్యాలు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీనామా కోరుతూ జరుగుతున్న ఆందోళనను అదుపు చేయకపోగా, ఈ అణచివేత చర్య లు ఉద్యమాన్ని వికేంద్రీకరించి, రాజధాని దాటి దేశంలోని వివిధ ప్రాంతాలకు వ్యాప్తి చేశాయి.



ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలకు రకరకాలుగా స్పందిస్తాయి. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు సాధారణంగా సంభాషణకు ప్రాధాన్యతనిస్తూ, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తాయి. అయి తే, నిరంకుశ పాలనలు బలప్రయోగం, అణచివేత వంటి మార్గాలను అనుసరిస్తాయి. ఇలాంటి ప్రతిస్పందనలు బలాన్ని కాకుండా బలహీనతను, అభద్రతను, హేతుబద్ధత లోపాన్ని ప్రతిబింబిస్తా యి.

జర్మనీలో నాజీలకు, కార్పొరేట్ ప్రయోజనాలకు మధ్య జరిగిన సహకారానికి చరిత్రే సాక్ష్యం. నాజీలు యూదులను దేశ శత్రువులుగా చిత్రీకరిస్తూ, దేశ సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. వారు యూదు సమాజంపై ఉద్దేశపూర్వకంగా ద్వేషాన్ని, సామూహిక ఉన్మాదాన్ని రెచ్చగొట్టి, చివరికి గతంలో ఎన్నడూ లేని స్థాయిలో జాతి నిర్మూలనకు పాల్పడ్డారు. కమ్యూనిస్టులు, సోషలిస్టులు, కార్మిక సంఘాల వారు, సమాజంలోని ప్రగతిశీల వర్గాలు ఫాసిజాన్ని ప్రతిఘటించగా, యూదు వ్యతిరేక పక్షపాతంతోనో లేదా నాజీల క్రూరత్వపు భయంతోనో అనేకులు మౌన ప్రేక్షకులుగా మిగిలిపోయారు లేదా నాజీలకు మద్దతు కూడా ఇచ్చారు. ముస్సోలినీ హయాంలో ఇటలీలో కూడా ఇలాంటి నిరంకుశ పాలన, అణచివేత ధోరణి యే ఆవిర్భవించింది.

నేడు భారతదేశంలో మనం ఆందోళనకరమైన సారూప్యతలను చూస్తున్నాము. ఇక్కడ ప్రభుత్వ అధికారాన్ని చెలాయించే శక్తులు నిరంకుశ, మెజారిటీవాద ధోరణులను అంతకంతకూ ప్రదర్శిస్తున్నాయి. ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్న యువతను అడ్డుకోవడానికి పారామిలిటరీ బలగాలను మోహరించి, ఢిల్లీని భారీ పోలీసు పహారా నగరంగా మార్చడం ఈ వైఖరికి ఒక స్పష్టమైన నిదర్శనం. ఈ పరిణామాల వెనుక ఉన్న భావజాలానికి ఒక చారిత్రక నేపథ్యం కూడా ఉంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్ పాల్గొనలేదు. దాని విమర్శకుల ప్రకారం, అది వలసవాద వ్యవస్థతో సర్దుకుపోయింది. భగత్ సింగ్ వంటి విప్లవకారులను ధైర్యవంతులని, కానీ తప్పుదారి పట్టినవారని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన సిద్ధాంతకర్త ఎం. ఎస్. గోల్వాల్కర్ అభివర్ణించారు. గోల్వాల్కర్ జాతీయ సంపదను కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించాలని, తద్వారా అత్యధిక ప్రజలకు ఏమీ మిగలకుండా చేసి, కొద్దిమంది అధికారాలు గలవారు అధిక సంఖ్యాకులపై ఆధిపత్యం చెలాయించడానికి వీలు కల్పించాలని కూడా వాదించారు.

మణిపూర్‌లో మూడున్నర సంవత్సరాల తర్వాత కూడా కొనసాగుతున్న హింస పట్ల చూపుతున్న ఉదాసీనత ఈ భావజాల ధోరణిని వివరించేందుకు ఉపయోగపడుతుంది. నిఘా, బలప్రయోగం ద్వారా పాలించబడే రాజ్యాన్ని సాధించాలనే తపన, ఇజ్రాయెల్‌తో బలపడుతున్న భారతదేశం రక్షణ, భద్రతా సంబంధాలలోనూ, పౌరులు, రాజకీయ ప్రత్యర్థులతో సహా వ్యక్తులను పర్యవేక్షించడానికి ఇజ్రాయెల్ అభివృద్ధి చేసిన పెగాసస్ గూఢచర్య సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించినట్లు వచ్చిన నివేదికలలోనూ మరింతగా ప్రతిబింబిస్తుంది.

ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్‌ఐఆర్)అమలులో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రవర్తనపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తడంతో, ప్రభుత్వం ఇప్పుడు ఆత్మరక్షణలో పడింది. కోర్టు అనుమతితోనే ఫామ్–6కు చేసిన మార్పులు చేశామన్న జ్ఞానేశ్ కుమార్ వాదనకు విరుద్ధంగా, ఆ మార్పులకు తమ ఆమోదం లేదని భారత సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించే బాధ్యత అప్పగించబడిన ఒక సంస్థకు అధిపతిగా, ఈ వైరుధ్యం ఆయన విశ్వసనీయత, నిజాయితీపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. ఈ చర్యలు ఎన్నికల సంఘం నైతిక అధికారానికి, ప్రజా విశ్వాసానికి కలిగించిన నష్టం మరింత ఆందోళనకరం. ఎస్‌ఐఆర్ ప్రక్రియ కారణంగా 13కోట్లకు పైగా భారత పౌరులు ఓటర్ల జాబితాల నుండి మినహాయించబడతారని, వారి ఓటు హక్కు నిరాకరించబడే అవకాశం ఉందని తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఇంత పెద్ద ఎత్తున ఓటు హక్కును కోల్పోవడం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పు. ముఖ్యంగా, ప్రజాస్వామ్య జవాబుదారీతనం, పౌరుల హక్కుల పరిరక్షణ ఇప్పటికే ఒత్తిడికి గురవుతున్న తరుణంలో ఇది మరింత ప్రమాదకరం.

మన జనాభాలో అత్యధికులకు, విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి, ఆరోగ్యకరమైన పర్యావరణం, న్యాయమైన వేతనం వంటి హక్కులు అందని ఆకాంక్షలుగానే మిగిలిపోయాయి. చాలా మందికి, ప్రభుత్వ విధానాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి, అధికారంలో ఉన్నవారిని జవాబుదారీగా ఉంచడానికి ఉన్న కొన్ని అర్థవంతమైన మార్గాలలో ఓటు ఒకటి. ఈ ప్రాథమిక హక్కును బలహీనపరిచినా లేదా నిరాకరించినా, ప్రజలు తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి, ప్రజాస్వామ్య జీవితంలో పాల్గొనడానికి ఉన్న ఒక ముఖ్యమైన సాధనాన్ని కోల్పోతారు.

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌కు ఆపాదించబడిన వ్యాఖ్యల చుట్టూ నెలకొన్న వివాదం నేపథ్యంలో, భారతదేశం అంతటా వేలాది మంది యువకులు తమ గౌరవాన్ని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకునేందుకు ముందుకు వచ్చారు. ప్రజాస్వామ్య విలువలు క్షీణించడం, మోదీ ప్రభుత్వ అణచివేత చర్యలుగా వారు భావిస్తున్న వాటికి వ్యతిరేకంగా వారి ఆగ్రహం నిరసనల రూపంలో ఎక్కువగా వ్యక్తమవుతోంది. ప్రధాన మంత్రి, హోంమంత్రి ప్రభావంతో ఎన్నికల సంఘం పని చేస్తోందని ఆరోపిస్తూ, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా కూటమి' కూడా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ విధంగా ఈ ఉద్యమం ఎక్కువగా మోదీ ప్రభుత్వ విధానాలు, రాజకీయ నాయకత్వం వైపే మళ్ళించబడుతోంది.

నిరంతర ప్రజా ఉద్యమాలు అత్యంత శక్తివంతమైన, అణచివేత వ్యవస్థలను సైతం సవాలు చేయగలవని చరిత్ర నిరూపిస్తుంది. అయితే, అటువంటి ఉద్యమాలను సునిశితమైన ఆలోచన, రాజకీయ స్పష్టత, క్రమశిక్షణ, స్పష్టమైన దిశానిర్దేశంతో నిర్వహించాలి. ఫాసిజం వ్యాప్తిని ఎదుర్కోవటానికి ప్రజాస్వామ్య, లౌకిక, ప్రగతిశీల శక్తులతో కూడిన ఒక బలమైన, విస్తృతమైన కూటమిని నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉంది. ఈ పోరాటానికి ఐక్యత, వ్యూహాత్మక దూరదృష్టి, నిరంతర ప్రజా సమీకరణ అత్యంత అవసరం.

ద్రవ్య పెట్టుబడిలోని అత్యంత ప్రతిఘాతవాద, జాత్యాహంకార, సామ్రాజ్యవాద శక్తుల బహిరంగ, ఉగ్రవాద నియంతృత్వంగా ఫాసిజాన్ని జార్జి దిమిత్రోవ్ నిర్వచించారు. ఇది ఆర్థిక పెట్టుబడిలోని అత్యంత ప్రతిఘాతవాద వర్గాల ప్రత్యక్ష అధికార ప్రయోగాన్ని సూచిస్తుంది. ఇది బూర్జువా ప్రజాస్వామ్యాన్ని మార్చేసి, కార్మికవర్గం, రైతాంగం, మేధావులపై బహిరంగ హింస, అణచివేతలను ప్రవేశపెడుతుంది. అంతర్జాతీయ వేదికపై, ఇది తీవ్ర జాత్యాహంకారం, విస్తరణవాదం, సామ్రాజ్యవాద యుద్ధం ద్వారా వ్యక్తమవుతుంది.

ఆంటోనియో గ్రామ్సీ అవగాహన ప్రకారం ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం కేవలం సైనిక లేదా ఆర్థిక ఘర్షణలకు అతీతంగా రాజకీయ వ్యవస్థ, సాంస్కృతిక భాగస్వామ్యం, భావాల పోరాటాన్ని కూడా కలిగి ఉండాలని నొక్కి చెప్పింది. కార్మికులు, రైతులు మూల సూత్రాలను విడిచిపెట్టే సంస్కరణవాద రాజీలను, అలాగే రాజకీయ నిష్క్రియాత్మకతను తిరస్కరించి, పెట్టుబడిదారీ దోపిడీ, ఫాసిస్ట్ హింస నుండి ప్రజలను రక్షించగల విస్తృత కూటములను నిర్మించుకోవాలి. ఫాసిజం కేవలం బలప్రయోగంతోనే కాకుండా, తన విలువలను రోజువారీ ఆలోచనా విధానంలో, ప్రజా సంస్కృతిలో, సామాజిక సంస్థలలో పాతుకుపోయేలా చేయడం ద్వారా కూడా మనుగడ సాగిస్తుంది. కాబట్టి, దానిని ఓడించడానికి గ్రామ్సీ వర్ణించినట్లుగా ఒక 'స్థాన యుద్ధం' అవసరం. అంటే, నిరంకుశ భావజాలాలను సవాలు చేయడానికి, అవి ఆధారపడిన సామాజిక అంగీకారాన్ని కూల్చివేయడానికి పౌర సమాజం, సాంస్కృతిక సంస్థలు, సైద్ధాంతిక రంగంలో నిరంతరంగా సాగించే పోరాటం.

కాబట్టి, భారతదేశంలోని ప్రజాస్వామ్య శక్తులు తమ విభేదాలను పక్కనపెట్టి, రాజ్యాంగ విలువలు, పౌర స్వేచ్ఛలు, మానవ హక్కులను పరిరక్షించడానికి కలిసి ముందుకు సాగడం అత్యవసరం. అదే సమయం లో, వారు తమ స్వీయ లోపాలను, సంస్థాగత బలహీనతలను, రాజకీయ వ్యూహాలను నిజాయితీగా సమీక్షించుకోవాలి. దేశం ఎదుర్కొంటున్న ప్రాథమిక ప్రశ్నలపై ఐక్యతను, ద్వితీయ ప్రాధాన్యత అంశాలపై ఉన్న విభేదాలు అడ్డుపడటానికి అనుమతించకూడదు. సైద్ధాంతిక చర్చను నిర్మాణాత్మకంగా జరిపినప్పుడు, అది ఉద్యమాలను బలోపేతం చేసి, రాజకీయ అవగాహనను పెంచుతుంది. అయితే, వ్యక్తిగత ఆశయాలు, వర్గ ప్రయోజనా లు సంస్థాగత విశ్వసనీయతను దెబ్బతీసి, ఉమ్మడి కార్యాచరణను బలహీనపరిచి, ప్రజల విశ్వాసాన్ని క్షీణింపజేస్తాయి. బృహత్తర పోరాటం కంటే వీటికి ఎన్నడూ ప్రాధాన్యత లభించకూడదు.

ఈ పోరాటానికి రాజకీయ స్పష్టత, సంస్థాగత ఐక్యత, పటిష్టమైన వ్యూహం, నిరంతర ప్రజా భాగస్వామ్యం మార్గదర్శకంగా ఉండాలి. ముప్పు తీవ్రతను గుర్తించటంలో ఏమాత్రం విఫలమైనా, లేదా ఐక్యంగా, సమర్థవంతంగా ప్రతిఘటనను నిర్మించడంలో ఏ మాత్రం సంకోచించినా, అది కేవలం ప్రజాస్వామ్య సంస్థలకు, శ్రామిక ప్రజల హక్కులకే కాకుండా, సమాజం మొత్తానికే వినాశకరమైన పరిణామాలకు దారితీయవచ్చు.

# వ్యవసాయానికి నిధుల కొరత

భారతదేశంలో వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంపై తీవ్రంగా పడుతోంది. వేసవి ఎండలు కొన్ని ప్రాంతాల్లో తగ్గినప్పటికీ, అధిక ప్రాంతాల్లో ఇంకా వేసవిని తలపించే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ కారణంగా పండ్ల పెరుగుదల మందగించడం, కూరగాయల విత్తనాలు మొలకెత్తకపోవడం, చీడపీడలు పెరగడం వంటి సమస్యలు రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. వాతావరణ హెచ్చరికలు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైన ఆర్థిక వనరులు, సాంకేతిక సహాయం క్షేత్రస్థాయిలో సరిపోవడం లేదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఫలసాయం దాదాపు సగం తగ్గిందని రైతులు వాపోతున్నారు. అరటితోపాటు, బెండకాయ, ఆకుకూరలు, సొరకాయ, బీరకాయ వంటి కూరగాయల విత్తనాలు సరిగా మొలకెత్తడం లేదు. చీడపీడల దాడులు కూడా పంట నష్టాన్ని పెంచుతున్నాయి. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) నిపుణుల ప్రకారం, వాతావరణ పరిణామాలను ముందుగానే అంచనా వేసే సామర్థ్యం పెరిగింది. అయితే ఆ సమాచారాన్ని ఉపయోగించి రైతులు సకాలంలో విత్తనాలు మార్చడం, నీటిని సమర్థంగా వినియోగించడం, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం వంటి చర్యలు తీసుకోవడానికి తగిన సదుపాయాలు లేవు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం గురించి కూడా నిపుణులు హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యుఎన్‌ఇపి) నివేదిక




ప్రకారం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు 2023 లో వాతావరణ మార్పులను ఎదుర్కొనే అనుకూలన చర్యల కోసం కేవలం 26 బిలియన్ డాలర్ల అంతర్జాతీయ నిధులు అందాయి. అయితే, 2030 నాటికి భారతదేశానికి అనుకూలన చర్యల కోసం రూ.56.68 లక్షల కోట్ల వ్యయం అవసరమని 2023లో సమర్పించిన నివేదికలో అంచనా వేశారు. వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను తగ్గించడానికి, వాటిని తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడానికి ఖర్చు చేసే నిధులను 'అనుకూలన నిధులు' అంటారు. డబ్ల్యుఆర్‌ఐ నిపుణుల అభిప్రాయాన్ని అనుసరించి, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించడం అవసరం.

ముఖ్యంగా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ వంటి వర్షాధార ప్రాంతాల్లో నీటి లభ్యతను బట్టి పంటల ప్రణాళికలు రూపొందించాలని సూచిస్తున్నారు. పంటల బీమా, గ్రామీణ రుణాలు, మెరుగైన వాతావరణ అంచనాలు, నీటి నిర్వహణ వంటి చర్యలు చిన్న, సన్నకారు రైతుల కు కీలకం. కాగా,నవంబర్ 9 నుంచి 20వ తేదీ వరకు అంటాల్యా (తుర్కియే/టర్కీ)లో జరగనున్న 'కాప్ 31' అంతర్జాతీయ వాతావరణ సదస్సులో ప్రస్తుత ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునే వ్యవసాయం, ఆహార భద్రత, రైతులకు అవసరమైన ఆర్థిక సహాయం వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. అంతర్జాతీయంగా మరిన్ని గ్రాంట్లు, తక్కువ వడ్డీ రుణాలు అందించడం అవసరం.

## అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకు
# విశ్రమించేది లేదు

- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- ఎన్నికల నాటి హామీని సిఎం నెరవేర్చాలి : పశ్య పద్మ




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** అగ్రిగోల్డ్ బాధితులకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం శేషగిరిభవన్‌లో గురువారం జిల్లా స్థాయి అగ్రిగోల్డ్ బాధితుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిధులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ హాజరైనారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ రెక్కాడితే గానీ డొక్కాడని చిరువ్యాపారులు, రైతులు, పేదలు తమ కష్టార్జితాన్ని పొదుపు చేసుకుంటే ఆ సంస్థ నిలువునా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతపాలకుల నిర్లక్ష్యం కారణంగా ఏళ్లు గడుస్తున్నా బాధితులకు చిల్లిగవ్వకూడా అందకపోవడం దుర్మార్గమన్నారు. లక్షలాది మంది పేద కుటుంబాలు, ఎంతో మంది ఏజెంట్లు రోడ్డున పడి తీవ్ర మానసిక క్షోభతో ప్రాణాలు కోల్పోతుంటే ప్రభుత్వాలు చోద్యం చూడటం భావ్యం కాదన్నారు. సంస్థకు సంబంధించిన వేలకోట్ల విలువైన ఆస్తులను వెంటనే వేలం వేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ యాజమాన్యం బినామీ పేర్లతో దాచిపెట్టిన ఆస్తులను గుర్తించి తక్షణమే ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కంపెనీ మోసాలను తట్టుకోలేక మరణాలకు పాల్పడిన బాధితులు ఏజెంట్ల కుటుంబాలకు రూ.5 లక్షలచొప్పున నష్టపరిహారం ఇవ్వాలన్నారు. బాధితుల పక్షాన అసెంబ్లీలో గళమెత్తడంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పూర్తి న్యాయం దక్కేలా ఉద్యమిస్తామని భరోసా ఇచ్చారు.

### ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి న్యాయం చేయాలి : పశ్య పద్మ

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి తక్షణమే న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. 2005–15 మధ్య కాలంలో అగ్రిగోల్డ్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో పేదలు, రైతుల నుండి రూ.600 కోట్లకు పైగా వసూళ్లు చేసి ఘరానా మోసానికి పాల్పడిందన్నారు. ఒక్క తెలంగాణలోనే సుమారు 3 లక్షల మంది బాధితులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వంద రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికైనా ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాధితులకు న్యాయం చేసేందుకు 35,444 మంది భూములను నిషేదిత జాబితా నుండి తొలగించిన మాదిరిగానే తెలంగాణాలోనూ తక్షణ నిర్ణయం తీసుకోవాలన్నారు. కంపెనీ వెంచర్లలో పేదలు కొనుగోలు చేసి ఇప్పటికే రిజిష్ట్రేషన్ పూర్తయిన ఇండ్ల స్థలాలను అటాచ్‌మెంట్ జాబితా నుండి తొలగించి బాధితులకు అప్పగించాలన్నారు. ఏళ్ల తరబడి బాధితులు ఏజెంట్లు ఆవేదనతో బతుకుతుంటే పాలకులు మొద్దునిద్ర వీడకపోవడం దారుణమన్నారు. బాధితల పక్షాన జరిగే రాజీలేని పోరాటాలకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, రైతు సంఘం జిల్లనాయకులు వైఎస్ గిరి, తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు, బాధితులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## 'ఎల్ నినో'ను ఎదుర్కొనేందుకు..
# సమగ్ర కార్యాచరణ
### సిద్ధం కావాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తలెత్తే కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత, ఉపాధి సమస్యలు, పశుగ్రాసం అభావం వంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి ఆదివాసీ గిరిజన కుటుంబానికి కనీసం 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని స్పష్టం చేశారు. బేగంపేటలో గురువారం విబిజిరామ్ జి' ద్వారా ఎల్‌నినో కరువు నివారణ చర్యలపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సుకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్‌తో పాటు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, ఐటిడిఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అదనపు డిఆర్‌డిఓలు, పిఓలు, ఎంపిడిఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. చిట్టచివరి గ్రామంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధి చెందడమే నిజమైన సమగ్ర అభివృద్ధి అని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 నుంచి 18 జిల్లాల పరిధిలో సాధారణ వర్షపాతం కంటే 20 శాతానికి పైగా లోటు నమోదైందని, 18 జిల్లాల్లోని 320 మండలాలను తీవ్ర ఎల్‌నినో ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించినట్లు నివేదికలు చెబుతున్నాయని తెలిపారు. సాధారణ వేసవి ప్రభావం మూడు నెలలే ఉంటుందని, కానీ ఈసారి దాదాపు ఎనిమిది నెలల పాటు వేసవి తరహా పరిస్థితులు ఉండే అవకాశమున్నందున అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అత్యంత కీలకమని, రాబోయే ఐదు నెలల్లో ప్రతి జాబ్‌కార్డులకు నెలకు కనీసం రూ.7,500 వేతనం అందేలా లక్ష్యంగా పెట్టుకోవాలని చెప్పారు. పనుల్లో పారదర్శకత కోసం ప్రతి ఆదివాసీ నివాస ప్రాంతంలో ఒక మేట్‌ను నియమించాలని, వేతనాలు సకాలంలో చెల్లించాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ కింద లభ్యమయ్యే 370 రకాల పనులను ఉపయోగించుకుని ఊట చెరువులు, పెర్కొలేషన్ ట్యాంకులు, కందకాల తవ్వకం, మట్టి రహదారుల నిర్మాణం వంటి పనుల ద్వారా గ్రామాల్లో శాశ్వత ఆస్తులను సృష్టించాలని పిలుపునిచ్చారు. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తేనే ప్రజల సమస్యలు తెలుస్తాయని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, ఐటిడిఏ, పేదరిక నిర్మూలన సంస్థలు సమన్వయంతో పని చేసి ఎల్‌నినో సవాల్‌ను విజయవంతంగా ఎదుర్కోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం

కాంగ్రెస్ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి భారీ మెజారిటీ సాధించాలి
మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాబోయే వరంగల్, ఖమ్మం, నల్గొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా హనుమకొండ జిల్లా మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క), కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ రాబోయే వరంగ, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగస్తులు, పట్టభద్రులు, నిరుద్యోగ యువతతో పాటు విద్యావంతులందరినీ కలుపుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలను తెలుసుకుంటూ, వారితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పార్టీ ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేస్తూ పట్టభద్రులతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమష్టి కృషి చేయాలన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగస్తులు, పట్టభద్రులు, యువతను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల సన్నాహాలను పటిష్టంగా నిర్వహించాలని అయూబ్ కోరారు. అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు, ఓటరు జాబితాలో వివరాల పరిశీలన, ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులంతా ఐక్యంగా ముందుకు సాగుతూ, పార్టీ నాయకత్వం నిర్దేశించిన కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి కృషి చేయాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, చైర్మన్స్, డిసిసి అధ్యక్షులు , రాష్ట్ర, జిల్లా, మండల, డివిజన్, టౌన్, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులన్నీ డిజిటల్ బాటలోకి!

- 15 రోజుల్లో సమగ్ర ప్రణాళిక సమర్పించాలి..
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో గేట్ ఎంట్రీ నుంచి రైతులకు చెల్లింపుల వరకు ప్రతి దశను డిజిటలైజ్ చేసి, పారదర్శక మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను రూపొందించి 15 రోజుల్లోగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రాహుల్ రాజ్‌తో సమావేశమైన మంత్రి.. మార్కెట్ యార్డుల ఆధునికీకరణ, సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు, గోదాముల నిర్మాణం, సిబ్బంది నియామకాలపై సమీక్షించారు. మార్కెట్లలో వాహనం ప్రవేశించినప్పటి నుంచి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు, తూకం, లావాదేవీలు, చెల్లింపులు పూర్తయ్యే వరకు అన్ని ప్రక్రియలను డిజిటల్ విధానంలో నిర్వహించాలని సూచించారు. రైతులకు ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు జరిగేలా వ్యవస్థను రూపొందించాలని, తద్వారా పారదర్శకత, జవాబుదారీతనం పెంచి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి మార్కెట్ యార్డులో సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే 10 మార్కెట్ యార్డుల్లో ఇందుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. మరోవైపు, తక్కువ స్థలంలో ఎక్కువ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేలా సైలోస్ విధానంలో గోదాములను నిర్మించాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ పరిధిలో గోదాముల నిల్వ సామర్థ్యాన్ని రెండు లక్షల మెట్రిక్ టన్నులకు పెంచే లక్ష్యంతో అవసరమైన నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు.మార్కెటింగ్ శాఖలో ఇంజనీరింగ్ అధికారుల నియామకాలను వేగవంతం చేయాలని,టిజిపిఎస్‌సి లేక జెఎన్‌టియూ ద్వారా నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అజీజ్‌నగర్‌లో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కొత్త మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, తూప్రాన్, గజ్వేల్, సూర్యాపేట తదితర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న సమీకృత మార్కెట్లను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ గ్రోత్ కారిడార్ ఎండి ఉపేందర్‌రెడ్డితో మాట్లాడిన మంత్రి కోహెడ్ మార్కెట్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మార్కెట్ యార్డులను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లోని కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచాలి

నవంబర్ 12 నుంచి ఆందోళనలు : ఎండి.యూసుఫ్, ఎం.నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. జీతాల పెంపు, కార్మిక చట్టాల ప్రకారం సెలవుల అమలు కోసం నవంబర్ 12 నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. గత ఐదేళ్లుగా చాలీచాలని వేతనాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల క్రితం టెండర్లు పిలిచిన సమయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్మికులకు తక్కువ వేతనాలు అందుతున్నాయని పేర్కొన్నారు. కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లు కావస్తున్నా కొత్త టెండర్లు పిలవకపోవడం, వేతనాలు పెంచకపోవడం పట్ల ప్రభుత్వ అధికారుల తీరును విమర్శించారు. కార్మికుల వేతనాల పెంపు, చట్టబద్ధమైన సెలవుల అమలు కోరుతూ ఈ నెల 22న సంబంధిత అధికారులకు నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు చట్టం ప్రకారం ఏడాదికి 23 సెలవులు అమలు చేయాల్సి ఉన్నా, నేటికీ అమలు కావడం లేదని ఆరోపించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య, యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మీ బాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, కార్యదర్శులు పి.సురేష్, ఏ.పార్వతి, జె.లక్ష్మీ, ఎస్.కిష్టమ్మ, ఎఐటియుసి నాయకులు గన్నార రమేష్, సిరా దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వారం రోజులు వర్షాలు

- పలు జిల్లాలకు ఉరుములు, ఈదురుగాలుల హెచ్చరిక
- వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గురు, శుక్రవారాల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్ర, శనివారాల్లో వరంగల్, హనుమకొండ, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలు కూడా ఈ హెచ్చరిక పరిధిలోకి వస్తాయన్నారు. శనివారం నుంచి సోమవారం వరకు రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు వర్షాలు విస్తరించే అవకాశముందన్నారు. జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లో కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు. సోమ, మంగళవారాల్లో వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశముందన్నారు. వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అదే సమయంలో జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగే అవకాశముందన్నారు. బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్తంగా కొన్ని చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.


తెలంగాణ ప్రభుత్వము
**రోడ్లు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్&బి) కార్యాలయం, డివిజన్: గజ్వేల్

NIT NO. 02/EE/R&B/GJWL/2026-27 తేది: 14.10.2026

| క్ర.సం. | పని పేరు | అంచనా విలువ |
|---|---|---|
| 1 | సిద్దిపేట్ జిల్లాలోని గజ్వేల్ (ఆర్&బి) డివిజన్‌కు సంబంధించిన (04) పనులు. | రూ.98.00 లక్షలు |

1. బిడ్ సమర్పణకు ఆఖరి తేదీ: రూ.31.10.2026 సా.4.00గం.ల వరకు
2. సంప్రదించవలసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్&బి), డివిజన్: గజ్వేల్, సిద్దిపేట్ జిల్లా. ఫోన్ నెం. 8328306839
3. మరిన్ని వివరాలకు 'ఇ'ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- I/c ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్&బి), డివిజన్: గజ్వేల్
DIPR R.O. No. : 11969-PP/CL/ADVT/2026-27, Date: 15-10-2026



**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కూకట్‌పల్లి జోన్**

Lr No. 04/CMC/KPZ/EE(CTO)/2026-27 తేది: 15.10.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 04/CMC/KPZ/EE(CTO)/2026-27, తేది: 15.10.2026 | మెన్ అండ్ మెషినరీ | రూ. 168.00 లక్షలు | 15.10.2026 ఉ.10.30గం.ల నుండి 16.10.2026 ఉ.10.30గం.ల వరకు | శ్రీమతి ఐ.శ్రీకాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సిటిఓ), సిఎంసి, కూకట్‌పల్లి జోన్, సెల్ నెం. 9701414306 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సిటిఓ), కూకట్‌పల్లి జోన్, సిఎంసి.
DIPR R.O. No. : 12007-PP/CL/ADVT/2026-27, Date: 15-10-2026



**శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము**
గ్రా. & మం. పాలకుర్తి, జిల్లా: జనగామ- 506146.

సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము

Letter No. SSLNST/Tender Notice/2026 Date: 15.10.2026

దేవాదాయ ధర్మాదాయశాఖ, జనగామ జిల్లా, పాలకుర్తి గ్రా. & మం., శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము నందు తేది: 29.10.2026 గురువారం రోజున ఉ.11:00 గం.ల నుండి సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము ద్వారా ఈ క్రింద తెలిపిన పద్దులపై టెండర్లు కోరబడుచున్నవి. పూర్తి వివరాలకోసం దేవస్థాన కార్యాలయమును సంప్రదించగలరు.

| క్ర.సం. | వేలము వివరములు | డిపాజిట్ సొమ్ము | కాలపరిమితి |
|---|---|---|---|
| 01. | కొబ్బరి కాయలు మరియు ఇతర పూజా సామాగ్రి (అభిషేక సామాగ్రి మినహాయించి) వాహన పూజ సామాగ్రి సప్లయ్ చేయు హక్కు, | రూ.5,00,000/- | తేది: 01.01.2027 నుండి 31.12.2027 వరకు |
| 02. | తలనీలాలు ప్రోగు చేసుకొను హక్కు | రూ.5,00,000/- | తేది: 18.01.2027 నుండి 17.01.2028 వరకు |
| 03. | కొబ్బరి చిప్పలు ప్రోగుచేసుకొను హక్కు | రూ.1,00,000/- | తేది: 10.01.2027 నుండి 09.01.2028 వరకు |

సం/- కార్యనిర్వాహణాధికారి, శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము పాలకుర్తి గ్రా. & మం., జనగామ జిల్లా.
DIPR R.O. No. : 11979-PP/CL/ADVT/2026-27, Date: 15-10-2026



**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్&బి), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004.**

NIT NO. 20/ AEE/DEE(T)/EE/SBD/Maintenance Works/2026/, Dated: 14.10.2026.

| | |
|---|---|
| పనుల పేరు: | 1. హైదరాబాద్, మలక్‌పేట్ కాలనీలోని 224 ఫ్లాట్లు గల ఎ-బ్లాక్‌లోని ఫ్లాట్ నెం. ఎ-601కి సంబంధించిన కొన్ని సివిల్ మరియు శానిటరీ పనులు-2వ కాల్. ECV: రూ. 3,04,124/- 2. హైదరాబాద్, మలక్‌పేట్ కాలనీలోని 224 ఫ్లాట్లలో గల బి-బ్లాక్లోని బి-516 ఫ్లాట్ యొక్క ఉమ్మడి బాత్రూం వల్ల బి-416 ఫ్లాట్‌కు లీకేజీలు కలుగుతున్నందున, ఆ ఫ్లాట్‌కు సంబంధించిన కొన్ని మరమ్మతులు మరియు కొన్ని సివిల్ & శానిటరీ పనులు -2వ కాల్. ECV: రూ.2,60,703/- 3. హైదరాబాద్, మలక్‌పేట్ కాలనీలోని 224 ఫ్లాట్లలో గల బి-బ్లాక్‌లోని ఫ్లాట్ నెం.711కు సంబంధించిన కొన్ని సివిల్ మరియు శానిటరీ మరమ్మతు పనులు..-2వ కాల్. ECV: రూ. 1,62,663/- 4. హైదరాబాద్, మలక్‌పేట్‌కాలనీలోని ప్రభుత్వ నివాస క్వార్టర్ నెం. సి-45కు సంబంధించిన కొన్ని సివిల్ మరియు శానిటరీ పనులు. 2వ పిలుపు, ECV: రూ.3,64,967/- 5. హైదరాబాద్, న్యాయ విహార్ కాంప్లెక్స్, బ్లాక్ నెం.3, గౌరవనీయ శ్రీమతి జస్టిస్ టి.మాధవి దేవి గారి అధికారిక నివాసంలోని ప్రధాన ప్రవేశ ద్వారం గేటు ముందు ఉన్న వర్షపు నీటి కాలువపై ఇనుప కడ్డీలతో కుంభాకార ర్యాంప్ను ఏర్పాటు చేయడం. -3వ పిలుపు, ECV: రూ. 92,520/- 6. హైదరాబాద్, జూబ్లీహిల్స్, న్యాయ విహార్ కాంప్లెక్స్‌లోని పనివారి క్వార్టర్లలో నీటి లీకేజీలను అరికట్టడానికి కొన్ని సివిల్ పనులు. -3వ పిలుపు, ECV: రూ.87,541/- |
| డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ | 16-10-2026 మధ్యాహ్నం 03.00 గంటలకు |
| బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం | 23-10-2026 మధ్యాహ్నం 03.30 గంటల వరకు |
| బిడ్ల ప్రారంభ తేదీ | 23-10-2026 సాయంత్రం 04.00 గంటల నుండి |
| ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్&బి) పేరు మరియు చిరునామా | శ్రీ జి. రజనీ బాబు, ఎం. టెక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్&బి), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్. |

మరిన్ని వివరాలను 16.10.2026, మధ్యాహ్నం 03:00 గంటల నుండి https://tender.telangana.gov.in లోని 'ఇ-ప్రొక్యూర్‌మెంట్' మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్&బి), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్.
DIPR R.O. No. : 12022-PP/CL/ADVT/2026-27, Date: 15-10-2026


## ఎల్‌బి స్టేడియంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ: లలిత వాకిటి శ్రీహరి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి లలిత పాల్గొని సందడి చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవితో పాటు అథారిటీ ఉద్యోగులు వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంప్రదాయానికి అద్దంపట్టేలా బతుకమ్మలను అందంగా అలంకరించి, ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. మహిళలు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాల్లో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పారు. తెలంగాణ అస్తిత్వానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం ద్వారా భావితరాలకు రాష్ట్ర సంస్కృతి, వారసత్వాన్ని అందించవచ్చనే సందేశాన్ని ఈ వేడుకలు చాటిచెప్పాయి.




# బొగ్గు దిగుమతి ముసుగులో భారీ మోసానికి కుట్ర : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో సిఎం రేవంత్ రెడ్డి రూ.3 వేల కోట్ల భారీ స్కాముకు కుట్ర చేస్తున్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. భోత్రా లాజిస్టిక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ చేసుకున్న అన్ని రహస్య అగ్రిమెంట్లను బయటపెట్టాలని, ఈ కుంభకోణంపైన స్వతంత్ర సంస్థతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏ ప్రాతిపదికన సదరు కంపెనీని ఎంపిక చేశారో సమాధానం చెప్పాలన్నారు. విదేశీ బొగ్గు దిగుమతి పేరుతో సింగరేణి సంస్థకు సిఎం రేవంత్ రెడ్డి మరణశాసనం రాస్తున్నారని, కాంగ్రెస్ – బిజెపి కలిసి చేస్తున్న ఈ కుట్రలను బిఆర్‌ఎస్ చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి కెటిఆర్ గురువారం బహిరంగ లేఖ రాశారు. భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో ముందే ముఖ్యమంత్రి చీకటి ఒప్పందం చేసుకున్నారని, కావాలనే కృత్రిమ బొగ్గు కొరత ద్వారా కరెంట్ సంక్షోభాన్ని సృష్టించి, అదనుచూసి ఆ కంపెనీని రంగంలోకి దింపారని ఆరోపించారు. సింగరేణి సంస్థకు రూ.60 వేల కోట్ల బాకీ చెల్లించకుండా సంస్థను కుప్పకూల్చేందుకు కుతంత్రం చేస్తున్నారని, దేశీయ సంస్థలను పక్కనపెట్టి కమీషన్ల కోసమే విదేశీ బొగ్గు కోసం వెంపర్లాడుతున్నారని మండిపడ్డారు. కమీషన్ల ముసుగులో ప్రతిటన్నుకు రూ1500ల చొప్పున ఏకంగా రూ.3వేల కోట్ల దోపిడీకి సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క రంగం సిద్ధం చేశారన్నారు. భోత్రా లాజిస్టిక్స్ కంపెనీకి సింగరేణిలో కాంట్రాక్టులు అప్ప గించడంలో అనుసరించిన ప్రమాణాలేమిటని, ఏ అర్హతల ఆధారంగా ఈ సంస్థను ఎంపిక చే శారని ప్రశ్నించారు. 2023–24లో సుమారు 70.02 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదవ్వగా, 2025–26లో ఉత్పత్తి సుమారు 58 మిలియన్ టన్నులకు పడిపోయిందని, ఇందుకు కారణాలు ఏమటని ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో బొగ్గు, యాష్ హ్యాండ్లింగ్ వంటి పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగిం చి న అంశంపైన కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. విదేశీ బొగ్గు దిగుమతుల ప్రతిపాదనలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. ఇప్పటి వరకు జరిగిన చర్చలు, ప్రతిపాదనలు, టెండర్లు, కొనుగోలు పరిమాణం, ధరల అంచ నాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంక్షోభంపై ప్రభుత్వ ప్రణా ళికలను స్పష్టం చేయాలని, బొగ్గు సరఫరా, విద్యుత్ ఉత్పత్తి, ముందస్తు ప్రణాళికలో జరిగిన లోపాలపై సమగ్ర నివేదిక విడుదల చేసి, ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.



## పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ :** వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కోరారు.గురువారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు,ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇంకా 2,195 మంది ఓటర్లకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన పెండింగ్‌లో ఉందని, వాటిని ఇంటింటికీ వెళ్లి పరిశీలించి శుక్రవారం నాటికి పూర్తి చేయాలని తహసీల్దార్లు, బీఎల్‌ఓలను ఆదేశించినట్లు తెలిపారు.ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు,తొలగింపుల ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు.ఓటరు జాబితా నుండి తొలగించబడిన వారు తిరిగి ఓటు హక్కు పొందేందుకు ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.అక్టోబర్ 15,16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓటర్ల తొలగింపు విషయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపునకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, నోటీసులు, బీఎల్‌ఓ నివేదిక తదితర ప్రక్రియలను అనుసరిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమంగా మైనింగ్ తవ్వకాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

వెంటనే నిలిపివేయాలని నిరాహార దీక్షలు



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ మండలంలోని కాచారం గ్రామంలో నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్‌ను తక్షణమే నిలిపివేయాలని సిపిఐ దేవరకొండ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి అన్నారు. గురువారం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిరహార దీక్ష చేస్తున్న వారికి సిపిఐ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా రామస్వామి మాట్లాడుతూ సర్వే నెంబర్ 13లోని 183 ఎకరాలు పలుగు రాయితో కూడిన గుట్టమైనింగ్ ఉందని, ఇందులో గ్రామంలోని రైతులకు పట్టాలిచ్చారని నవభారత్ కంపెనీ వారు 1987లో మొదటి దశ పనులు 1997 వరకు మొదటి దశ పనులు ముగిశాయని, అయిన 1999 నుండి 2017 వరకు తవ్వకాలు నిర్వహించారని ఈ మైనింగ్ వలన గ్రామాల్లో మంచినీరు కలుషితం అయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పీల్చే గాలిలో కూడా ఆ పౌడర్ రావడంతో ఊపిరితిత్తులకు చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, గాలి కలుషితం అవుతున్నందున గుట్ట చుట్టూ గ్రీన్ బౌండరీ చేస్తామని చెప్పిన కంపెనీ దానిని పట్టించుకోలేదని, గ్రామానికి కావాల్సిన అభివృద్ధి చేస్తామని చెప్పి ఏమి చేయలేదని అన్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నా బ్లాస్టింగ్ చేయడం వల్ల భూమి కదిలి బోర్లు, బావులు ఎండిపోతున్నాయని ప్రభుత్వం మైనింగ్ లీజును రద్దు చేసి గ్రామ పంచాయతీకి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నియోజకవర్గ నాయకులు చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మల్లయ్య, గ్రామ సర్పంచ్ శామలయ్య, ఉప సర్పంచ్ మల్లేష్, అరుణ, సాలయ్య, సరిత, సైదయ్య, సీనయ్య, బాలకృష్ణ, జంగయ్య, పెద్దమ్మ, ప్రేమ్‌సాగర్, మస్తాన్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## డిండి ప్రాజెక్టు పూర్తి చేయకుండా రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.అంజయ్యా చారి

**ప్రజాపక్షం/నాంపల్లి :** డిండి ఎత్తిపోతల పథకాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్యా చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు డిండి ఎత్తిపోతల పథకాల పనులను పూర్తి చేయకపోవడంతో మునుగోడు, దేవరకొండ,నల్లగొండ రైతాంగానికి సాగునీరు అందక తీవ్ర నష్టం జరిగిందని,ఈ ప్రభుత్వం కూడా డిండి ప్రాజెక్టు పనులను పూర్తి చేయకుండా రైతులను మోసం చేస్తోందని మండిపడ్డారు.ఎల్ నినో ప్రభావం వల్ల రైతుల పంటలకు సాగునీరు లేక, బోర్ వాటర్ తగ్గడం వల్ల భూగర్భ జలాలు పడిపోవడంతో రైతులు పంట సాగుకు నీరు అందక తీవ్ర నష్టంలోకి కూరుకుపోతుంటే,మునుగోడు,దేవరకొండ,నల్లగొండ ప్రాంతాలకు సాగునీరు అందించకుండా పాలమూరురంగారెడ్డి జిల్లాలకు రెండు పంపులు ఓపెన్ చేసి సాగునీరు అందించడం దారుణమని విమర్శించా రు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా స్పందించి డిండి ఎత్తిపోతల పథకాల పనులను త్వరితగతిన పూర్తి చేయకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## ప్రభుత్వ భూముల్లో గుడిసెలు కూల్చివేత

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండలం జలాల్ పురం గ్రామంలోని సర్వే నంబర్ 80లో ఆ గ్రామ ప్రజలు అక్రమంగా వేసుకున్న గుడిసెలను గురువారం రెవెన్యూ అధికారులు పోలీసులు జేసిబీలతో కూల్చివేశారు.ప్రభుత్వ భూముల్లో ఎవరైనా సరే ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలతో పాటు చట్టరీత్య నేరాలుగా పరిగణించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.తహసీల్దారు ,సిఐ,ఎస్సై సంయుక్తంగా చేపట్టిన కూల్చివేతలో 12 తాత్కాలిక నిర్మాణాలని నేలమట్టం చేసినట్లు వివరాలు వెల్లడించారు. కూల్చివేత సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదనపు పోలీసులను దింపారు.న్యాయబద్ధంగా పట్టాలు,రిజిస్ట్రేషన్ ఉన్న స్థలాల్లో యధేచ్ఛగా ఇంటి నిర్మాణాలు చేపడితే ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు.



# నాణ్యమైన పత్తితో మద్దతు ధర

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రైతులు నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేసి, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్ధతు ధర పొందేలా తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. పత్తిసాగు, కోత, నిల్వ, విక్రయ ప్రక్రియల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే ఆశించిన మద్ధతు ధర లభిస్తుందని స్పష్టం చేశారు. రైతులు తమ పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చే ముందు తేమశాతం, పొడవు, మైక్రోనైర్ విలువ వంటి ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పత్తిలో తేమ గరిష్ఠంగా 8 శాతం మాత్రమే ఉండేలా బాగా ఆరబెట్టాలని, పత్తిలో ఆకులు, చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలు కలవకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పత్తి విక్రయాల్లో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు విధానాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను గానీ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను గానీ సంప్రదించాలని కోరారు. రైతుల సంక్షేమం, నాణ్యమైన పత్తి ఉత్పత్తి, సరైన ధర కల్పించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి కె. నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్‌డిఓలు వేణుమాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఆర్‌టిఓ పురుషోత్తం రెడ్డి, డిఎంఓ హార్టికల్చర్ ఆఫీసర్ నాగయ్య, ఏసిపిలు, కార్యదర్శులు, మిల్లర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు నమోదు ప్రక్రియకు సహకరించాలి**

రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు నమోదు ప్రక్రియకు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో జిల్లా కలెక్టర్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు నమోదు ప్రక్రియ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ పురోగతి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 15, 16 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ప్రచార దినాల్లో ఆయా రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు చురుకుగా పాల్గొన్నాలన్నారు. అర్హులైన కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం 6 నింపడంలో సంబంధిత అధికారులకు, ఓటర్లకు సహకరించాలని కోరారు.

# అంధకారంలో బతుకమ్మ సంబరాలు

జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..
కార్ల లైట్ల వెలుగులోనే మహిళల ఆటపాటలు
ఎన్‌జి కళాశాల మైదానంలో కనీస సౌకర్యాలు కరువు..
మహిళల ఆత్మగౌరవ పండుగకు అధికారుల నిర్లక్ష్యం





**ప్రజాపక్షం/నల్లగొండ:** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో,ఉత్సాహంగా జరుపుకునే బతుకమ్మ సంబరాలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో నల్లగొండ జిల్లా కేంద్రంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, చేనేత,జౌళి శాఖ, వెటర్నరీ శాఖ, మున్సిపాలిటీ, మెప్మా ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ హాజరై బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు,వేడుకలు అస్తవ్యస్తంగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాగార్జున ప్రభుత్వ కళాశాల మైదానంలో మహిళలు చీకట్లో,కార్ల లైట్ల వెలుగులో బతుకమ్మ ఆడాల్సిన దుస్థితి నెలకొనడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

**జిల్లాకలెక్టర్ ఆదేశాలు బేఖాతర్ :** బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడంతోపాటు మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలనే ఉన్నతాధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రోజువారీగా వేడుకలు నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించినప్పటికీ,అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. కార్యక్రమం ఎప్పుడు నిర్వహించాలి,ఎవరు పాల్గొంటారు అనే విషయాలపై దృష్టి పెట్టిన అధికారులు మహిళలకు అవసరమైన కనీస వసతుల గురించి పట్టించుకోలేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది.

## రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు నివారించాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రతి ఒక్క ప్రయాణికుడు రోడ్డు నిబంధనలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె. నరసింహ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని అంజనాపురి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నివారణలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ అనేక చర్యలు చేపడుతున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా రహదారి ప్రమాదాలను అరికట్టడానికి, ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడానికి జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సంయుక్తంగా ముమ్మర చర్యలు చేపడుతుందన్నారు. నిత్యం ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న సుమారు 45 కంటే ఎక్కువ బ్లాక్ స్పాట్స్ లొకేషన్లను పోలీస్ యంత్రాంగం ప్రత్యేకంగా గుర్తించిందన్నారు. ప్రమాదాలు ఎదురైతే వెంటనే సహాయం పొందేందుకు 112 నంబర్ అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పిలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల ప్రజాబాట



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండల కేంద్రంలో గురువారం విద్యుత్ శాఖ అధికారులు ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. గ్రామంలోని వివిధ వీధులు, వార్డులను సందర్శించి విద్యుత్ సరఫరా తీరును, స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించడమే ధ్యేయంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోఓల్టేజి సమస్యలు, లూజ్ వైర్లు, పాడైపోయిన విద్యుత్ స్తంభాలు ఎక్కడైనా ఉంటే వెంటనే తమ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. లైన్ ఇన్‌స్పెక్టర్ పాల్వాయి నాగయ్య, సెకండ్ లైన్ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, లైన్మెన్ సురేందర్ రెడ్డి, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

## కల్వర్ట్ పై నుండి పడి యువకుడు మృతి

**ప్రజాపక్షం/చివ్వెంల :** ప్రమాదవశాత్తు కాలువ కల్వర్ట్ మీద నుండి పడి యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని ఉండ్రుగొండ సమీపంలోని స్వామి నారాయణ స్కూల్ ముందు చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మోతె మండలం భళ్ళుతండకు చెందిన సపావత్ ఉపేందర్ (24) తన స్నేహితులతో కలిసి కూర్చొని ఉండగా, ప్రమాదవశాత్తు కాలువలో పడి గాయాలు కాగా వెంటనే అతనిని 108 అంబులెన్స్ ద్వారా సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు వివరించారు. మృతుని తండ్రి వాంకుడోతు సైదులు ఫిర్యాదు మేరకు చివ్వెంల ఎస్‌ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగినట్లు తెలిపారు.

## సైబర్ నేరాలపై అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల మోసపూరిత మాటలు నమ్మి డబ్బులు కోల్పోవద్దని సూర్యాపేట జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్ డిఎస్‌పి ఏ. వెంకటయ్య సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ, ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో భాగంగా గురువారం సూర్యాపేట ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు, కోదాడ పట్టణంలో బ్యాంకర్ల సమావేశంలో బ్యాంకు అధికారులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపికె ఫైళ్ల ద్వారా జరిగే మోసాలు, లోన్, లోన్ యాప్ మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, వ్యాపార, పెట్టుబడి మోసాలు, సెక్స్‌టార్షన్, సోషల్ మీడియా మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో చేసే మోసాల గురించి వివరించారు. సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులను గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎం. శివకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'కోదాడ'ను కరువు నియోజకవర్గంగా ప్రకటించాలని కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే వినతి



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ నియోజకవర్గంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోతున్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, నియోజకవర్గంలోని ఆరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ గురువారం జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ముఖ్య నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రైతాంగం తీవ్ర కష్టాలు పడుతున్నప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువేనని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతులు ఎన్నో ఆశలతో పెట్టుబడులు పెట్టి, అప్పుల పాలై పంటలు సాగు చేస్తే అవి కళ్లెదుటే ఎండిపోతుంటే గుండెలు అవిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు లేక ఉపాధి కోల్పోయిన కూలీలకు నెలకు వేయి రూపాయల చొప్పున ఏడాదికి 12వేలు ఇస్తామన్న హామీ కూడా గాలికి కొట్టుకుపోయిందని మండిపడ్డారు. ప్రధానంగా కోదాడ నియోజకవర్గంలోని కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి కూలీలకు భరోసా కల్పించాలని, లేని పక్షంలో బిఆర్‌ఎస్ ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శీలం సైదులు, ఎలుగూరి వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, జానకిరామాచారి, తాళ్లూరి శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్, ఉపేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వైటిపిఎస్ స్టేజ్-1 చీఫ్ ఇంజనీర్ సురేష్ సస్పెన్షన్

విధుల్లో నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపాలపై జెన్‌కో సిఎండి వేటు
ఉత్తర్వులు జారీ చేసిన జెన్‌కో సిఎండి డాక్టర్ హరీశ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దామరచర్ల మండలంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్1 (5X800 మెగావాట్లు) ప్రాజెక్టు పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపాలు ప్రదర్శించినందుకుగాను వైటీపీఎస్ (కన్‌స్ట్రక్షన్) స్టేజ్1 ఇన్‌చార్జ్ చీఫ్ ఇంజనీర్ బి.సురేష్‌ను సస్పెండ్ చేస్తూ జెన్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.హరీశ్ ఐఏఎస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండు నెలలుగా జెన్‌కో సీఎండీ, డైరెక్టర్ (థర్మల్ అండ్ ప్రాజెక్ట్స్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల పర్యవేక్షణలో వైటీపీఎస్ జనరేషన్ పనితీరుపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తిని పూర్తి లోడ్ సామర్థ్యంతో సాధించడం, స్టేజ్1 యూనిట్ల పనితీరు ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించారు. అంతేకాకుండా, గత 15 రోజులుగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో పాటు జెన్‌కో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 14న ఉదయం 09:00 గంటలకు నిర్వహించిన జనరేషన్ పనితీరు సమీక్ష సమావేశంలో చీఫ్ ఇంజనీర్ (ఐ/సి) బి. సురేష్ తన విధుల్లో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు గుర్తించారు. విద్యుత్ ఉత్పత్తిని మెరుగుపరచడంలో ప్రాధాన్యతా పనుల ప్రణాళిక, పర్యవేక్షణ మరియు అమలులో సీఈ హోదాలో ఉండి బాధ్యతగా వ్యవహరించడంలో విఫలమైనట్లు తేలింది.ఏపీఎస్ఈబీ (సవరించిన) కండక్ట్ రెగ్యులేషన్స్, ఎంప్లాయీస్ డీ అండ్ ఏ రెగ్యులేషన్స్ నిబంధనల ప్రకారం ఆయన పాల్పడిన చర్యలు తీవ్రమైన దుష్ప్రవర్తన కిందకు వస్తాయని ఉత్తర్వులలో పేర్కొన్నారు. తక్షణమే అమలయ్యేలా శాఖాపరమైన విచారణకు (డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ) ఆదేశిస్తూ ఆయనను సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ కాలంలో నిబంధనల ప్రకారం సబ్సిస్టెన్స్ అలవెన్స్ చెల్లించబడుతుందని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయమైన దామరచర్ల (వైటీపీఎస్) వదలి వెళ్లరాదని సీఎండీ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## సాగునీరు లేక ఎండిన వరి పంటను మేస్తున్న గేదెలు



**ప్రజాపక్షం/నాంపల్లి :** ఆరుగాలం కష్టపడి పంట పండించి కుటుంబాన్ని పోషించుకోవాలన్న రైతన్న ఆశలు ఆవిరవుతున్నాయి. మండలంలోని చిట్టెంపహాడ్ గ్రామంలో వరి పంట ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.పచ్చని పైర్లతో కళకళలాడాల్సిన వరి చేలు నేడు ఎండిపోయి కనిపిస్తుండగా, పంట పొలాల్లో గేదెలు మేస్తున్న దృశ్యాలు రైతుల దయనీయ పరిస్థితికి అద్దం పడుతున్నాయి.రైతులు అప్పులు చేసి సాగు చేసిన పంట నష్టపోవడంతో వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే ప్రమాదం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి,ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పంట పండితేనే రైతు కుటుంబానికి పూట గడుస్తుంది.పంట ఎండిపోతే అప్పుల భారం పెరుగుతుంది. చిట్టెంపహాడ్‌లో ఎండిపోయిన వరి చేలు, వాటిలో గేదెలు మేస్తున్న దృశ్యాలు రైతన్న ఎదుర్కొంటున్న కష్టాలను కళ్లకు కడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రైతులకు అండగా నిలవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రజా పోరాటాలకు పెన్నిధి కామ్రేడ్ భద్రయ్య

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** ప్రజా పోరాటాలకు పెన్నిధి , పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడు కామ్రేడ్ తాళ్లూరి భద్రయ్య అని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కొనియాడారు. గురువారం చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో భద్రయ్య 14వ వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దశాబ్దాల పాటు ప్రజాప్రతినిధిగా పనిచేసిన భద్రయ్య గ్రామంలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారన్నారు. భూ పోరాటాలు, ప్రజా ఉద్యమాల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు భూములు పంచి, ఇళ్ల స్థలాలు ఇప్పించి పేదలకు అండగా నిలిచారని తెలిపారు. భద్రయ్య నాయకత్వంలో పనిచేసి తాను జిల్లా, రాష్ట్రస్థాయికి ఎదగడం గర్వంగా ఉందని గుర్తు చేసుకున్నారు. సిపిఐ గ్రామశాఖ కార్యదర్శిగా తాళ్లూరి వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అల్వాల రాజేష్, సీనియర్ నాయకులు ఎస్‌కె ఖాజా మియా, దొంతగాని పెద్ద మల్లయ్య, తాళ్లూరి పెద్ద మల్లయ్య, ఎస్‌డి మహ్మద్, తాళ్లూరి రామారావు, టిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు అక్కినపల్లి జానకిరామచారి, గ్రామ అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పత్తి రైతులకు అందుబాటులో శ్రీసాయి కాటన్ ఇండస్ట్రీస్

దూర ప్రాంతాలకు వెళ్లే కష్టాలకు చెక్
తొలి రోజు క్వింటాల్ పత్తికి రూ. 9,200 ధర



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం గన్నెర్లపల్లి గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన శ్రీ సాయి కాటన్ ఇండస్ట్రీస్ పత్తి మిల్లును గురువారం మిల్లు యజమాని తాటికొండ వెంకటనారాయణ రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ పత్తి మిల్లు అందుబాటులోకి రావడంతో చందంపేట మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల రైతులకు పత్తి విక్రయాల్లో ఎంతో వెసులుబాటు కలగనుంది. దూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం తగ్గడంతో పాటు రవాణా ఖర్చులు కూడా ఆదా కానున్నాయి. ఈసందర్భంగా మిల్లు యజమాని తాటికొండ వెంకటనారాయణ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండే విధంగా మిల్లును ఏర్పాటు చేశామని, రైతులు 50కిలోల పత్తిని కూడా తీసుకువచ్చి మిల్లులో విక్రయించవచ్చని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. మిల్లు ప్రారంభించిన తొలి రోజు క్వింటాల్ పత్తి ధర రూ. 9,200గా ఉందని ఆయన వెల్లడించారు. రైతులు ప్రతి రోజు పత్తి ధరలను తెలుసుకొని, సరైన ధరకు పత్తిని విక్రయించుకోవాలని సూచించారు. గ్రామాల్లోకి వచ్చి పత్తిని కొనుగోలు చేస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, ధరల విషయంతో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చందంపేట మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల రైతులకు ప్రయాణ భారం, రవాణా ఖర్చులు తగ్గనున్నాయని, రైతులు పత్తిని మిల్లుకు తీసుకువచ్చి గిట్టుబాటు ధరను పొందాలన్నారు.

# విద్యుత్ కోతలు... ఎండుతున్న పంటలు!

- వర్షాభావం ... కాలువల్లో నీటి కొరత....
- అన్నదాతకు తప్పని కష్టాలు
- అప్రకటిత విద్యుత్ అంతరాయాలతో బీటలు వారుతున్న వరి మడులు
- కాలిపోతున్న మోటర్లు అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం





**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా తం టాలు పడుతున్నారు. ఒక వైపు వర్షాల లేక, మరోవైపు కాలువల ద్వారా సాగునీరు సక్రమంగా అందక పంట లు ఎండిపోతుండగా దీనికి తోడు అప్రకటిత విద్యుత్ కోతలు, తరచూ విద్యుత్ అంతరాయాలు రైతుల కష్టాలను మరింత పెంచుతున్నాయి. పంటలకు కీలకమైన సమయంలో నీరు అందక వరి మడులు బీటలు వారుతున్నాయి. మినుము, వేరుశనగ వంటి పంటలు కూడా నీటి కోసం ఎదురుచూస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ మోటర్లపై ఆధారపడుతున్న రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురువుతన్నాయి.

**పొట్టదశలో వరి... నీరు అందక ఆందోళన**

ప్రస్తుతం వరి పంటలు పొట్టదశకు చేరుకోవడంతో నీటి అవసరం అధికంగా ఉంది. ఈ సమయంలో పొలాలకు సకాలంలో నీరు అందకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు లేక భూముల్లో తేమ తగ్గిపోవడం, కాలువల ద్వారా నీరు సరిగా రాకపోవడంతో బోర్లు, విద్యుత్ మోటర్ల ద్వారా పంటలను తడపాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోతుండటంతో పొలాలకు నీరు అందించలేకపోతున్నామ ని రైతులు వాపోతున్నారు. తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడటంతో మోటర్లు కాలిపోతున్నాయని రైతు లు చెబుతున్నారు. వాటిని పునరుద్ధరించే వరకు పొలాలకు నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి సాగు చేసిన రైతు లు, పంట చేతికి అందుతుందో లేదోనని ఆందోళన చెం దుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుం డా విద్యుత్ అధికారులను రైతులు కోరుతున్నారు.

**మినుము, వేరుశనగ రైతులకూ తప్పని తిప్పలు**

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కొందరు రైతులు వర్షాకాలంలో పొలాలను బీడుగా ఉంచి, ఇటీవల కురిసిన వర్షాలకు మినుము, వేరుశెనగ పంటలను సాగు చేశారు. విత్తనాలు మొలకెత్తేందుకు స్ప్రింక్లర్లు పైపుల ద్వారా నీటిని అందిస్తున్నారు. అయితే తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నీటిని అందించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సకాలంలో నీరు అందితే విత్తనాలు మొలకెత్తి పంట నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని, విద్యుత్ అంతరాయాల వల్ల సాగు ప్రారంభ దశలోనే నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వాపోతున్నారు. వరి, మినుము, వేరుశనగ పం టలను కాపాడేందుకు వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను కోతలు లేకుండా సరఫరా చేయాలని రైతులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు. కాలువల ద్వారా సాగునీరు సక్రమంగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు మరమ్మతులకు గురైన వాటిని తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించకపోతే విద్యుత్ సబ్ స్టేషన్ల ఎదుట ఆందోళన చేపట్టిక తప్పదని రైతులు హెచ్చరిస్తున్నారు. పంట చేతికి వచ్చే కీలక సమయంలో ప్రకృతి వైపరీత్యాలు, సాగునీటి కొరత, విద్యుత్ కోతలు అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమన్వయంతో స్పందించి పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలు అవసరం : కలెక్టర్



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** విద్యార్థులకు అత్యుత్తమ బోధన చేసేందుకు ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలు అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బెస్ట్ ఆన్‌లైన్ ఇంగ్లీష్ నైపుణ్యాలు అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బెస్ట్ ఆన్‌లైన్ ఇంగ్లీష్ లెర్నింగ్ ఇన్స్టిట్యూట్‌కు చెందిన స్పీకర్ రామేశ్వర్ గౌడ్ కొద్ది రోజులుగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తుండగా, గురువారం ఐడిఓసి సమావేశపు మందిరంలో ఒకరోజు ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమం నిర్వహించగా జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. అన్ని సబ్జెక్టుల, ఎస్జీటీ ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలు మెరుగుపరచాలనే ఉద్ధేశంతో ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యావ్యవస్థలపై అధ్యయనానికి ప్రతి ఏటా కొంతమంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నందున డాక్యుమెంటేషన్ డ్రాఫ్ట్స్ నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు కూడా ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అనంతరం తక్కశిల జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సుమంగళ రచించిన ప్రము జీరో టు హీరో మాథ్స్ మేడు ఈజీ పుస్తకాలను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. స్పీకర్ రామేశ్వర్ గౌడ్‌ను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి కర్రెప్ప, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల హక్కుల సాధనకు ఉద్యమించండి



**ప్రజాపక్షం/పానుగల్ :** గిరిజనుల సంస్కృతి, సంప్రదాయం కాపాడుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్యానాయక్ అన్నారు. పానుగల్ మండల పరిధిలోని తెల్ల రాళ్లపల్లి తండాలో గురువారం తెలంగాణ గిరిజన సంఘం పానుగల్ మండల విస్తృత స్థాయి సమావేశం రవి నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని అన్నారు. గిరిజనుల విద్య వైద్యం అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని జిల్లాలో గిరిజన కార్పొరేషన్ ద్వారా గత పది సంవత్సరాల నుండి గిరిజన యువతకు ఎలాంటి సంక్షేమ పథకాలు కూడా ఇవ్వలేకపోయాయని విమర్శించారు. తండాల్లో ఏర్పడిన గ్రామపంచాయతీలకు రెవెన్యూ గ్రామపంచాయతీగా గుర్తించలేదన్నారు. ఈ సమావేశంలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై 15 రకాల డిమాండ్లతో తీర్మానం చేయడం జరిగిందని, ఈ సమస్యల పరిష్కారం కోసం దశల వారి ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన బాల్య నాయక్‌ను సన్మానించారు.

## బోరవెల్లిలో ఉపాధి పనుల పరిశీలన

**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలంలోని బోరవెల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం డిప్యూటీ సిఇఒ నాగేంద్రం, ఎంపిడిఒ రాఘవ పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి కూలీలు విధిగా సమయపాలన పాటించాలని సూచించారు. గ్రామంలో ప్రతిరోజు 100 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం చండూరు, పల్లెపాడు గ్రామ పంచాయితీలను సందర్శించి ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరును పరిశీలించారు. ఆయా గ్రామాల్లోనూ రోజుకు 100 మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. చేయూత పెన్షన్ల వెరిఫికేషన్‌లో భాగంగా బోరవెల్లి, చండూరు, పల్లెపాడు గ్రామ పంచాయితీల్లో పెన్షన్ దరఖాస్తుల వివరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోర్ సీజన్స్ రెస్టారెంట్‌లో తనిఖీలు



**ప్రజాపక్షం/జడ్చర్ల :** ప్రజారోగ్య పరిరక్షణ, పరిశుభ్రత ప్రమాణాల అములులో భాగంగా జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ గిరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. గురువారం నాడు జడ్చర్లలోని కర్నూల్ రోడ్ ఎన్‌హెచ్44 వద్ద ఉన్న ఫోర్ సీజన్స్ రెస్టారెంట్ అండ్ వద్ద పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలు తనిఖీల సందర్భంగా వంటగది అపరిశుభ్రత, వంటగది ప్రాంతంలో మురుగునీటి సమస్య, ఆహార పదార్థాల నిల్వలో లోపాలు, ఆహారంలో అవాంఛిత పదార్థాలు, గడువు ముగిసిన ఆహార ఉత్పత్తులు, రిఫ్రిజిరేటర్‌లో ఎక్కువ కాలం నిల్వ ఉంచిన మాంసాన్ని అధికారులు గుర్తించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, గడువు ముగిసిన ఆహార పదార్థాలు వినియోగానికి అనర్హమైనవిగా గుర్తించిన పదార్థాలను మున్సిపల్ సిబ్బంది తొలగించి పారవేశారు. రెస్టారెంట్ వంటగదిని శుభ్రపరచడం, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడం, ఆహార పదార్థాలను పరిశుభ్రమైన పరిస్థితుల్లో నిల్వ చేయడం, గడువు ముగిసిన పదార్థాలను తొలగించడం వంటి చర్యలు వెంటనే చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ గిరిష్ మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లు పరిశుభ్రత, సురక్షిత ఆహార నిర్వహణ, సరైన నిల్వ పద్ధతులను పాటించడం ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ముఖ్యమని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆహార వ్యాపార సంస్థల్లో తనిఖీలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు యాజమాన్యాలు పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తూ, ప్రజలకు సురక్షితమైన ఆహారాన్ని అందించాలని జడ్చర్ల మున్సిపాలిటీ విజ్ఞప్తి చేస్తోంది.

## తుల్జాపూర్‌కు 24 ద్విచక్ర వాహనాలపై 48 మంది యువకుల ప్రయాణం

**ప్రజాపక్షం/దామరగిద్ద:** దామరగిద్ద మండలం లోని ఆశన్‌పల్లి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆశన్‌పల్లి గ్రామం నుంచి 24 ద్విచక్ర వాహనాలపై 48 మంది యువకులు తుల్జాపూర్‌కు బయలుదేరి వెళ్లారు. గ్రామం నుంచి యువకులు తుల్జాపూర్‌కు వెళ్లడం ఇది ఐదోసారి కావడం విశేషం ప్రతి సంవత్సరం గ్రామంలో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల పాటు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంటుంది. గ్రామంలోని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఉత్సవాల్లో పాల్గొనంటూ అమ్మవారి సేవలో తరించడంతో పాటు సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్వామి కైలాసపతి, గ్రామ పెద్దలు రవీందర్ రెడ్డి, హన్మంతు, చెన్ బసప్ప పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలి

మాజీ ఎంపి పోతుగంటి రాములు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** సమాజంలోని ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలుగుతూ, దుర్గామాతను భక్తిశ్రద్ధలతో పూజించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ మాజీ సభ్యుడు, మాజీ మంత్రి పోతుగంటి రాములు కోరారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రి ఉత్సవాల్లో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతనతో జీవనం సాగించాలని, దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. మాజీ జెడ్పిటిసి కల్వకుర్తి భరత్ ప్రసాద్ మాట్లాడుతూ దైవచింతన మనసుకు ప్రశాంతను చేకూరుస్తుందని శక్తి స్వరూపిణి అమ్మవారి దర్శనం ఆనందాన్ని కలిగిస్తోందని అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఆకుతోట రాజశేఖర్, కార్యదర్శి ముషిపల్లి స్వామితో పాటు కొల్లాపూర్‌కు చెందిన 20 మంది భక్తులు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు మాట్లాడుతూ ఐకమత్యమే బలమని, ప్రతి ఒక్కరూ ఐక్యంగా మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు నారాయణరాజు, పానుగంటి నవీన్, కోశాధికారులు గుబ్బ కిషన్, వాసా శేఖర్, చిగుళ్లపల్లె శ్రీధర్, గంప శ్రీను, సంబుముత్యాలు, అప్పాయపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్ నీటి ఎద్దడిపై అలర్ట్!

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ ప్రియాంక



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు తగ్గి వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశమున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. తాగునీటి స మస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ముంద స్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యుత్, వ్యవసాయ, నీటిపారుదల, మిషన్ భగీరథ, భూగర్భ జల వనరులు, పశుసంవర్థక శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు అక్టోబర్ నెలలోనే పలు ప్రాంతా ల్లో బోర్లు ఎండిపోతున్నట్లు సమాచారం అందుతోందని, గతంలో ఏళ్ల తరబడి నీరందించిన బోర్లు సైతం ప్రస్తుతం ఎండిపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. వేసవి నాటికి పరిస్థితి మరింత తీవ్రం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవిలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొదించాలని కలెక్టర్ ఆదేశించా రు. అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాటి సామర్థ్యం , సరఫరా పరిస్థితులను అంచనా వేయడంతోపాటు నీటి సమస్యలు తలెత్తే గ్రామాలు తండాలను ముందుగానే గుర్తించాలన్నారు. ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేసుకోవాలని, అవసరమైన నిధులు అంచనీలు రూపొందించి సమీకరణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యలను తక్షణమే పరిష్కరించేలా ప్రణాళిక రూపొదించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, ఉద్యాన శాఖ, అధికారి సాయిబాబా, విద్యుత్ శాఖ, ఎస్ఈ నవీన్, నీటి పారుదల శాఖ డిఇఇ సాల్మన్, పశుసంవర్ధక శాఖ అధికారి జగదీశ్వర్, హౌసింగ్ పీడీ శంకర్, మిషన్ భగీరథ డిఇఇ రంగారావు, భూగ ర్భ జల వనరుల శాఖ అధికారి,ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

**ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ :** డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన నాగర్ కర్నూల్ పట్టణానికి చెందిన అచ్యుతాచారికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామ్ గోపాల్ రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. 1,700 జరిమానా విధించినట్లు నాగర్ కర్నూల్ ఎస్సై జి. వెంకట్ రెడ్డి తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై సూచించారు.

## వాసవి అమ్మవారిని దర్శించుకున్న జిల్లా ఎస్‌పి



**ప్రజాపక్షం/ నాగర్ కర్నూల్ :** జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రి ఉత్సవాల్లో గురువారం జిల్లా ఎస్పి డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎస్పి దంపతులకు ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు బిల్లాకంటి హరిబాబు, ఆలయ అధ్యక్షుడు మిడిదొడ్డి అంజయ్య ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు జోషి పాండురంగ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం ఎస్పి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకట్ రెడ్డి, పోలీసు సిబ్బంది, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

## పేదల పక్షాన పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న

ముస్లాయిపల్లిలో విగ్రహావిష్కరణ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మక్తల్ :** అన్యాయాన్ని ఎదిరించి పేదల పక్షాన నిలిచి అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న జీవితం భావి తరాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలం ముస్లాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సాయన్న ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పేదల ఆకలి తీర్చిన ప్రజావీరుడు పండుగ సాయన్న కేవలం ముదిరాజ్ సామాజిక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిలిచిన ప్రజానాయకుడని మంత్రి పేర్కొన్నారు. ధనవంతులు, భూస్వాములు, పెత్తందారుల దోపిడీని ఎదిరించి వారి ఆధిపత్యానికి సవాల్ విసిరిన ధైర్యశాలి సాయన్న అని కొనియాడారు. ముదిరాజ్ సామాజిక వర్గం ఆర్థికంగా, రాజకీయంగా, విద్యా, ఉద్యోగ, సామాజిక రంగాల్లో అభివృద్ధి సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ సమాజంలోని పేదల, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను గౌరవిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని మంత్రి వాకటి శ్రీహరి పిలుపునిచ్చారు.

**కరాటేతో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి అండర్ 19 బాలబాలికల కరాటే పోటీలను మక్తల్ పట్టణంలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ముఖ్యంగా బాలికలు ఆత్మరక్షణ నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించాలని. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



## గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు



**ప్రజాపక్షం/ఊట్కూర్ :** నూతన గ్రామ పంచాయితీ భవనాల నిర్మాణాలతోనే ప్రజలకు పాలనా సౌకర్యం మెరుగవుతుందని గ్రామ సర్పంచ్ గాండ్ల నిఖిత ప్రశాంత్ అన్నారు. గురువారం మండలంలోని చిన్నపొర్ల నూతన గ్రామపంచాయితీ భవనానికి శకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు మాలిపటేల్ రవీందరెడ్డి, ఎఇ అజయ్ మండల కాంగ్రెస్ నాయకులు విగ్నేశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వార్డు సభ్యులు, బంద్ నవాజ్, చాకూరు మోబిన్ తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

పోలీస్ దర్బార్‌లో సమస్యల తెలుసుకున్న ఎస్‌పి డాక్టర్ వినీత్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి డాక్టర్ వినీత్ తెలిపారు. గురువారం నారాయణపేట జిల్లా ఎస్‌పి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందితో ఆయన పోలీస్ దుర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సర్వీసు అంశాలు, విధుల కేటాయింపు విధి నిర్వహణలో ఎదురువుతున్న ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది తెలిపిన సమస్యలను పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిబ్బంది సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కార మార్గాలను చూపేందుకు పోలీస్ దుర్బార్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల పాత్ర కీలకమని ఎస్‌పి అన్నారు. సిబ్బంది అంకితభావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ విధులకు సకాలంలో హాజరుకావాలి, ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరిస్తూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.పోలీస్ సిబ్బంది సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖల ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ బాధ్యత, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి రాయజ్ ఉల్ హక్, ఆర్ఐ విజయ్ భాస్కర్, ఆర్ఎస్ఐ శిరీష, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 17న రైతాంగ మహాధర్నాను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రద్దు చేసి పాలమూరు రైతాంగానికి న్యాయం చేయాలని డిమాండు చేస్తూ అక్టోబర్ 17న కల్వకుర్తిలో నిర్వహించే రైతాంగ మహాధర్నాను విజయవంతం చేయాలని జెఎసి చైర్మన్ సదానందం గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం ఊరుకొండ మండలంలో రైతులు, వివిధ పార్టీల నాయకులతో కలిసి మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లాకు నీటి తరలింపతో పాలమూరు రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నేత కానుగు జంగయ్య, మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాసులు, బిజెపి రాష్ట్ర నాయకుడు జనార్ధన్ రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, విష్ణు, గోపి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కల్వకుర్తి జెఎసి చైర్మన్ సదానందం గౌడ్ అన్నారు. పాలమూరు రైతుల నీటి హక్కులకు అన్యాయం చేసి నల్లగొండకు నీటిని తరలించడాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నా రు. పాలమూరు రైతులకు సాగునీరు అందించి, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, డిండి ప్రాజెక్టుకు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు జిల్లా ప్రజాప్రతినిధులు రైతుల నీటి హక్కుల కోసం గళమెత్తాలని, జిల్లాకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సదానందం గౌడ్ కోరారు.



## సెట్విన్ శిక్షణతో మహిళలకు ఉజ్వల భవిష్యత్తు

- ఎల్‌డిఎం సురేష్ ఆత్రేయ
- స్వయం ఉపాధి, బ్యాంకు రుణాలపై అవగాహన సదస్సు
- హాజరైన నాబార్డ్ డిడిఎం మహేందర్, సెట్విన్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్



**ప్రజాపక్షం/ మక్తల్ :** మహిళలు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని, ఆర్థిక స్వావలంబన సాధించి సమాజంలో ఉన్నతంగా ఎదగాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డిఎం) సురేష్ ఆత్రేయ పిలుపునిచ్చారు. స్థానిక సెట్విన్ టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (సెట్విన్ టిటిఐ) మక్తల్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు స్వయం ఉపాధి బ్యాంకు రుణాలపై గురువారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎల్‌డిఎం సురేష్ ఆత్రేయ మాట్లాడుతూ.. సెట్విన్ ద్వారా పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి యూనిట్లను నెలకొల్పాలని సూచించారు. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించడానికి ప్రభుత్వ పథకాల ద్వారా బ్యాంకుల నుంచి లభించే వివిధ రకాల రుణాలు, వాటిని పొందే విధివిధానాలు, దరఖాస్తు ప్రక్రియ గురించి ట్రైనీలకు సమగ్రంగా వివరించారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేన నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ మహేందర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జీవితంలో బీమా (ఇన్సూరెన్స్) ప్రాముఖ్యతను గుర్తించి, ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెట్విన్ టిటిఐ మక్తల్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ... నిరుద్యోగ యువతీయువకులకు నాణ్యమైన సాంకేతిక, వృత్తి శిక్షణ అందించి వారిని స్వయం సమృద్ధి దిశగా నడిపించడమే సెట్విన్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ బ్యాంక్ రుణాలు, మార్కెటింగ్ అవకాశాల పై పూర్తి మార్గదర్శకత్వం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు తిమ్మప్ప, స్వప్న, వీరమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## యాసంగిలో వరి పంట వద్దు



**ప్రజాపక్షం/యాచారం :** యాసంగిలో వరి పంటకు బదులుగా రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అర్ రవినాథ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో ఎలి నివో ప్రభావంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు సాయిశ్రీ, శీకాంత్, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో దసరా పండుగను పురస్కరించుకోని పంచాయతీ కార్మికులకు గ్రామ సర్పంచ్ కొలన్ రమాదేవి మల్లారెడ్డి బట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బదేకుమార్, పంచాయతి కార్యదర్శి సత్యనారాయణ, వార్డు సభ్యులు తాండ్ర యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు అండగా సత్యంచారి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** మున్సిపల్ కార్మికులకు తమ సొంత ఖర్చుతో చీరలు పంపిణీ చేయడం జరిగిందని హస్తినాపురం డివిజన్ బిఆర్ఎస్ ఆందోజు సత్యం చారి పేర్కొన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆందోజు సత్యం చారి జన్మదినం సందర్భంగా తమ సొంత ఖర్చుతో మున్సిపల్ కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్షురాలికి సన్మానం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన పారిజాత నరసింహారెడ్డిని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి ఇబ్రహీం సన్మానించారు. గురువారం గాంధీ భవన్‌లో అధికారికంగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఎండి ఇబ్రహీం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

## ఎల్ నినో ప్రభావంపై గ్రామసభలు




**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** సూపర్ ఎల్ నినో ప్రభావంపై ప్రతి గ్రామపంచాయతీలో గ్రామసభలు ఏర్పాటు చేయాలని మండల ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సురేష్‌బాబు సర్పంచ్‌లకు తెలిపారు. గురువారం శంకర్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎల్ నినో ప్రభావంపై మండల స్థాయి అధికారుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణీకులు అప్రమత్తంగా ఉండాలి




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఆర్‌టిసి బస్‌స్టాండ్‌లో ప్రయాణీకులు అప్రమత్తంగా ఉండాలని సిఐ మహేందర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఆర్‌టిసి ప్రయాణీకుల ప్రాంగణం సమీపంలో ఇబ్రహీంపట్నం ఎసిపి కెపివి రాజ్ ఆదేశాల మేరకు ఆర్‌టిసి బస్‌స్టాండ్‌లలో జరుగతున్నా దొంగతనాల నివారణలపై ప్రజలకు అవగాహన కల్పించటం కోసం సిఐ మహేంద రెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఎం సుజాత, ఎస్ఐలు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులపై అవగాహన

**ప్రజాపక్షం/కడ్తాల్ :** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కడ్తాల్ మండల ప్రత్యేక అధికారి బి.కేషూరాం సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పశు వైద్యశిబిరం

**ప్రజాపక్షం/కడ్తాల్:** పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణ, పాడి రైతులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కడ్తాల్ మండల పశువైద్యాధికారి డాక్టర్ భాను నాయక్, జేవీఓలు వసంత, పురుషోత్తం, రాజేష్, ఎల్ఎస్ఏ మధు, వీఏలు బురానోద్దీన్, శివలింగం, ఓఐఎస్ వాల్య, గోపాలమిత్రులు జి. శ్రీశైలం, సి. నవీన్, గ్రామ పెద్దలు, పాడి రైతులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు ‘క్యూర్’ కార్యనిర్వాహక కమిటీ

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగర సమగ్ర పాలన కోసం రూపొందించిన కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వ్యవస్థలో భాగంగా కార్యనిర్వాహక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ గురువారం జి.ఓ ఎంఎస్ నెంబర్ 252ను జారీ చేసింది. ఈ కమిటీ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్‌కు సహకరిస్తూ, దాని నిర్ణయాల అమలును పర్యవేక్షించనుంది. కమిటీకి మున్సిపల్ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్‌పర్సన్‌గా, హెచ్ఎండిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ సభ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. క్యూర్ పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్‌ల కమిషనర్లు, సంబంధిత పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్, టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి, జలమండలి ఎండి, హెచ్ఎంఆర్ఎల్ ఎండి, టిజిఎస్ ఆర్‌టిసి ఎండి, హైడ్రా కమిషనర్ సభ్యులుగా ఉంటారు. అవసరమైతే




ప్రత్యేక ఆహ్వానితులను కూడా చేర్చుకునే అవకాశం కల్పించారు. కార్యనిర్వాహక కమిటీ ప్రతి మూడు నెలలకు కనీసం ఒకసారి సమావేశమవుతుంది. అపెక్స్ కౌన్సిల్ నిర్ణయాల అమలు, శాఖల మధ్య సమన్వయం, వివిధ ప్రాజెక్టులు, పథకాల అమలు పర్యవేక్షణ, విధానపరమైన అంశాలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లడం వంటి బాధ్యతలను నిర్వర్తించనుంది. హైదరాబాద్ నగరం నానాటికీ విస్తరిస్తున్న నేపథ్యంలో, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏకీకృత పాలన అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని హెచ్ఎండిఎ మెట్రోపాలిటన్ కమిషనర్‌ను ఆదేశించారు.

### సిఎంను ఛైర్మన్‌గా నియమిస్తూ..

### ‘క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్’ ఏర్పాటు

కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) చట్టం–2026 అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ‘క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్’ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ గురువారం జి.ఓ ఎంఎస్ నెంబర్ 251ను విడుదల చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ముఖ్యమంత్రి కౌన్సిల్‌కు ఎక్స్‌అఫీషియో చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సభ్యుడిగా, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రధాన కార్యదర్శి సభ్య కన్వీనర్‌గా ఉంటారు. అవసరాన్ని బట్టి సంబంధిత శాఖల మంత్రులను ప్రత్యేక సభ్యులుగా, ఇతర నిపుణులను ప్రత్యేక ఆహ్వానితులుగా చైర్మన్ ఆహ్వానించవచ్చు. కౌన్సిల్ ప్రధాన బాధ్యతల్లో సమావేశాల నిర్వహణ విధానం, అజెండా రూపకల్పన, సమగ్ర పట్టణాభివృద్ధికి విధాన దిశానిర్దేశం, వ్యూహాత్మక ప్రాధాన్యతల నిర్ణయం, కోర్ అర్బన్ రీజియన్‌కు సంబంధించిన ప్రణాళికలు, కార్యక్రమాలపై సమన్వయం, వివిధ శాఖల విధానాలు, పథకాలు, పెట్టుబడుల సమీకరణ, సమర్థవంతమైన సమగ్ర పాలనకు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడం ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తీసుకొచ్చిన కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) చట్టం–2026 ప్రకారం ఈ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ చట్టం ద్వారా పాత జిహెచ్ఎంసి చట్టం, 1955 రద్దు కాగా, హైదరాబాద్ మహానగర ప్రాంత భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్ర పాలనా వ్యవస్థను అమలు చేయడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

## ఏ ఒక్క ఓటరు పేరు గల్లంతు కావొద్దు : వినోద్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో ఏ ఒక్క అర్హుని ఓటు కూడా గల్లంతు కాకూడదని, ప్రతి అర్హుడికీ ఓటు హక్కు కల్పించాలని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఉండేలా ఎన్నికల యంత్రాంగం, రాజకీయ పార్టీలు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో ఒక్క అర్హుడి ఓటు హక్కు కూడా కోల్పోయే పరిస్థితి రాకూడదని, ఇదే ప్రజాస్వామ్య పరిరక్షణలో అత్యంత కీలకమైన అంశమని ఆయన గురువారం ఒక ప్రకటలనలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు, 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారు శిబిరాలను వినియోగించుకుని, ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో తమ పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితాలో పరిశీలించుకోవాలని, అందులో పేరు లేకపోతే సంబంధిత పోలింగ్ కేంద్రంలోబిఎల్‌ఓలను సంప్రదించి,అర్హతకు అనుగుణంగా ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## కెబిఆర్ పార్క్ ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం

### జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

### జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ - ఎన్‌ఎఫ్‌సిఎల్ జంక్షన్ మధ్య..

### రూ.1,090 కోట్లతో ఆరు లేన్‌ల స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఎన్‌ఎఫ్‌సిఎల్ జంక్షన్ వరకు ప్రతిపాదిత సిగ్నల్ రహిత రాకపోకలకు వీలు కల్పించే 4.3 కిలోమీటర్ల ఆరు లేన్‌ల ద్విమార్గ స్టీల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బి. సంతోష్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రూ.1,090 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా జూబ్లీ హిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఎన్‌ఎఫ్‌సిఎల్ జంక్షన్ వరకు సిగ్నల్ రహిత ట్రాఫిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఫౌండేషన్ తవ్వకాలు, జంక్షన్ అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించి, నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కెబిఆర్ పార్క్ ప్రధాన ప్రవేశద్వారం జంక్షన్, అగ్రసేన్ జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ వద్ద జంక్షన్ అభివృద్ధి పనులను వేగవంతం చేసి కెబిఆర్ పార్క్ చుట్టూ ఏకదిశ ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అలాగే ముగ్ధ జంక్షన్ నుంచి ఎన్‌ఎఫ్‌సిఎల్ జంక్షన్ వరకు ఫౌండేషన్ డిజైన్‌కు అవసరమైన జియోటెక్నికల్ పరిశోధనలు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముగ్ధ జంక్షన్ వరకు ఫౌండేషన్ తవ్వకాలను వేగవంతం చేయడంతో పాటు సమాంతరంగా స్టీల్ నిర్మాణ భాగాల తయారీ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు కర్ణన్ సూచించారు. పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి, హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన స్పష్టం చేశారు.

## ప్రాథమిక స్థాయిలోనే మెరుగైన వైద్యం అందేలా చర్యలు

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

### ఆధునిక వైద్య పరికరాలు అందజేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆధునిక వైద్య పరికరాలను అందించారు. గురువారం ఆయన కవాడిగూడలోని డిబిఆర్ మిల్స్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌తో పాటు ముషీరాబాద్ మెయిన్ రోడ్డులోని, మెట్టగూడ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అక్కడి సేవలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు, ఉచిత మందుల లభ్యతపై సిబ్బందితో మాట్లాడిన కిషన్ రెడ్డి, ప్రాథమిక స్థాయిలోనే మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలకు ఇసిజి మెషీన్‌తో కూడిన రెక్లైనర్ బెడ్లు, ఫ్లెబోటమీ కుర్చీలు, ఎల్ఇడి డిస్‌ప్లే బోర్డులు, నెబ్యులైజర్లు, డిజిటల్ బిపి పరికరాలు, గ్లూకోమీటర్లు, నీడిల్ హబ్ కట్టర్లు, డిజిటల్ వెయింగ్ మెషీన్లు, వాటర్ డిస్పెన్సర్లు తదితర పరికరాలను అందించారు. పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యాక్షురాలు, గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## రక్షణ రంగంలో డ్రోగో ఎరోస్పేస్‌కు మరో ఘనత

### శిక్షణ విభాగంలో దేశంలోనే తొలి డ్రోన్‌గా జెకె 250 ఇ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్వదేశీ డ్రోన్ తయారీరంగంలో డ్రోగో ఏరోస్పేస్ మరో కీలక మైలురాయిని సాధించింది. సంస్థ అభివృద్ధి చేసిన జెకె 250ఇ హైబ్రిడ్ డ్రోన్‌కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) టైప్ సర్టిఫికేషన్ లభించింది. శిక్షణ అవసరాల కోసం ఈ గుర్తింపు పొందిన దేశంలోనే తొలి హైబ్రిడ్ ఫిక్స్‌డ్‌వింగ్, మల్టీరోటర్ యుఎవిగా ఇది నిలిచిందని సంస్థ సిఇఓ యశ్వంత్ బొంతు తెలిపారు. భారత రక్షణ దళాల నిఘా, పర్యవేక్షణ, సమాచార సేకరణ అవసరాలకు అనుగుణంగా జెకె 250ఇ డ్రోన్‌కు రూపొందించారు. ఇప్పటికే ఈ డ్రోన్లను భారత సైన్యానికి అందించినట్లు సంస్థ వెల్లడించింది. తాజా సర్టిఫికేషన్‌తో డ్రోగో ఏరోస్పేస్ పొందిన డిజిసిఎ టైప్ సర్టిఫికేషన్ల సంఖ్య ఆరుకు చేరింది. స్వదేశీ డ్రోన్ సాంకేతికత అభివృద్ధి, విమాన భద్రతా ప్రమాణాల అమలులో ఈ గుర్తింపు కీలకమని యశ్వంత్ బొంతు పేర్కొన్నారు. రక్షణ, శిక్షణ రంగాల అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో స్వదేశీ ఏరోస్పేస్ సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

## పంటలు ఎండిపోకుండా విద్యుత్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పంటలు ఎండిపోకుండా నిరంతర విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్, చించోడు, అయ్యవారిపల్లి, వెంకట్‌రెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. తండాల్లో లబ్దిదారులకు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఫరూఖ్‌నగర్ మండలానికి చెందిన లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగయ్య, మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, నేతలు చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, శ్రీధర్, కౌన్సిలర్లు మురళీమోహన్, దిలీప్, రాయికల్ శ్రీనివాస్, ఇబ్రహీం, లింగారెడ్డిగూడ అశోక్ పాల్గొన్నారు.

## పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలి

### డిసిసి అధ్యక్షురాలిగా పారిజాత నర్సింహారెడ్డి బాధ్యతల స్వీకరణ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా, మహిళా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషిచేసేందుకు పారిజాత నర్సింహారెడ్డి నాయకత్వం దోహదపడుతుందని రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షురాలి గా నూతనంగా నియమితులైన చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గాంధీభవన్‌లో, జిల్లా కార్యాలయంలో ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, డిసిసి మాసి మాజీ అధ్యక్షుడు, కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పారిజాత నర్సింహారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. డిసిసి అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించిన పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పి చైర్‌పర్సన్ పట్నం సునీత మహేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, సరితా తిరుపతయ్య, చరణ్ కౌశిక్ యాదవ్, రఘునాథ్ యాదవ్, కాల్వ సుజాత, సామ రామ్మోహన్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నూతన అధ్యక్షురాలిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

## ప్రకృతి ఆరాధనకు ప్రతీక ‘బతుకమ్మ’





### రంగారెడ్డి జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధిస్తూ మానవాళిని ప్రకృతికి దగ్గర చేసే గొప్ప వేడుక అని రంగారెడ్డి జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో మహిళా, వైద్య ఆరోగ్య, మెప్మా, అడల్ట్ ఎడ్యుకేషన్ తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. బతుకమ్మకు పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి సంబరాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో అందంగా పేర్చి పూజించడం బతుకమ్మను పండుగ ప్రత్యేకత అన్నారు. మహిళలకు ఎంతో ప్రత్యేకమైన బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతుందన్నారు. మహిళలంతా ఒకచోట చేరి తొమ్మిది రోజులపాటు ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవడం మన సంప్రదాయంలోని గొప్పతనమన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతిఒక్కరూ పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి శాంతిశ్రీ, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి అనిత, వైద్యఆరోగ్యశాఖ, మెప్మా, రెవెన్యూశాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువతరానికి స్ఫూర్తి అబ్దుల్ కలాం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** యువతరానికి స్ఫూర్తి ప్రధాత అబ్దుల్ కలాం అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ముందు ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలు అంధించిన ఘనత అబ్దుల్ కలాంకే దక్కిందన్నారు. వారి ఆశయాలను నేటి యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, కౌన్సిలర్లు మురళీమోహన్, దిలీప్,నాయకులు చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, రాయికల్ శ్రీనివాస్, ఎండి ఇబ్రహీం, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, లింగారెడ్డిగూడ అశోక్, బుడ్డ నర్సింలు, శ్రీహరిగౌడ్, మంగ మధు, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.



## మోదీ సర్కార్ యుద్ధం

**(మొదటి పేజీ తరువాయి)**

గురువారం దీప్కే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ జరుగుతున్న నిరసనలలో ప్రజలు పాల్గొనకుండా నిరోధించడానికి ఢిల్లీలో అసాధారణ ఆంక్షలు విధించారని కూడా ఆరోపించారు. సర్‌పై వ్యక్తమవుతున్న అసమ్మతిని అధికారులు అణచివేస్తున్నారన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ తొలగింపులను ప్రశ్నిస్తూ, '2024లో గెలుపు మార్జిన్ కేవలం 2 శాతమే. 13 కోట్లకు పైగా ఓటర్లను తొలగించారు' అని ఆయన అన్నారు. 2 శాతం ఓట్లే ఎన్నికల ఫలితాన్ని నిర్ణయిస్తున్న చోట, 13 కోట్ల ఓట్లను తొలగిస్తున్నారు, ఇది కుట్ర కాకపోతే మరేమిటి? అని ఆయన ప్రశ్నించారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా జ్ఞానేశ్ కోసం రైల్వేలను, మెట్రోలను మూసివేశారు అని అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ప్రభుత్వం ఎందుకు రక్షిస్తోందని ఆయన ప్రశ్నించారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనే నినాదం వేరొక రాజకీయ లక్ష్యానికి ముసుగు అని అభివర్ణించారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక అనేది ఒక నినాదం మాత్రమే. అసలు ఉద్దేశం 'ఒకే దేశం, ఒకే పార్టీ, ఒకే నాయకుడు'. జాతీయ జెండాను పట్టుకుని నిరసన తెలుపుతున్న వారిని ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని దీప్కే ఆరోపించారు. 'ముంబయి పతాకాన్ని ఎన్నడూ ఆలింగనం చేసుకోని వారే దానిపై దాడి చేస్తున్నారు. మా సహచరులు కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాకంతో నడుస్తుంటే వారందరినీ నిర్బంధించారు. త్రివర్ణ పతాకాన్ని పట్టుకోవడం ఎప్పుడు నేరమైంది? అని ఆయన ప్రశ్నించారు. మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, పినరయి విజయన్‌లతో సహా ప్రతిపక్ష నాయకులు, మాజీ ముఖ్యమంత్రుల నిర్బంధాన్ని ప్రస్తావిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కాపాడటానికి ప్రభుత్వం ప్రభుత్వ యంత్రాంగాన్ని వాడుకుంటోందని దీప్కే మండిపడ్డారు. జాతీయ రాజధానిలో జమ్మూ కాశ్మీర్ నుండి భద్రతా సిబ్బందిని మోహరించడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో శుక్రవారం 'లెహ్రా దో త్రివర్ణ' మార్చ్ నిర్వహిస్తామని సిజెపి ప్రకటించింది. జాతీయ జెండాను ఎగురవేయడం ప్రజాస్వామ్య హక్కు అని నొక్కి చెబుతూ, ఈ ప్రదర్శనలో పాల్గొనాలని దీప్కే పౌరులను కోరారు. రాజకీయ పార్టీలు కూడా ఇందులో చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిరసనలను కవర్ చేస్తున్న జర్నలిస్టులను పోలీసులు లక్ష్యంగా చేసుకున్నారని, వారి ప్రెస్ గుర్తింపు కార్డులు ఉన్నప్పటికీ వారిని నిర్బంధించారని, వారి కెమెరాలను లాక్కున్నారని బోరా ఆరోపించారు. ఒక జర్నలిస్టుపై లైంగిక వేధింపుల ఆరోపణలు రాగా, దానిపై ఎఫ్ఐఆర్ నమోదైందని ఆమె ప్రస్తావించారు. ఎన్నికల హక్కులపై ఆందోళన వ్యక్తం చేస్తున్న వారిపై పోలీసులు బలప్రయోగం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. 'పోలీసులు శాంతిభద్రతలను కాపాడటానికి బదులుగా, ప్రజలను అణచివేస్తున్నారు. మనం చూసిన దానికి ఇది ఒక చక్కటి ఉదాహరణ' అని ఆమె అన్నారు. 'ఓటు హక్కుకు మద్దతు ఇచ్చే గొంతును మీరు జైలుకు పంపుతున్నారు. మీరు సామాన్య ప్రజలను ఈడ్చుకెళ్తున్నప్పుడు, ఆ 13 కోట్ల మంది ప్రజలను ఈడ్చుకెళ్తున్నట్లే' అని ఆమె అన్నారు. అధికారంలో ఉన్న బిజెపిపై కాకుండా ప్రజలపైనే తనకు నమ్మకం ఉందని చెబుతూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి పౌరులందరూ ఏకం కావాలని ఘోష్ కోరారు.

## ప్రభుత్వం అండ

**(మొదటి పేజీ తరువాయి)**




సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహా మంత్రివర్గం మొత్తం పారిశ్రామికవేత్తలకు సహకరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పెట్టుబడిదారులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు భౌగోళికంగా అనుకూల పరిస్థితులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ప్రధాన బలాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు, విద్యా సంస్థలు, బహుభాషా సంస్కృతి, వివిధ ప్రాంతాల ప్రజలను ఆదరించే వాతావరణం పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. ఫార్మా, బయోటెక్నాలజీ, ఐటీ, కృత్రిమ మేధ, ఎగుమతులు, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు తదితర రంగాల్లో మరిన్ని పెట్టుబడులు రావాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల అభివృద్ధికి కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్), పెరి అర్బన్ రీజియన్ (ప్యూర్), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ (రేర్) విధానాల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు. కోర్ అర్బన్ ప్రాంతంలో ఐటీ, సేవారంగం, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని పరిశ్రమల అభివృద్ధికి అనువుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ ప్రాంతంలో రేడియల్ రోడ్ల అభివృద్ధికి సంబంధించి 21 రోడ్లకు మంజూరు, రూపకల్పన ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు.

ఫార్మా, బయోటెక్నాలజీ, విద్య, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేసే అవకాశాలున్నాయని వివరించారు. గ్రామీణ అగ్రికల్చర్ రీజియన్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తామని, స్థానిక వనరులకు విలువ జోడించే పరిశ్రమల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో పరిశ్రమలు, సేవారంగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. వ్యవసాయంతోపాటు పారిశ్రామిక, సేవారంగాలు బలోపేతం కావడం ద్వారా ఆర్థిక వ్యవస్థ మరింత విస్తరిస్తుందని తెలిపారు. పారిశ్రామికవేత్తలు వ్యాపారాలను విస్తరించడంతోపాటు కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే యువతకు తమ అనుభవాన్ని, పరిజ్ఞానాన్ని పంచాలని సూచించారు. సంపద కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందాలని ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలు తమతోపాటు ఇతరులను కూడా అభివృద్ధి దిశగా నడిపించినప్పుడే సమగ్ర ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వ్యాపారవేత్తలకు స్వాగతం పలుకుతూ, రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి కల్పనలో భాగస్వాములు కావాలని భట్టి విక్రమార్క కోరారు.

# హోర్ముజ్ జలాల్లో నౌక దగ్ధం

- అడ్డదారిలో వెళ్ళి మందుపాతరను ఢీకొన్న నౌక
- సముద్రంపాలైన విలువైన సరుకు
- నీటిలో తేలియాడుతున్న వందల కొద్దీ ఐ–ఫోన్లు
- 21 మంది సిబ్బంది క్షేమంగా ఒడ్డుకు..
- మా దారికి రాకపోతే ఇదే గతి : ఐఆర్‌జిసి హెచ్చరిక



**టెహ్రాన్ :** హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఐఆర్‌జిసి విధించిన నిబంధనలను ఉల్లంఘించి దొడ్డిదారి మార్గంలో వెళుతున్న ఒక సింగపూర్ జెండాతో వెళుతున్న జిఫ్ఎస్ ప్రైడ్ నౌక మందుపాతరను ఢీకొట్టింది. దీంతో నౌక అగ్నికి ఆహుతైంది. సింగపూర్ మారిటైమ్ అండ్ పోర్ట్ అథారిటీ సమాచారం ప్రకారం అందులో ప్రయాణిస్తున్న 21 సిబ్బందిని కాపాడి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఈ కార్గో నౌకలో దాదాపు 2,500 కంటైనర్లు ఉన్నాయి.ఈ కంటైనర్లలో వందలకొద్దీ ఐ–ఫోన్లు,విలాసవంతమైన పెర్ఫ్యూమ్ బాలిల్స్,ఇతర లగ్జరీ వస్తువులు ఉన్నాయి. ఈ నౌక ధ్వంసం కావడంతో ఈ కంటైన్లు అన్నీ చెల్లాచెదురుగా హోర్ముజ్ జలసంధిలో పడిపోయాయి. ఇందులో ఐ–ఫోన్లు హోర్ముజ్ జలాలలో తేలియాడుతూ ఈతలు కొడుతున్నాయి.ఈ దృశ్యాలు వీడియోలు వైరల్ అవుతున్నాయి.'ది సన్' కథనం ప్రకారం,హోర్ముజ్ జలసంధిలో సింగపూర్ జెండాతో వెళుతున్న వాణిజ్య నౌక ఐఆర్‌జిసి పాతిన సముద్ర మందుపాతరను ఢీకొని ధ్వంసం కావడంతో అందులోని లగ్జరీ సరుకు సముద్రంలో తేలియాడుతోంది.చిన్న చిన్న పడవల్లో వచ్చినవారు ఆ సరుకును సేకరించుకుంటున్నారు.అమెరికాకు కీలకమైన భాగస్వామి సౌదీఅరేబియాకు–హౌతీలకు మధ్య భీకరయుద్ధం కొనసాగుతున్న తరుణంలో హోర్ముజ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.గడచిన 48 గంటల్లో ఈ ప్రాంతంలో ట్యాంకర్లు,వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు సహా ఐదు రకాల ఘటనలు జరిగినట్లు బ్రిటన్‌కు చెందిన మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ఏజెన్సీ ప్రకటించింది.గడచిన పది రోజులుగా హౌర్ముజ్ జలసంధి పరిసరాల్లో నౌకలపై దాడులు తీవ్రరూపం దాల్చాయి.అమెరికా–ఇజ్రాయెల్ మరోసారి ఇరాన్‌పై దాడులు ప్రారంభిస్తాయని వార్తలు వస్తున్న తర్వాత ఈ దాడులు పెరిగాయి.అమెరికా దళాలు తమ ఓడరేవులపై దిగ్బంధనం కొనసాగిస్తున్నందుకు ప్రతీకారంగా ఈ దాడులు చేస్తున్నట్లు ఇరాన్ చెబుతున్నది.చమురు ధరలను అధికస్థాయికి తీసుకువెళ్ళడం ద్వారా నవంబరు మూడో తేదీన జరిగే అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధికార రిపబ్లికన్‌పార్టీ విజయం సాధించకుండా ప్రభావితం చేసేందుకే కొత్త ఉపాయాలు అమలు చేస్తున్నట్లు ఇద్దరు సీనియర్ ఇరాన్ అధికారులు చెప్పినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ తెలియజేసింది.

కాగా,తమ కళ్ళు కప్పి తప్పించుకుని దొంగదారిలో వెళ్ళాలనుకున్న నౌకలకు ఇదే గతి పడుతుందని, ఇప్పటికైనా నౌకలన్నీ తమ దళాలతో అనుసంధానంలో ఉంటూ జలసంధిలో రాకపోకలు సాగించాలని ఐఆర్‌జిసి దళాలు హెచ్చరిక జారీ చేశాయి.హోర్ముజ్ జలసంధిని ఐఆర్‌జిసి గడచిన మార్చినెలారంభంలో తన అధీనంలోకి తెచ్చుకుంది. అప్పటినుండీ జలసంధిని మూసివేసింది. పూర్తిగా జలసంధి తమ అధీనంలోనే ఉందని ఇరాన్ సైన్యాన్ని సమన్వయం చేసే ఉప అధిపతి రియర్ అడ్మిరల్ హబీబొల్లా సయ్యారీ చెప్పారు. టెహ్రాన్‌లో గురువారనాడు సైనిక నర్సులను సత్కరించే కార్యక్రమం తర్వాత పాత్రికేయులతో మాట్లాడుతూ,హోర్ముజ్ జలసంధి పూర్తిగా తమ అధీనఇరాఇంలోనే ఉందని,మూసివేసి ఉందని, అమెరికా తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిలో ప్రయాణం చేసే ఏ నౌక అయినా ఇరాన్ బలగాలతో సంప్రదింపుల ద్వారా సమన్వయంతో తమ ప్రయాణ రాకపోకలు కొనసాగించాలని స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధిలో పశ్చిమాన ఐఆర్‌జిసి నౌకాదళాలు బలమైన ఉనికి కొనసాగిస్తూ నిఘా అమలు చేస్తున్నాయని,ఉత్తరాన,తూర్పున ఒమన్ వరకూ ఇరాన్ సైన్యాలు పనిచేస్తున్నాయని,మొత్తంగా జలసంధి పూర్తిగా తమ అధీనంలో ఉందని రియర్ అడ్మిరల్ సయ్యారీ చెప్పారు.ఇరాన్–ఒమన్‌మధ్య విస్తరించి ఉన్న హోర్ముజ్ జలసంధి అంతర్జాతీయ రవాణాకు అత్యంత కీలకమైన జలమార్గం.

**అమెరికా దుష్టకృత్యాలు సాగనివ్వం**

ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతియ్యాలని, ఏకాకిని చెయ్యాలని చేస్తున్న దుష్టకృత్యాలను సాగనివ్వబోమని ఆ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ హెచ్చరించారు. ఇరాన్ ప్రజలను రెచ్చగొట్టి పరిపాలన అస్తవ్యస్తం చేయాలని అమెరికా ప్రయత్నం చేస్తోందని, ఇరాన్‌కు వచ్చే సరఫరా మార్గాలను దెబ్బతీయాలని చూస్తోందని, ఈ ఆటలు సాగనివ్వబోమని అన్నారు. ఇరాన్‌కు సహాయం చేసే ఎగుమతిదారులు, ఉత్పత్తి దారుల అండతో ఈ దుష్టకృత్యాలను అడ్డుకుంటున్నామన్నారు. ఇరాన్ బలమైనస్థానంలో ఉందని, ప్రజల సహాయంతో అందుబాటులో ఉన్న మార్గాలలో తన అవసరాలు తీర్చుకుంటుందన్నారు. దేశంలో ప్రజలు, అధికారులు కలిసి పనిచేయాలని, రాష్ట్రాలు పూర్తిగా దేశ రాజధాని పాలకుపైనే ఆధారపడకూడదని చెప్పారు.

## అమెరికా మమ్మల్ని మోసం చేసింది

- ఫైనాన్సియల్ టైమ్స్ ఇంటర్వ్యూలో జెలెన్స్కీ
- రష్యా ఇంధన వనరులపై దాడులు ప్రారంభిస్తామని వెల్లడి



**కీవ్:** రష్యా ఇంధన వనరులపై తిరిగి దాడులు ప్రారంభిస్తామని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రకటించారు. కుదిరిన అంగీకారానికి రష్యా కట్టుబడి ఉండటంలేదని, గడచిన మూడు రోజులుగా తాము ట్రంప్ చెప్పిన విధంగా అంగీకారానికి కట్టుబడి ఉన్నామని, దానివల్ల ఫలితం లేదని, అందువల్ల ఆ దేశ ఇంధన వనరులపై తాము తిరిగి దాడులు ప్రారంభిస్తామని చెప్పారు. రష్యాతో డీజిలు దిగుమతి ఒప్పందం ద్వారా తమ దేశానికి ట్రంప్ ద్రోహం చేశారని, అమెరికా తమను మోసం చేసిందని భావిస్తున్నట్లు ఫైనాన్సియల్ టైమ్స్‌కు ఇంటర్వ్యూ సందర్భంగా విలేకరి పియర్స్ మోర్గాన్ ప్రశ్నల సందర్భంగా జెలెన్స్కీ అంగీకరించారు. కీలకమైన మద్దతును అమెరికా ఉపసంహరించుకుంది, ఇక మా పని అయిపోయింది''అని ఇంటర్వ్యూలో జెలెన్స్కీ చెప్పారు. రష్యా నుండి ఇప్పటివరకూ ఎదురైన దాడులకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని తమకు షేర్ చేసే నిఘా సమాచార భాగస్వామ్యాన్ని కూడా అమెరికా ఉపసంహరించుకుందని, అమెరికా స్టార్‌లింక్ వ్యవస్థలను ఉక్రేన్ సైన్యం ఉపయోగించుకునే సేవలపై కూడా ఉద్దేశపూర్వకంగానే నిషేధం విధించారని చెప్పారు. డ్రోన్ల వేగం పరిమితం కావడం సాంకేతికలోపం కాదని, ఉద్దేశపూర్వక సంకల్పమని ఆయన అన్నారు. ఐతే స్టార్ షీల్డ్ సేవలు పునరుద్ధరించినట్లు ఉక్రేన్ అధికారులు తర్వాత చెప్పారు. రష్యాతో డీజిలు దిగుమతి ఒప్పందం చేసుకున్నట్లు అక్టోబరు తొమ్మిదో తేదీన ట్రంప్ ప్రకటించారు. ఆ మరునాడే మరో బాంబు పేల్చారు. ఇక జెలెన్స్కీని అధ్యక్ష పదవి నుండి దించివేసేందుకు సమయం ఆసన్నమైందని ప్రకటించారు. ఆ తర్వాత రష్యా–ఉక్రేన్ మధ్య ఇంధన వనరులపై పరస్పర దాడుల ఉపసంహరణ తక్షణం అమలులోకి వస్తుందని గడచిన ఆదివారం ట్రంప్ ప్రకటించారు. రష్యా ఇంధన వనరులపై దాడులు చేయవద్దని అంతకుముందే జెలెన్స్కీకి ట్రంప్ ఒక విజ్ఞప్తి చేశార. ఈ పరిస్థితుల్లో తమకు రక్షణ లేదని ఉక్రేన్ తీవ్ర అభద్రతాభావంలో మునిగిపోయింది. కానీ తాము పూర్తి మద్దతు తెలియజేస్తామని, ఆయుధ సరఫరాలు చేస్తామని బ్రిటన్ ప్రధాన మంత్రి బర్న్‌హామ్ ప్రకటించారు.

ఇదిలాఉండగా, గురువారం తెల్లవారు జామున మాస్కోకు దక్షిణాన ఉన్న ఒక చమురు శుద్ధి కర్మాగారంపై దాడులకు ఉక్రేన్ ప్రయత్నం చేసిందని, నాలుగు క్షిపణులు, డజన్లకొద్దీ డ్రోన్లను రష్యా సైన్యం అడ్డుకుందని క్రెమిన్ వర్గాలు ప్రకటించాయి. ఇంధన వనరులపై దాడులు నిలివేస్తామనే ఒప్పందానికి అంగీకరించినట్లు తాము ఎన్నడూ ప్రకటన చేయలేదని క్రెమ్లిన్ వర్గాలు స్పష్టం చేశాయి.

## ఢాకా రహదారుల దిగ్బంధం

**వస్త్రకార్మికుల ప్రదర్శనపై పోలీసు దౌర్జన్యం**



**ఢాకా:** బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ప్రధాన రహదారులను వస్త్రకార్మికులు దిగ్బంధనం చేశారు. తమకు మంచి వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బంగ్లాదేశ్‌వ్యాప్తంగా గార్మెంట్ ఇండస్ట్రీలో 4000 మంది రిజిస్టర్డ్ కర్మాగారాలు ఉన్నాయి. దాదాపు 40 లక్షలమంది కంటే ఎక్కువమంది కార్మికులు ఈ కర్మాగారాలలో పనిచేస్తున్నారు. రహదారులను దిగ్బంధనం చేసిన కార్మికులపై పోలీసులు బలప్రయోగం చేశారు. వరుసగా నాలుగోరోజు కూడా భారీసంఖ్యలో కార్మికులు ఢాకా–మైమెన్సింగ్ రహదారిని దిగ్బంధనం చేశారు. కార్మికులను చెదరగొట్టేంకు పోసులు లాఠీలు ప్రయోగించారు. సౌండ్ గ్రెనేడ్లు ఉపయోగించారు. బంగ్లాదేశ్ వస్త్ర ఉత్పత్తి, ఎగుమతిదారుల సంఘం(బిజిఎంఇఎ) చెప్పిన సమాచారం ప్రకారం, 2025–26 ఆర్థిక సంవత్సరంలో బంగ్లాదేశ్ నుండి వస్త్ర ఎగుమతులు 38.70 బిలియన్ డాలర్లకు చేరుకోవడంతో ప్రపంచంలో చైనా తర్వాత బంగ్లాదేశ్ ఈ ఎగుమతుల్లో రెండోస్థానానికి చేరుకుంది. మొత్తం 150 దేశాలకు బగ్లాదేశ్ వస్త్రాలు ఎగుమతి అవుతూ ఉంటాయి. ఎక్కువ వేతనాలు ఇవ్వాలని, బకాయిలు చెల్లించాలని, ఇతర సదుపాయాలు సమకూర్చాలని కోరుతూ కార్మికులు వీధుల్లోకి వచ్చారు. ఢాకా శివారు ప్రాంతాలైన అజంపూర్, రాజలోఖి లలో ఉన్న అనేక వస్త్ర కర్మాగారాల వెలుపల వేలాదిమంది కార్మికులు గుమిగూడి నిరస ప్రదర్శనలు జరిపారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని, కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు నినాదాలు చేశారు. నెలసరి వేతనాలు 30,000 టాకాలుగా నిర్ణయించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులకు పదే పదే విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో విసిగి వేసారిపోయిన కార్మికులు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేస్తున్నారు.

## ఢిల్లీకి అఖిలపక్షం

**(మొదటి పేజీ తరువాయి)**

సాగుకు నీటిని అందిస్తే సరిపోదని, అందుకే అందుబాటులో ఉన్న నీటిని కేవలం 24 వేల గ్రామాలకు తాగు నీటి అవసరాల కోసమే భద్రపరచాల్సిన క్లిష్ట పరిస్థితి నెలకొంది తెలిపారు. రైతులు దేశానికి రాజులని, 1947 కరవు నుంచి దేశానికి ఏ కష్టం వచ్చినా రైతాంగమే ముందుండి నిలబడిందని సిఎం గుర్తు చేశారు.

**చివరి ఆయకట్టును కాపాడేందుకు చర్యలు**

'వానాకాలంలో 56 లక్షల ఎకరాల్లో వరి, 13 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు సాగయ్యాయని, 10 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. చేతికొచ్చిన పంట ఎండిపోకుండా చివరి ఆయకట్టు దాకా కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, వచ్చే యాసంగి సీజన్‌లో తప్పుడు ప్రచారాలను నమ్మి వరి పంట వేయవద్దని, వరి సాగును వాయిదా వేసుకోవాలని కోరారు. నారుమడి దశలోనే ఎండిపోయి, మోటార్లు, ట్రాన్స్‌ఫార్లు కాలిపోయే ప్రమాదం ఉన్నదని, ప్రజలు కూడా నీటిని వృధా చేయకుండా చుక్క చుక్కనూ ఒడిసిపట్టాలని, కార్లు, బండ్లు కడగడానికి తాగునీటిని వాడొద్దని సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**ఎంత భారమైనా విద్యుత్‌ను కొనుగోలు చేస్తాం**

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ వినియోగం పెరిగిందని సిఎం తెలిపారు. అక్టోబర్ నెలలో 15 వేల మెగావాట్లు ఉండాల్సిన విద్యుత్ డిమాండ్ ఏకంగా 20 వేల మెగావాట్లకు చేరిందని, ఈనెల 15వ తేదీన రికార్డు స్థాయిలో 20,003 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరగడం ఇందుకు నిదర్శనమన్నారు.



రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఒకేసారి ఆన్ అయ్యాయని, మరో 20 రోజుల్లో వానాకాలం పంటలు కోతకు రానున్నాయని, చేతికొచ్చిన పంట ఎండిపోకూడదనే ఏకైక లక్ష్యంతో మార్కెట్‌లో విద్యుత్ యూనిట్ ఎంత ధరకు దొరికినా కొనుగోలు చేసి, రైతులకు అందిస్తున్నామని వివరించారు. పొరుగు రాష్ట్రాలైన కర్నాటక , మహారాష్ట్ర, ఎపి, తమిళనాడు కూడా విద్యుత్ కొరత ఎదుర్కొంటున్నదన్నారు. ఓవర్‌లోడ్‌తో చిన్నపాటి అంతరాయాలు ఏర్పడితే కొందరు పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రాల నుంచి మిగిలిన రాష్ట్రాలకు కేంద్రమే తక్కువ ధరకు విద్యుత్‌ను సమకూర్చాలని డిమాండ్ చేశారు.

**ఉపాధి హామీ పనుల పెంపు**

రైతు కూలీలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 25 వేల మంది ఉపాధి హామీ పనులకు వెళ్తే, ప్రస్తుతం ఆ సంఖ్య 2.5 లక్షలకు చేరిందన్నారు. ఉపాధి హామీ నిధులతో చెరువులు, కుంటల పూడికతీత, మరమ్మతు పనులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని, వానాకాలంలో పంట నష్టపోయిన రైతులను, రానున్న సీజన్‌లో పంట సాగు చేయని రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రయోజిత పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం 60:40 నిష్పత్తి నిధులతో ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. దీనికి సంబంధించి సమగ్ర నివేదికను కేంద్రానికి పంపుతామన్నారు. పశుగ్రాసం, పశువుల తాగునీటి కొరత రాకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య, పశుసంవర్ధక శాఖలను పూర్తి అప్రమత్తం చేశామన్నారు.

గతంలో కరోనా సంక్షోభం వచ్చినప్పుడు ప్రధాని ఏ పిలుపునిచ్చినా రాజకీయాలకతీతంగా రాష్ట్రం మొత్తం సహకరించిందని, ప్రస్తుతం ఎల్‌నినో విపత్తు సమయంలోనూ అదే స్ఫూర్తిని చాటాలని కోరారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ కార్యాచరణను, పరిస్థితులను ప్రజలకు వివరించేందుకు మీడియా, సినీ ప్రముఖులు, కళాకారుల సహకారం తీసుకుంటామన్నారు.

**ఎల్‌నినోకు ప్రత్యేక నోడల్ అధికారి..**
**వార్ రూమ్ ఏర్పాటు**

ఎల్‌నినో తీవ్రత నేపథ్యంలో ప్రత్యేకంగా వార్ రూమ్‌ను ఏర్పాటు చేసి, నోడల్ అధికారిగా ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావును నియమించినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా కేటాయిస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రజలను అప్రమత్తం, చైతన్యం చేసేందుకు కళా ప్రదర్శనలు నిర్వహిస్తామని, అవగాహన కల్పించేందుకు నిపుణులు, సీనియర్ జర్నలిస్టులు విస్తృతంగా వ్యాసాలు రాయాలని కోరారు.

## మాదాపూర్‌లో రూ.400 కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ

**రెండు ఎకరాలకు పైగా భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ ఖానామెట్ గ్రామంలో ఆక్రమణకు గురవుతున్న రూ.400 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా రక్షించింది. రెండు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ స్థలానికి గురువారం ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు హైడ్రా ఈ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమణదారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా, గతంలో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. కొందరు కోర్టును ఆశ్రయించినప్పటికీ వారికి అనుకూలంగా తీర్పు రాలేదు. తాజాగా ఆక్రమణదారులు ప్రభుత్వ భూమి చుట్టూ బ్లూ షీట్లతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో రెవెన్యూ అధికారులు హైడ్రాను ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగి ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన బ్లూ షీట్ ఫెన్సింగ్‌ను తొలగించారు. అనంతరం రెండు ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఆధ్వర్యంలో శాశ్వత ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ స్థలం ప్రభుత్వ భూమి అని తెలియజేస్తూ రెవెన్యూ అధికారుల సమక్షంలో హైడ్రా బోర్డులను కూడా ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగా ఆక్రమణలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హైడ్రా అధికారులు తెలిపారు.

## బిసి కోటా వర్తించదు

**(మొదటి పేజీ తరువాయి)**

పిటిషన్‌ను కొట్టివేసింది. ఆ అంశంపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ శ్రీచంద్రశేఖర్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఆ తీర్పు వెలువరించింది. హిందూ సామాజిక వ్యవస్థ నుంచి మరో మతంలోకి మారిన వ్యక్తి, గతంలో తన సామాజిక వర్గానికి ఉన్న వెనకబాటుతనాన్ని చూపించి రిజర్వేషన్ పొందలేరని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంలో మద్రాస్ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. తమిళనాడులో బిసి, అత్యంత వెనకబడిన వర్గాలు, కొన్ని ఇతర సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. వీటిలోని కొందరు వ్యక్తులు ఇస్లాంలోకి మారిన తర్వాత కూడా రిజర్వేషన్ ప్రయోజనాలు పొందేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చి 9న ఒక జిఓ జారీ చేసింది. ఆ జీవో ప్రకారం, బిసి, అత్యంత వెనకబడిన వర్గాలు, కొన్ని ఇతర వర్గాలకు చెందిన వ్యక్తులు ఇస్లాంలోకి మారితే, వారిని గుర్తించిన ఏడు ముస్లిం సామాజిక వర్గాల్లో ఒకదానికి చెందినవారిగా పరిగణించే అవకాశం కల్పించారు. దీనికి అనుగుణంగా వారికి సంబంధిత సామాజిక వర్గ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ పత్రాల ఆధారంగా బిసి ముస్లింలకు వర్తించే రిజర్వేషన్ పొందేందుకు అవకాశం కల్పించాలన్నది ఈ జిఓ ఉద్దేశం. అయితే, ఈ నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు తప్పుబట్టింది. 2024 జూన్ 25న ఇచ్చిన తీర్పులో ప్రభుత్వ జిఒను కొట్టివేసింది. మతం మారిన వ్యక్తికి ఆ మతం ప్రకారమే గుర్తింపు ఉంటుందని, గతంలో ఉన్న సామాజిక వర్గం ఆధారంగా కొత్త మతంలో రిజర్వేషన్ కోరలేరని పేర్కొంది. ఈ తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన వర్గాలకు చెందిన వ్యక్తులు ఇస్లాంలోకి మారినంత మాత్రాన రిజర్వేషన్ ప్రయోజనాలు కోల్పోకూడదన్న ఉద్దేశంతోనే జిఒ తీసుకొచ్చినట్లు ప్రభుత్వం వాదించింది. ఇప్పటికే రిజర్వేషన్ పొందుతున్నవారికి మతమార్పిడి కారణంగా ఆ ప్రయోజనాలు దూరం కాకూడదని తెలిపింది. ఇలాంటి వారికి రిజర్వేషన్ కల్పించడం వల్ల సామాజిక వర్గాల మధ్య ఉన్న పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాదని కూడా వాదించింది. ప్రభుత్వ వాదనలను పరిశీలించిన సుప్రీంకోర్టు, పూర్వపు మతంలో ఉన్న సామాజిక వెనకబాటుతనాన్ని మరో మతానికి బదిలీ చేయలేమని స్పష్టం చేసింది. హిందూ సామాజిక వ్యవస్థ నుంచి ఇతర మతాల్లోకి మారిన వ్యక్తులు కేవలం గతంలో తమకు ఉన్న సామాజిక స్థితిని ఆధారంగా చేసుకుని బిసి రిజర్వేషన్ కోరలేరని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ప్రకారం రిజర్వేషన్ పొందాలంటే, మతం మారడానికి ముందు ఉన్న సామాజిక వెనకబాటుతనాన్ని మాత్రమే ఆధారంగా చూపించడం సరిపోదని ధర్మాసనం పేర్కొంది. ఈ అంశంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసింది. రాజ్యాంగంలోని షెడ్యూల్డ్ కులాల ఉత్తర్వు1950లో కూడా కొన్ని నిబంధనలు ఉన్నాయని ధర్మాసనం ప్రస్తావించింది. ఆ ఉత్తర్వులోని మూడో పేరా ప్రకారం హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతాన్ని అనుసరించేవారికే షెడ్యూల్డ్ కులాల గుర్తింపు వర్తిస్తుందని పేర్కొంది. అయితే, ఈ నిబంధన షెడ్యూల్డ్ కులాల గుర్తింపునకు సంబంధించినది కాగా, ప్రస్తుత వివాదం బిసి ముస్లిం రిజర్వేషన్‌కు సంబంధించినదనే అంశాన్ని గమనించాలి.

## స్కూల్ భవనం

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రతినిధి మహ్మద్ ఆసిమ్ మాట్లాడుతూ మరో 40 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని, వారికి చికిత్సలు చేస్తున్నామని చెప్పారు.ఈ స్కూలు భవనాన్ని ఎప్పుడు నిర్మించారు? ఇటీవల మరమ్మతులు చేశారా? అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.స్థానిక కాలమానం ప్రకారం గురువారం ఉదయం 8.48 గంటల సమయంలో డైర్ కాలనీలోని అల్–ఖైర్ ప్రైవేటు పాఠశాల భవనం పై కప్పు కూలిపోవడంతో తక్షణం అత్యవసర సర్వీసులు రంగంలోకి దిగాయి. పోలీసులు, సహాయ బృందాలు అనేక గంటలపాటు శిథిలాలను గాలించి పిల్లలను వెలికితీశారు. మరింతమంది పిల్లలు ఈ శిథిలాల్లో అడుగున కూరకుపోయి ఉంటారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సన్నని ఇరుకైన సందులో ఈ ప్రైవేటు పాఠశాల భవనం ఉండటంతో పిల్లలను అత్యవసరంగా ఆసుపత్రులకు తరలించడానికి సహాయ సిబ్బంది చాలా కష్టపడ్డారు. ఈ సందులోకి ఒకేఒక్క వాహనం కూడా అంత తొందరగా ప్రవేశించడానికి ఇబ్బందులు ఉన్నాయి. ఈ విషాద ఘటన విని నా హృదయం ముక్కలైపోయిందని, యావత్ పాకిస్థాన్ దేశం దిగ్భ్రాంతికి గురైందని ఆ దేశాధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ అన్నారు. స్కూలు భవనం పై అంతస్తు పురాతనమైనదని, ఎక్కువ బరువు మోయలేదని, అందుకే కుప్పకూలిపోయిందని స్థానిక పోలీసు ఉన్నతాధికారి ఒకరు అంతర్జాతీయ మీడియాకు చెప్పారు. అల్–ఖైర్ ప్రైవేటు పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని పెషావర్ పోలీస్ ఆపరేషన్స్ సీనియర్ సూపరింటెండెంట్ ఫర్హాన్ అహ్మద్ చెప్పారు. పాఠశాల భవనంలో 300 మంది విద్యార్థులు మూడు తరగతి గదుల్లో చదువుకుంటున్నారని, ఈ ప్రమాదం వల్ల 100 మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. ఈ మూడు అంతస్తుల భవన నిర్మాణం అత్యంత బలహీనంగా ఉందని,రాకపోకల మార్గం ఎంతమాత్రం అనువుగా లేదని పెషావర్ పోలీసు అధికారి డా.మైన్ సయాద్ చెప్పారు. కాగా, పాఠశాల కుప్పకూలిపోయిన తర్వాత తన చేతులతో ఆరుగురు విద్యార్థులను శిథిలాల నుండి వెలికి తీశానని సమీప కళాశాలలోని ఒక ఉపాధ్యాయుడు చెప్పారు. పాఠశాల కుప్పకూలిన శబ్దాలు,పోలీసు సైరన్లు విని తాను హూటాహుటిన ఆ ప్రదేశానికి వెళ్ళి సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నానని,మొత్తం 20 మంది విద్యార్థులను వెలికితీశానని చెప్పారు. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఈ ఘటనపై స్పందిస్తూ, యావత్ పాకిస్థాన్ ఈ ఘటనపట్ల తీవ్ర సంతాపం పాటిస్తోందని చెప్పారు. స్కూళ్ళ భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని,ఇలాంటి ఘటనలు మళ్ళీ జరగకుండా తగిన తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.ఎలాంటి అరమరికలూ లేకుండా ఈ ఘటనపై విచారణ జరుగుతుందని చెప్పారు. ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ స్పందిస్తూ, దేశంలో పాఠశాలల భద్రతే ముఖ్యమైన విషయమని,పిల్లల రక్షణకు అవసరమైన బలమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. సెనేటర్ అబిద్ షేర్ అలీ మాట్లాడుతూ, ఇది ఎంతో బాధాకరమైన విషయమని, యావత్ దేశం విషాదంలో మునిగిపోయిందని అన్నారు. సహాయ కార్యక్రమాలు పూర్తిగా ఐదు గంటల వ్యవధిలో పూర్తిచేసినట్లు రెస్క్యూ ఆపరేషన్స్ విభాగాధిపతి ప్రకటించారు. అధికారిక గణాంకాల ప్రకారం పాకిస్థాన్‌లో 46.5 శాతం విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలోనే చదువుతున్నారు. ప్రపంచబ్యాంకు అంచనాల ప్రకారం 49 శాతం మంది ప్రైవేటు పాఠశాలల్లోనే చదువుతున్నారు.

## 'నైరుతి' నిష్క్రమణ

**(మొదటి పేజీ తరువాయి)**

దేశంలోని కొన్ని ప్రాంతాలను ప్రభావితం చేసే ఈశాన్య రుతుపవనాలు. దేశ ఆర్థిక వ్యవస్థలో నైరుతి రుతుపవనాలు కీలక పాత్ర పోషిస్తాయి, ముఖ్యంగా ఖరీఫ్ పంటల చక్రంపై వాటి ప్రత్యక్ష ప్రభావం ఉండనుంది. నైరుతి రుతుపవనాల కంటే తక్కువ తీవ్రత కలిగిన ఈశాన్య రకం రుతుపవనాలు రబీ పంటల పెరుగుదలకు చాలా ముఖ్యమైనవి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణంగా కురవాల్సిన 868.6 మి.మీ. వర్షపాతం కంటే 12.6 శాతం తక్కువగా, 759.4 మి.మీ. వర్షపాతంతో ముగిసింది. ఈ వర్షపాత లోటుకు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంపై నెలకొన్న ఎల్ నినో పరిస్థితులే కారణం. ఇవి జూన్‌లో ప్రారంభమై అప్పటి నుండి బలం పుంజుకుంటున్నాయి. ఎల్ నినో అనేది ఎల్ నినో సదరన్ ఆసిలేషన్‌కు చెందిన మూడు దశలలో ఒకటి. భారతదేశంలో రుతుపవన వర్షపాతం తగ్గడానికి కారణమయ్యే ఎల్ నినో, భూగోళంపై వేడెక్కించే ప్రభావాన్ని కలిగి ఉంటుందని తెలిసినప్పటికీ, దానికి వ్యతిరేక దశ అయిన లా నినా సాధారణంగా చల్లబరిచే ప్రభావాన్ని కలిగిస్తుంది. ప్రపంచ వాతావరణ సంస్థ వంటి ప్రపంచ వాతావరణ సంస్థలు, ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం 2026 డిసెంబర్‌లో గరిష్ట స్థాయికి చేరుకునే అవకాశం ఉందని, 1950లో పరిశీలనలు ప్రారంభమైనప్పటి నుండి ఇదే అత్యంత బలమైనదిగా మారవచ్చని అంచనా వేశాయి. అంతేకాకుండా, ఎల్ నినో పరిస్థితులు 2027 ఫిబ్రవరి వరకు కొనసాగుతాయని భావిస్తున్నారు.

# ఈ బౌలింగ్‌తో ప్రపంచ‘కప్’ కష్టమే

### భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్




టీమిండియా బౌలర్లపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ విమర్శలు గుప్పించాడు. ఈ బౌలింగ్‌తో టీమిండియా ప్రపంచకప్ గెలవలేదని ఘాటుగా విమర్శించాడు. వెస్టిండీస్‌తో ఐదు టి–20ల సిరీస్‌లో భాగంగా ఉప్పల్ వేదికగా జరిగిన నాలుగో టి–20లో టీమిండియా 24 పరుగుల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓటమికి బౌలర్ల వైఫల్యమే ప్రధాన కారణమని మహమ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డాడు. 'హైదరాబాద్ మ్యాచ్‌లో భారత్ ఓటమికి ప్రధాన కారణం బౌలింగ్ వైఫల్యమే. బౌలర్లే భారీగా పరుగులు సమర్పించారు. 247 పరుగులు ఇవ్వడమంటే మాములు విషయం కాదు. ఇదే తొలిసారి కాదు. అంతకుముందు 250+ టార్గెట్‌ను కాపాడుకోవడంలోనూ భారత బౌలర్లు విఫలమయ్యారు. ఐదు మ్యాచ్‌ల్లో మూడింటిని బ్యాటర్లు గెలిపిస్తే.. మిగతా రెండింటిని బౌలర్లు ఓడించారు. ఇలాంటి కాంబినేషన్‌తో ప్రపంచకప్ నెగ్గడం అసాధ్యం.

**ఆ కాంబినేషన్‌ను గుర్తు చేసుకోండి..** ఒకసారి ఐసిసి టి–20 ప్రపంచకప్ 2024 కాంబినేషన్ను గుర్తు చేసుకోండి. ఆ విజయంలో జట్టులోని ప్రతీ ఒక్కరు భాగస్వామిగా నిలిచారు. జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్.. బౌలర్లతో పాటు బ్యాటర్లు సత్తా చాటారు. వెస్టిండీస్‌తో నాలుగో టి–20లో అభిషేక్ శర్మ స్లోగా ఆడాడని అతడిని విమర్శిస్తున్నారు.

ప్రతీ బ్యాటర్ అన్ని రోజులు అద్భుతంగా ఆడటం కష్టమని గ్రహించాలి. సంజూ శాంసన్ అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు 'అని మహమ్మద్ కైఫ్ చెప్పుకొచ్చాడు. ఈ ఐదు టి–20ల సిరీస్‌లలో తొలి మ్యాచ్ మినహా మిగతా మూడింటిలో భారత బౌలర్లు 200+ రన్స్ సమర్పించుకున్నారు. పిచ్ కండిషన్స్‌కు తగ్గట్లు బౌలింగ్ చేయడంలో భారత బౌలర్లు విఫలమవుతున్నారు.

### ఆ ఒక్క ఓవరే టీమిండియా కొంపముంచింది

పొట్టి ఫార్మాట్‌లో వెస్టిండీస్‌ను ఓడించడం అంత తేలిక కాదని మరోసారి రుజువైంది. భారత్‌తో వన్డే సిరీస్ కోల్పోయిన వెస్టిండీస్.. ఐదు టి–20ల సిరీస్‌లో గట్టి పోటీ ఇస్తోంది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో ఐదు టి–20ల సిరీస్‌లో 2–2తో సమంగా నిలిచింది. షై హోప్ ఈ సిరీస్‌లో రెండో అజేయ శతకాన్ని నమోదు చేశాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 247 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం భారత్ 19.3 ఓవర్లలో 223పరుగులకు ఆలౌటైంది. సంజూశాంసన్ హాఫ్ సెంచరీతో రాణించినా.. తిలక్ వర్మ, నితీష్ కుమార్‌రెడ్డి పోరాడినా ఫలితం లేకపోయింది. కీమో పాల్ ఐదు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించగా.. గుడకేష్ మోతీ రెండు వికెట్లు పడగొట్టాడు. రొమారియో షెఫర్డ్, షమర్ స్ప్రింగ ర్ తలో వికెట్ తీసారు. బౌలింగ్ వైఫల్యం టీమిండియా ఓటమికి ప్రధాన కారణమైనా? వారిని నిందించలేం. ఎందుకంటే ఉప్పల్ స్టేడియంలో బౌండరీలు చాలా చిన్నవిగా ఉంటాయి. అంతేకాకుండా పిచ్ కండిషన్స్ కొంచెం బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నాయి. బంతి ఆగి వచ్చినా.. ఆవిషయాన్ని భారత బౌలర్లు పసిగట్టలేక మూల్యం చెల్లించుకున్నారు. బౌలర్లు విఫలమైనా.. బ్యాటర్లు సరిగ్గా ఆడి ఉంటే ఈ మ్యాచ్‌లో భారత్ గెలిచేదని విశ్లేషకులు, అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

**ములపు తిప్పిన గుడకేష్ ఓవర్..** సంజూ శాంసన్ అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. సంజూ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ వెనుదిరిగినా.. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ జట్టును ముందుకు నడిపించారు. దాంతో భారత్ గెలుస్తుందనే అంతా అనుకున్నారు. కానీ గుడకేష్ మోతీ వేసిన 12వ ఓవర్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఈ ఓవర్లో వరుస బంతుల్లో అభిషేక్ శర్మ, నమన్ ధీర్ ఔటవ్వడం భారత్ పతనాన్ని శాసించింది. ఆ తర్వాత తిలక్, నితీష్ రెడ్డి రాణించినా.. లక్ష్యం పెద్దది కావడంతో దూకుడుగా ఆడాలనే ఒత్తిడి వారిని ఔటయ్యేలా చేసింది. నమన్ ధీర్ కాసేపు క్రీజులో ఉండి భారీ షాట్స్ ఆడి ఉంటే.. ఇతర బ్యాటర్లపై ఒత్తిడి తగ్గేది. అప్పుడు భారత్ గెలిచే అవకాశం ఉండేది.

# అభిషేక్ శర్మ ‘సిక్స్’ల రికార్డ్




టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. ఒకే క్యాలండర్ ఇయర్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలో సూర్యకుమార్ యాదవ్ పేరిట ఉన్న ఈ రికార్డ్‌ను అధిగమించాడు. వెస్టిండీస్‌తో ఉప్పల్ వేదికగా జరిగిన నాలుగో టి–20లో షమార్ స్ప్రింగర్ వేసిన 9వ ఓవర్‌లో అభిషేక్ శర్మ సిక్స్ బాదడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. ఈ ఏడాది అభిషేక్ శర్మ ఇప్పటి వరకు 69 సిక్స్‌లు బాదాడు. 2022లో సూర్యకుమార్ యాదవ్ 68 సిక్స్‌లతో టాప్‌లో ఉండగా.. అభిషేక్ శర్మ తాజాగా అధిగమించాడు. 2025లో అభిషేక్ శర్మ 54 సిక్స్‌లతో టాప్‌లో నిలవగా.. ఇషాన్ కిషన్ ఈ ఏడాది 52 సిక్స్‌లతో రేసులో ఉన్నాడు. షాహిబ్జాద ఫర్హాన్ 2025లో 45 సిక్స్‌లు బాది ఈ జాబితాలో కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ టి–20ల్లో ఇప్పటికే 100 సిక్స్‌ల మైలురాయి అందుకున్న అభిషేక్ శర్మ.. 68 ఇన్నింగ్స్‌లలో మొత్తం 102 సిక్స్‌లు బాదాడు. అయితే నాలుగో టి20లో అభిషేక్ శర్మ తన జోరును కొనసాగించలేకపోయాడు. తన శైలికి భిన్నంగా ఆడిన అభిషేక్ 24 బంతుల్లో 29 పరుగులు చేసి వెనుదిరిగాడు.

## పోటీ కోసం జికె

(యుపిఎస్‌సి, గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)



## జీవశాస్త్రం పర్యావరణ శాస్త్రం అంతరిక్ష శాస్త్రం

**జీవశాస్త్రం**

- జీవుల ప్రాథమిక నిర్మాణ, క్రియాత్మక ప్రమాణం ఏది?
  సమాధానం: కణం.
- కణంలోని జన్యు సమాచారాన్ని ప్రధానంగా మోసుకెళ్లేది ఏది?
  డిఎన్‌ఎ.
- డిఎన్ఎ పూర్తి రూపం ఏమిటి?
  డియాక్సీరిబోన్యూక్లెయిక్ యాసిడ్.
- ఆర్ఎన్ఎ పూర్తి రూపం ఏమిటి?
  రిబోన్యూక్లెయిక్ యాసిడ్.
- కణంలోని శక్తి కేంద్రంగా దేనిని పిలుస్తారు?
  మైటోకాండ్రియా.
- మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ ప్రధానంగా ఎక్కడ జరుగుతుంది?
  క్లోరోప్లాస్ట్‌లో.
- మొక్కలకు ఆకుపచ్చ రంగును ఇచ్చే వర్ణద్రవ్యం ఏది?
  క్లోరోఫిల్.
- మానవ శరీరంలో అతిపెద్ద అవయవం ఏది?
  చర్మం.
- మానవ శరీరంలో అతిపెద్ద అంతర్గత అవయవం ఏది?
  కాలేయం.
- మానవ గుండెలో ఎన్ని గదులు ఉంటాయి?
  నాలుగు.
- ఎర్ర రక్త కణాల ప్రధాన పని ఏమిటి?
  ఆక్సిజన్ను రవాణా చేయడం.
- హిమోగ్లోబిన్లో ప్రధానంగా ఉండే లోహం ఏది?
  ఇనుము.
- మానవ శరీరంలో ఇన్సులిన్ను ఉత్పత్తి చేసే అవయవం ఏది?
  ప్యాంక్రియాస్.
- విటమిన్ ‘సి’ లోపం వల్ల వచ్చే వ్యాధి ఏది?
  స్కర్వీ.
- విటమిన్ ‘బి’ లోపం వల్ల వచ్చే వ్యాధి ఏది?
  బెరిబెరి.
- రక్తం గడ్డకట్టడంలో సహాయపడే విటమిన్ ఏది?
  విటమిన్ ‘కె’.
- మలేరియాకు కారణమయ్యే పరాన్నజీవి ఏది?
  ప్లాస్మోడియం.
- మలేరియాను వ్యాప్తి చేసే దోమ ఏది?
  ఆడ అనోఫిలిస్ దోమ.
- క్షయవ్యాధి (టిబి)కి కారణమయ్యే బ్యాక్టీరియా ఏది?
  Mycobacterium tuberculosis_.
- ఎయిడ్స్‌కు కారణమయ్యే వైరస్ ఏది?
  హెచ్ఐవి.
- టీకాలు ప్రధానంగా ఏ వ్యవస్థను ప్రేరేపిస్తాయి?
  రోగనిరోధక వ్యవస్థ.
- యాంటీబయాటిక్స్ ప్రధానంగా దేనిపై పనిచేస్తాయి?
  బ్యాక్టీరియా, వైరస్‌లపై సాధారణంగా పనిచేయవు.




- మానవ శరీరంలో సాధారణంగా ఎన్ని జతల క్రోమోజోములు ఉంటాయి?
  23 జతలు.
- జన్యుశాస్త్ర పితామహుడిగా ఎవరిని పిలుస్తారు?
  గ్రెగర్ మెండల్.

**పర్యావరణ శాస్త్రం**

- గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణమైన గ్రీన్‌హౌస్ వాయువుల్లో ఒకటి ఏది?
  కార్బన్ డయాక్సైడ్.
- ఓజోన్ పొర ప్రధానంగా ఏ వాయుమండల పొరలో ఉంది?
  స్ట్రాటోస్ఫియర్.
- ఓజోన్ పొర మనలను దేనినుంచి రక్షిస్తుంది?
  హానికరమైన అతినీలలోహిత (యువి) కిరణాల నుంచి.
- ఆమ్ల వర్షాలకు ప్రధాన కారణమైన వాయువులు ఏవి?
  సల్ఫర్ డయాక్సైడ్ మరియు నైట్రోజన్ ఆక్సైడ్‌లు.
- పునరుత్పాదక శక్తికి ఒక ఉదాహరణ చెప్పండి.
  సౌర శక్తి.
- బయోమాస్ శక్తి ఏ వనరుపై ఆధారపడి ఉంటుంది?
  జీవ పదార్థాలపై.
- యూట్రోఫికేషన్కు ప్రధాన కారణం ఏమిటి?
  నీటిలో నైట్రోజన్, ఫాస్ఫరస్ వంటి పోషక లవణాలు అధికంగా చేరడం.
- జీవ వైవిధ్యం అంటే ఏమిటి?
  జీవుల, వాటి జన్యువుల, పర్యావరణ వ్యవస్థల వైవిధ్యం.
- ఆహార గొలుసులో ఉత్పత్తిదారులు సాధారణంగా ఎవరు?
  ఆకుపచ్చ మొక్కలు మరియు ఇతర స్వపోషక జీవులు.
- కార్బన్ చక్రంలో మొక్కలు కార్బన్ డయాక్సైడ్‌ను ఏ ప్రక్రియలో గ్రహిస్తాయి?
  కిరణజన్య సంయోగక్రియలో.

**అంతరిక్ష శాస్త్రం**

- సౌర కుటుంబంలో అతిపెద్ద గ్రహం ఏది?
  గురుడు (జూపిటర్).
- సౌర కుటుంబంలో సూర్యునికి అత్యంత సమీపంలోని గ్రహం ఏది?
  బుధుడు.
- ఎర్ర గ్రహంగా ఏ గ్రహాన్ని పిలుస్తారు?
  అంగారకుడు (మార్స్).
- భూమికి సహజ ఉపగ్రహం ఏది?
  చంద్రుడు.
- సూర్యుని చుట్టూ భూమి ఒకసారి తిరగడానికి సుమారు ఎంత సమయం పడుతుంది?
  365 రోజులు.
- భూమి తన అక్షం చుట్టూ ఒకసారి తిరగడానికి సుమారు ఎంత సమయం పడుతుంది?
  24 గంటలు.
- సూర్యుడు ప్రధానంగా ఏ రెండు మూలకాలతో కూడి ఉన్నాడు?
  హైడ్రోజన్ మరియు హీలియం.
- చంద్రుడిపై మొదట అడుగుపెట్టిన వ్యక్తి ఎవరు?
  నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్.
- భారతదేశపు తొలి కృత్రిమ ఉపగ్రహం ఏది?
  ఆర్యభట.

# ఆర్థిక ఇబ్బందుల్లో చేనేత కార్మికులు

### నేతన్న భరోసా, త్రిఫ్ట్ ఫండ్ నిధులు వెంటనే విడుదల చేయాలి
### చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేనేత కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేతన్న భరోసా, త్రిఫ్ట్ ఫండ్ పథకాల నిధులను వెంటనే విడుదల చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. త్రిఫ్ట్ ఫండ్ పథకానికి 18 నెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ధనంజయ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వెంకట్రాములు మాట్లాడుతూ చేనేత కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం గా వ్యవహరిస్తోందని విమర్శించారు. సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలను రద్దు చేసి, తిరిగి వడ్డీలేని రుణాలు అందించాలని కోరారు. ప్రభుత్వ సంస్థలకు అవసరమైన చేనేత వస్త్రాల కోసం ముందుగానే టెస్కోకు ఆర్డర్లు ఇచ్చి కార్మికులకు నిరంతర పని కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులందరికీ నెలకు రూ.5వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మి నరసయ్య మాట్లాడుతూ టెస్కోకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని, చేనేత రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు కోట రాజయ్య, మెరుగు చంద్రప్రకాష్, కె.బాలమోహన్, గోపయ్య, సత్తయ్య, వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ‘ఇందిరమ్మ’లో రాజకీయ వివక్ష

### లాటరీ పద్ధతిలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి
### 22న కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌లతో కలిసి ఆందోళన : విపక్షాల నిర్ణయం




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష చూపుతున్నారని, నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని విపక్షాలు ఆరోపించాయి. లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశాయి. సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల సంయుక్త సమావేశం గురువారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరైంది కాదని, కండువ కప్పుకున్న కాంగ్రెస్ కార్యకర్తలనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని నేతలు ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిబంధనలను పట్టించుకోవడం లేదని, కాంగ్రెస్ కార్యకర్తలు ఇచ్చిన జాబితాలనే ఆమోదిస్తున్నారని, అధికారులు ఆ జాబితాలో అనర్హులు ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ తీరు మార్చుకోవాలని వారు హెచ్చరించారు. ఈనెల 22న సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కలిసివచ్చే పార్టీలతో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఆందోళనకు ప్రజాప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జెడ్‌పి మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, నాయకులు యర్రా బాబు, బెల్లం వేణు, ఆవుల అశోక్, శింగు నర్సింహారావు, పర్సా రాంచందర్ రావు, బానోత్ కొండ, శివరామకృష్ణ, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# సాగుకు నీటి గండం

### పంటల బీమా పథకం లేక రైతుల ఇబ్బందులు
### రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

**ప్రజాపక్షం/కొణిజర్ల:** ఎల్ నినో ప్రభావంతో సాగుకు నీటిగండం ఏర్పడుతుందని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ తెలిపారు. గురువారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పశ్య పద్మ ప్రారంభించారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎల్ నినో ప్రభావ పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. బోర్లలో నీరు ఉన్నా కరెంటు కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో పంటల బీమా పథకం లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసి పాలేరుకు గోదావరి జలాలను అనుసంధానం చేయాలన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌కు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ పంటల సాగు చేపట్టాలన్నారు. రూ.రెండు లక్షలకు పైగా ఉన్న రుణమాఫీని తక్షణమే అమలు చేయాలన్నారు. కరువు పరిస్థితుల్లో రైతులకు 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలన్నారు. విబి జీ రాంజీ పథకాన్ని వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడేవిధంగా చూడాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ గ్రామా న రైతులను చైతన్యవంతులను చేసి పోరాటాలకు సిద్ధం చేయాలని పశ్య పద్మ కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్, రైతు సంఘం నాయకులు పెదమాళ్ల రత్తయ్య, దేరంగుల లక్ష్మయ్య, యాసా వెంకటేశ్వర్లు, గోపాలరావు, నర్సారావు, అడపా కృష్ణయ్య, వెంకన్న, దేరంగుల వెంకన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించండి : ఎఐటియుసి




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష విడనాడి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి జాతీయ సమితి సభ్యుడు శింగు నర్సింహారావు డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు పాలకులు తాత్సరం చేస్తున్నారని ప్రధానమైన రంగాలకు సంబంధించిన ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూల వైఖరి ప్రదర్శించడం లేదని ఆయన ఆరోపించారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద గల ధర్నాచౌక్‌లో సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు ఏఐటియుసి పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్బంగా నర్సింహారావు మాట్లాడుతూ వైద్య రంగంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పేరుతో ఉద్యోగులను నియమించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎంలో 17 లక్షల మంది పనిచేస్తుండగా తెలంగాణలో 17 వేల మంది ఉద్యోగులు, కార్మికులు దశాబ్దకాలంగా పనిచేస్తున్నారని శింగు నర్సింహారావు తెలిపారు. వీరి భవిష్యత్తును పాలకులు అంధకారంగా మార్చారని గత్యంతరం లేక శ్రమ దోపిడీకి గురవుతున్నారని వీరికి కనీసం పిఎఫ్, ఇఎస్‌ఐ తదితర చట్టబద్ధ హక్కులు ఏవి అమలు కావడం లేదని ఆయన తెలిపారు. కనీసం హెల్త్ కార్డులు కూడా లేవని కొన్ని రాష్ట్రాలు వీరిని పర్మినెంట్ చేశారని రాష్ట్రంలో కూడా పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగులను బెదిరించడం సరికాదన్నారు. మద్దతు తెలియజేసిన వారిలో ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు గాదె లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని జిల్లాకేంద్రంలో మూడు రోజుల నుంచి ఉద్యోగులు, కార్మికులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ దీక్షకు గురువారం ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలతో కమిటీలతో కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. ఎన్‌హెచ్‌ఎంలను గుర్తించి వారికి న్యాయం చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎన్‌హెచ్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.




# మున్సిపల్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

### సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ :** మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇతర ఎన్ఎంఆర్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియూసి అనుబంధ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వానంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ గణేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట మున్సిపాలిటిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రెండునెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో వారి కుటుంబాలు ఆర్థికఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. కార్మికుల కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర సహ కార్యదర్శి వేల్పుల సారంగపాణి యాదవ్, నర్సంపేట మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్‌ది పైశాచిక ఆనందం



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం రావడం వల్లనే రాష్ట్రంలో కరవు వచ్చిందని బిఆర్ఎస్ నాయకులు మాట్లాడటం వారి పైశాచిక ఆనందానికి, మిడిమిడి జ్ఞానానికి నిదర్శనమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపి, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు బ్రిటన్, జపాన్ వంటి వంద దేశాల్లో ఎల్‌నినో ప్రభావం, తీవ్ర కరవు, నీటి ఎద్దడి పరిస్థితులు నెలకొన్నాయని, అక్కడ కూడా కాంగ్రెస్ అధికారంలో ఉందా? అని సిఎం ప్రశ్నించారు. వంద దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉందని ఐక్యరాజ్య సమితి (యుఎన్ఒ) ప్రకటించిందని, యుఎన్ఒలో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఉన్నారని సిఎం నిలదీశారు. కృష్ణా, గోదావరి బేసిన్‌ల నీటి అంశాలపై ఎప్పుడైనా శాసనసభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమని సిఎం సవాల్ చేశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో సిఎం మాట్లాడారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**తెలంగాణకు శాశ్వత మరణ శాసనం రాసిందే కెసిఆర్**

తెలంగాణ నీటి హక్కులను నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం బలిపీఠం ఎక్కించిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ట్రిబ్యునల్ తుది తీర్పు వచ్చే వరకు కృష్ణా జలాల్లో ఎపికి 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు చాలని సంతకాలు చేసి తెలంగాణ రాష్ట్రానికి శాశ్వత మరణశాసం రాసిందే అప్పటి సిఎం కెసిఆర్ అని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఢిల్లీలో చంద్రబాబు ముందు మోకరిల్లి సంతకం పెట్టారని, శాశ్వతంగా కృష్ణా జలాల్లో తెలంగాణకు మరణ శాసనం రాసి, హక్కులను ఎపికి ధారాదత్తం చేసిందే కెసిఆర్ అని, తెలంగాణ నీటిని చంద్రబాబు, జగన్‌కు తాకట్టు పెట్టారని మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టులపై రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసి, మరో రూ.40వేల కోట్ల బకాయిలు పెట్టి పోయారని ఆరోపించారు. ఇన్ని నిధులు ఖర్చు చేసినా పాలమూరురంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఎస్ఎల్‌బిసి, డిండి, సీతారామ ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని సిఎం ప్రశ్నించారు.

**కెసిఆర్ ఫామ్‌హౌస్‌కు పైపుల ద్వారా 'కొండపోచమ్మ నీళ్లు'**

కొండపోచమ్మ ప్రాజెక్ట్ నుంచి పంచపాండవుల చెరువుకు కాలువ తవ్వి, అక్కడి నుంచి నేరుగా కెసిఆర్ ఫామ్‌హౌస్‌కు వేశారని, తద్వారా వందల ఎకరాలకు దర్జాగా నీటిని మళ్లించుకుంటున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. నాలుగు కోట్ల ప్రజలకు లేని ప్రత్యేక నీటి సదుపాయం కెసిఆర్‌కు ఎందుకని సిఎం ప్రశ్నించారు. పంచపాండవుల చెరువు నుంచి నీళ్లు ఎవరి పొలాలకు వెళ్తున్నాయో తేల్చేందుకు నిజనిర్ధారణ కమిటీ వేద్దామా? అని అన్నారు. ఫామ్‌హౌస్ పంపుల కనెక్షన్ తొలగించేందుకు కెటిఆర్, హరీశ్‌రావు ముందుకొస్తారా? అని సిఎం ప్రశ్నించారు.

**'విదేశీ బొగ్గు'పై ఏ విచారణకు కావాలో కెటిఆరే చెప్పాలి**

విదేశీ బొగ్గు దిగుమతి విషయంలో విచారణ చేపట్టాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కె.తారకరామరావు (కెటిఆర్) ప్రభుత్వానికి లేఖ రాశారని, విదేశీ బొగ్గు దిగుమతి విషయంపై విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఏ సంస్థతో విచారణ చేపట్టాలో కెటిఆరే చెప్పాలని సిఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బహిరంగ విచారణనా?, లేదా ఈడి. సిబిఐ, స్వతంత్ర విచారణ సంస్థనా? జర్నలిస్టులతో విచారణ ఏది కావాలో కెటిఆర్ చెప్పాలని సిఎం అన్నారు. 'యాదాద్రి పవర్ ప్లాంట్ కోసం 50 శాతం ఇంపోర్టెడ్ బొగ్గు, 50 శాతం సింగరేణి జి9 బొగ్గు ఉపయోగిస్తామని 2016 డిసెంబర్ 9న ఎంటిఎస్‌పితో అప్పటి సిఎం కెసిఆర్ ప్రభుత్వమే ఒప్పందం చేసుకుందని సిఎం స్పష్టం చేశారు. బొగ్గు రవాణాకు రైల్లు నడపాలని రైల్వే శాఖకు లేఖ కూడా రాశారని, 14 మిలియన్ టన్నుల్లో 7 మిలియన్ టన్నుల బొగ్గును కృష్ణపట్నం పోర్టు ద్వారా విదేశాల నుంచి తేవడానికి తెరవెనుక ఉన్న ఆ ముసుగు వీరుడు ఎవరని సిఎం ప్రశ్నించారు. సింగరేణి సంస్థను పూర్తిగా ముంచి, 141 టెండర్లలో ఆ సంస్థ పాల్గొనకుండా చేసి, ఎన్‌జిటిలో స్టే ఇప్పించి 100 శాతం విదేశీ బొగ్గు తెచ్చేలా కుట్రకు పాల్పడ్డారని సిఎం ఆరోపించారు. యాదాద్రిలో ఐదో యూనిట్ ఇంకా పూర్తి కాలేదని, ప్రస్తుతం తమ ప్రభుత్వం నైనీ కోల్ సంస్థ నుంచి రోజుకు 23 రేక్‌ల బొగ్గు తెప్పించి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించిందని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో మాట్లాడి దేశీయ బొగ్గునే వాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని సిఎం వివరించారు. విద్యుత్ సంక్షోభం వస్తుందని బిఆర్ఎస్ ప్రభుత్వంలో నామినేషన్ పద్ధతిలో 1,040 మెగావాట్ల భద్రాద్రి, 4,000 మెగావాట్ల యాదాద్రి ప్లాంట్లను హడావుడిగా అప్పగించారని, రూ.17,950 కోట్లతో మూడేళ్లలో పూర్తి కావాల్సిన యాదాద్రి వ్యయాన్ని రూ.37,781 కోట్లకు (110 శాతం) పెంచారని సిఎం చెప్పారు.

# మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

విజయవాడలో జాతీయ సరస్‌మేళా ప్రారంభం



**అమరావతి** : దేశంలో స్వయం సహాయ సంఘాలు ఏర్పాటు చేసిన తర్వాత మహిళల జీవితాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని ఆర్థికంగా, పారిశ్రామికంగా ఎంతో ప్రగతి సాధించారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి లక్‌పతీ దీదీ ఆకాంక్షను నెరవేర్చే దిశగానే కాకుండా కరోడ్‌పతీ దీదీగా మారేందుకు మహిళలు కృషి చేయాలని ఆకాక్షించారు. 2047 నాటికి దేశ అర్థిక అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. విజయవాడలో ఏర్పాటు చేసిన జాతీయ సరస్ మేళా 2026ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్‌హెచ్‌జీ మహిళలు పాల్గొంటున్న సరస్ మేళా విజయవాడలో ఏర్పాటు చేసినందుకు కేంద్ర వ్యవసాయ గ్రామీణాభివద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా కనకదుర్గమ్మ సన్నిధిలో ఈ మేళాను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వయం సమద్ధి సాధించడంతోపాటు, వ్యాపార రంగంలోనూ ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రభుత్వాలు మరిన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళా సాధికారతతోనే దేశ సమగ్రాభివద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని రాష్ట్రపతి పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థిక పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు వస్తున్నాయని, వారిలో ఆత్మవిశ్వాసం, సామాజిక చైతన్యం పెరుగుతున్నాయని చెప్పారు. మహిళలు సాంకేతిక, ఆర్థిక రంగాల్లోనూ చురుగ్గా భాగస్వాములవుతున్నారని ప్రశంసించారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరగా పరిశీలించే అవకాశం తనకు లభించిందన్నారు. మహిళలు తమ ఆదాయాన్ని పెంచుకొని కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకునేలా స్వయం సహాయక సంఘాలు దోహదపడుతున్నాయన్నారు. గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు సరైన మార్కెట్ సదుపాయాలు కల్పించాలని రాష్ట్రపతి సూచించారు. ఉత్పత్తిదారులకు న్యాయమైన ధరలు లభించేలా మధ్యవర్తుల వ్యవస్థను తొలగించేందుకు అవసరమైన మార్పులు తీసుకురావాలన్నారు. గ్రామీణ అజీవికా మిషన్ ద్వారా మహిళల నాయకత్వంలో మరిన్ని సంస్థలు ఏర్పాటుకావాలని కోరారు. మహిళా రైతులు స్వయం సాధికారత సాధించేలా ప్రభుత్వాలు అవసరమైన సహకారం అందించాలని, డిజిటల్ మాధ్యమాలు, ఆధునిక సాంకేతిక విధానాలపై గ్రామీణ మహిళలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. సరస్ వంటి మేళాల ద్వారా ఉత్పత్తుల బ్రాండింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్, నెట్‌వర్కింగ్ అంశాలపై మహిళలకు పరిజ్ఞానం పెరుగుతుందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాష మాట్లాడలేకపోతున్నందుకు విచారం వ్యక్తం చేస్తూ, త్వరలో తెలుగు నేర్చుకొని ప్రజలతో తెలుగులో మాట్లాడేందుకు వస్తానన్నారు.

**మార్కెట్ అవకాశాలు పెంచాలి : గవర్నర్ అబ్దుల్ నజీర్**

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలు తగిన ఆర్థిక వసతులు, ఆధునిక సాంకేతికత, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, బ్రాండింగ్, ప్యాకేజింగ్, నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవాలని, మరోవైపు ప్రభుత్వాలు డ్వాక్రా ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు పెంచాలని సూచించారు. నమ్మకమైన మార్కెట్ అనుసంధానాలు కల్పించడం ద్వారా వారి వ్యాపారాలను విస్తరించుకోవడానికి విస్తత మార్కెట్లలో పోటీ పడేలా మద్దతునివ్వాలని అన్నారు.ఈ సరస్ మేళా కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన ఎంతో మందికి మంచి అవకాశాలు కలిగిస్తుందని గవర్నర్ తెలిపారు. మహిళా సాధికారత అంటే మహిళలను బలవంతులుగా మార్చడం కాదని, ప్రపంచం ఆ బలాన్ని చూసే విధానాన్ని మార్చడమే సాధికారత అనేది గుర్తించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

# క్రీడలతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం

రోజుకు 30 నిమిషాలు వ్యాయామానికి కేటాయించాలి

ఖేలో తెలంగాణ బంధన్ ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్





ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడలు, శారీరక వ్యాయామం కీలకమని రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌ను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, రోజుకు కనీసం 30 నిమిషాలు వ్యాయామానికి కేటాయించాలని పిలుపునిచ్చారు. క్రీడలు కేవలం పోటీలు, పతకాలకే పరిమితం కాకుండా ప్రతి కుటుంబం, గ్రామం, విద్యాసంస్థలో క్రీడా సంస్కృతి పెంపొందాలని ఆకాంక్షించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ కుమార్ యాదవ్ విసిరిన ఫిట్‌నెస్ ఛాలెంజ్‌ను స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం 'ఖేలో తెలంగాణ బంధన్' కార్యక్రమంలో భాగంగా ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడక, పరుగు, సైక్లింగ్, యోగా లేదా తమకు అనువైన వ్యాయామాన్ని ప్రతి రోజూ అలవాటు చేసుకోవాలని సూచించారు. శారీరక దృఢత్వం వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు కుటుంబ, సామాజిక శ్రేయస్సుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఫిట్‌నెస్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమ వ్యాయామానికి సంబంధించిన 27 సెకన్ల వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయాలని మంత్రి సూచించారు. మరో తొమ్మిది మందిని ట్యాగ్ చేసి, ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించాలని కోరారు. ఇలా ఒకరి నుంచి మరొకరికి ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తూ ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం తీసుకురావచ్చన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు, రవాణా శాఖ కార్యదర్శి, టీఎస్ఆర్‌టీసీ ఎండీ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌లకు మంత్రి ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో క్రీడలు, శారీరక వ్యాయామంపై ఆసక్తి పెంపొందిస్తే ఆరోగ్యవంతమైన తరాన్ని తీర్చిదిద్దవచ్చని తెలిపారు.బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్ని విద్యాసంస్థల్లో 'ఖేలో తెలంగాణ బంధన్', ఫిట్‌నెస్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని మంత్రి వెల్లడించారు. విద్యార్థులు చదువుతోపాటు శారీరక దృఢత్వానికీ ప్రాధాన్యమిచ్చేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధికారులు కన్నం మధు, సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు.

**చేనేత భవన్‌లో నూతన కార్యాలయం ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

తెలంగాణ చేనేత ఉత్పత్తులకు రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని, చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి, ఆర్థిక ప్రయోజనాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. నాంపల్లిలోని చేనేత భవన్‌లో తెలంగాణ చేనేత అభివృద్ధి కార్పొరేషన్ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్పొరేషన్ నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. చేనేత ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించి, కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా చూడాలని మంత్రి అన్నారు. ముడిసరుకు నుంచి వస్త్రాల తయారీ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వరకు చేనేత రంగంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాధారణ సిల్క్ శాలువాలకు బదులుగా దేవాలయాలు, అధికారిక కార్యక్రమాలు, ఉపాధ్యాయులు, ప్రముఖుల సన్మానాలు, రాజకీయ నాయకుల పరస్పర గౌరవ కార్యక్రమాల్లో చేనేత శాలువాలను వినియోగించాలని పిలుపునిచ్చారు. చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించేలా అన్ని ప్రభుత్వ శాఖలకు తగిన సూచనలు, మార్గదర్శకాలు జారీ చేయాలని పేర్కొన్నారు. చేనేత రంగ అభివృద్ధితో కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు గౌరవప్రదమైన జీవనానికి బాటలు వేయవచ్చని మంత్రి తెలిపారు. నూతన చైర్మన్ అంకితభావంతో పనిచేసి, చేనేత రంగ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# స్వీట్ల తయారీ కేంద్రాల్లో అపరిశుభ్రత

2,480 కిలోల ఆహార పదార్థాలు స్వాధీనం

రూ.3.78 లక్షల విలువైన ఖోవా, లడ్డూలు సీజ్

మూడు సంస్థల లైసెన్సులు సస్పెండ్..

మరో రెండు కేంద్రాల మూసివేతకు ఆదేశాలు




ప్రజాపక్షం/హైదరాబాద్ : పండుగల వేళ ప్రజలకు విక్రయించే స్వీట్లు, ఖోవా నాణ్యతపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. క్యూర్ ప్రాంతంలో స్వీట్లు, ఖోవా తయారీ, విక్రయ కేంద్రాలపై టిజి సేఫ్ (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) అధికారులు నిర్వహించిన తనిఖీల్లో తీవ్ర అపరిశుభ్రత, ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. ఏడు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి, అనుమానిత కల్తీపై ఎనిమిది నమూనాలను సేకరించారు. మొత్తం 2,480 కిలోల ఖోవా, లడ్డూలు తదితర ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుని, వాటి విలువ రూ.3,78,178గా నిర్ధారించారు. టిజి సేఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన ఏడు బృందాలు ఆహార భద్రతాధికారులు, పోలీసుల సహకారంతో గురువారం ఈ తనిఖీలు చేపట్టాయి. జీడిమెట్లలోని భాగ్యలక్ష్మి స్వీట్స్ అండ్ బర్ఫీ, బాలాజీ మ్యాజిక్ మిఠాయి, యశోద డెయిరీ, కీసర మండలం చేర్యాల గ్రామంలోని మధుర డెయిరీ ప్రొడక్ట్స్, జల్పల్లిలోని దేశీ డెయిరీ స్వీట్స్, పీర్జాదిగూడలోని జగన్నాథ్ మిల్క్ డెయిరీ, షాలిబండ బేలా ప్రాంతంలోని శంకర్ యాదవ్ ఖోవా అండ్ పనీర్ వ్యాపార కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.కొన్ని కేంద్రాల్లో దెబ్బతిన్న నేలలు, ఆహార వ్యర్థాలు, మురుగునీరు నిల్వ ఉండటం, మురికిగా ఉన్న గోడలు, ఈగలు, ఎలుకల సంచారం గుర్తించారు. ఆహార పదార్థాల తయారీ ప్రాంతాల్లో గుట్కా, పాన్‌మసాలా ప్యాకెట్లు, ఉమ్మి మరకలు కనిపించాయి. కొందరు కార్మికులు తల కవర్లు, చేతి తొడుగులు ధరించకపోవడంతోపాటు పురుగుల నియంత్రణ, కార్మికుల ఆరోగ్య వివరాలు వంటి తప్పనిసరి రికార్డులు నిర్వహించకపోవడాన్ని అధికారులు గుర్తించారు.

**మూడు సంస్థల లైసెన్సులు సస్పెండ్..**

అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో జీడిమెట్లలోని భాగ్యలక్ష్మి స్వీట్స్ అండ్ బర్ఫీ, బాలాజీ మ్యాజిక్ మిఠాయి, యశోద డెయిరీలకు సంబంధించిన ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్సులను అధికారులు సస్పెండ్ చేశారు. తక్షణమే వ్యాపార కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు. అదే విధంగా, ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్సు లేకుండా అపరిశుభ్ర పరిస్థితుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన చేర్యాలలోని మధుర డెయిరీ ప్రొడక్ట్స్, జల్పల్లిలోని దేశీ డెయిరీ స్వీట్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు. మధుర డెయిరీ ప్రొడక్ట్స్, దేశీ డెయిరీ స్వీట్స్, పీర్జాదిగూడలోని జగన్నాథ్ మిల్క్ డెయిరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిబంధనల ఉల్లంఘనలపై తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు టీజీ సేఫ్ కమిషనర్ వెల్లడించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాల్లో పరిశుభ్రత పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై తనిఖీలు, చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

# అక్షరం ఆలోచనకు ఆయుధం.. పుస్తకం సమాజానికి దిక్సూచి

డిసెంబర్ 18 నుంచి 28 వరకు

హైదరాబాద్ బుక్ ఫెయిర్

నూతన అధ్యక్షుడిగా రాంపల్లి రమేష్, కార్యదర్శిగా పి.నారాయణ రెడ్డి ఎన్నిక




ప్రజాపక్షం/హైదరాబాద్ : 'పుస్తకం కేవలం అక్షరాల సమాహారం కాదు.. సమాజాన్ని అర్థం చేసుకునే చూపు, స్థిరపడిన భావాలను ప్రశ్నించే ధైర్యం, కొత్త ఆలోచనలకు నాంది' అని హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ నూతన అధ్యక్షుడు రాంపల్లి రమేష్, కార్యదర్శి పి.నారాయణరెడ్డి అన్నారు. పఠన సంస్కృతిని విస్తరించడం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని వారు పిలుపునిచ్చారు. 39వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ డిసెంబర్ 18 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి (ఎన్‌టిఆర్ స్టేడియం)లో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి బుక్ ఫెయిర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని పరిచయం చేయడంతో పాటు బుక్ ఫెయిర్ నిర్వహణ వివరాలను వెల్లడించారు. పుస్తక ప్రదర్శనను కేవలం కొనుగోళ్లు, అమ్మకాలకే పరిమితం చేయకుండా.. ఆలోచనా స్వేచ్ఛ, సామాజిక చైతన్యం, ప్రజాస్వామిక విలువలను పెంపొందించే వేదికగా తీర్చిదిద్దుతామని రాంపల్లి రమేష్ తెలిపారు.

**సాంస్కృతిక కార్యక్రమాలు.. బాలోత్సవాలు**

కార్యదర్శి పి. నారాయణరెడ్డి మాట్లాడుతూ పుస్తక ప్రదర్శనతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బాలోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రచురణకర్తలు, పాఠకులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. వివిధ ప్రాంతాల పుస్తకాలు, సాహిత్య ప్రక్రియలు, సాంస్కృతిక వైవిధ్యాన్ని పాఠకులకు పరిచయం చేయడమే లక్ష్యమన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు కె.బాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈసారి స్టాళ్ల కేటాయింపునకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయడంతోపాటు, స్టాళ్ల కేటాయింపులో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తామన్నారు. బుక్ ఫెయిర్ నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వ సహకారం, భాగస్వామ్యం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సొసైటీ మాజీ అధ్యక్షుడు, కవి యాకూబ్ నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు. సమావేశంలో సంయుక్త కార్యదర్శి రజని, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

**హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ నూతన కార్యవర్గం**

**అధ్యక్షులు :** రాంపల్లి రమేష్ (నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్)

**ఉపాధ్యక్షులు :** కె. బాల్‌రెడ్డి (మలుపు బుక్స్), శోభన్‌బాబు (తెలుగు బుక్స్)

**కార్యదర్శి :** పి. నారాయణరెడ్డి (నవచేతన పబ్లిషింగ్ హౌస్)

**సంయుక్త కార్యదర్శి :** రజని (జై భారత్ పబ్లికేషన్స్)

**కోశాధికారి:** కె. సురేష్ (మంచి పుస్తకం)

**కార్యనిర్వాహక వర్గ సభ్యులు..**

యాకూబ్ (కవి సంగమం)
ఎన్.మధుకర్ (నవచేతన బుక్ హౌస్)
జి. విజయరావు (నవతెలంగాణ బుక్ హౌస్)
గీతా రామస్వామి (హైదరాబాద్ బుక్ ట్రస్ట్)
ఎన్.కోటేశ్వరరావు (సహోదయ బుక్ హౌస్)
ఎం. సూరిబాబు (క్రియేటివ్ బుక్ లింక్స్)
యు.శ్రీనివాసరావు (భూమి బుక్ ట్రస్ట్)
కె. సుజయ (ప్రణవ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్)

# కార్మికుల సంక్షేమ నిధుల అక్రమాలపై ఉక్కుపాదం

2018 నుంచి క్లెయిమ్‌లపై విజిలెన్స్ విచారణ

తప్పు చేసినవారిని ఉపేక్షించం: మంత్రి వివేక్ వెంకటస్వామి



ప్రజాపక్షం/హైదరాబాద్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసి, కార్మిక శాఖలో పారదర్శక పాలన అందించేందుకు సమూల ప్రక్షాళన చేపడతామని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో 2018 నుంచి ఇప్పటివరకు నమోదైన క్లెయిమ్‌లన్నింటిపై సమగ్ర విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో ఇద్దరు అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశామని, అక్రమాలకు పాల్పడినవారు ఎంతటివారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ బోగస్ పత్రాలు, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా క్లెయిమ్‌లు పొందినట్లు వచ్చిన ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. విజిలెన్స్ నివేదిక నెల, రెండు నెలల్లో వచ్చే అవకాశం ఉందని, నివేదిక ఆధారంగా బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయడంతో పాటు, క్లెయిమ్‌ల పరిశీలన, పరిహారం మంజూరు ప్రక్రియలో అక్రమాలకు తావులేకుండా విధానాలను పటిష్ఠం చేస్తామని చెప్పారు. వివిధ సంస్థలు, నిర్మాణదారుల నుంచి వసూలు కావాల్సిన వందల కోట్ల రూపాయల లేబర్ సెస్సును పెనాల్టీలతో సహా వసూలు చేస్తామన్నారు.

**సిఫారసు లేఖపై వచ్చిన వార్తలు అవాస్తవం..**

తన సిఫారసు లేఖతో కార్మికుల పరిహార క్లెయిమ్ మంజూరైనట్లు పత్రికలో వచ్చిన వార్తలు అవాస్తవమని వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఓ దరఖాస్తుపై నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని మాత్రమే అధికారులకు సూచించానని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో అధికారులు ఆ దరఖాస్తును తిరస్కరించారని, సంబంధిత వ్యక్తికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం చెల్లించలేదని వివరించారు. సింగరేణి సంస్థపై బిఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను మంత్రి తప్పుబట్టారు.



# నారాయణరెడ్డికి నవచేతన సిబ్బంది సత్కారం

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ బుక్ ఫెయిర్ నూతన కార్యదర్శిగా ఎన్నికైన నవచేతన పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ పి.నారాయణరెడ్డిని నవచేతన పబ్లిషింగ్ హౌస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలన్నారు.

# బార్ల లైసెన్సుల లక్కీ డ్రాకు సర్వం సిద్ధం

క్యూర్ పరిధిలో 14 బార్లకు 4,251 దరఖాస్తులు

రాష్ట్రవ్యాప్తంగా 41 బార్లకు లైసెన్సుల ఎంపిక

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో బార్ల లైసెన్సుల కేటాయింపునకు నిర్వహించనున్న లక్కీ డ్రాకు ఎక్సైజ్ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ క్యూర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని 14 బార్లతో పాటు ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని 27 బార్లకు శుక్రవారం లక్కీ డ్రా నిర్వహించి లైసెన్సీలను ఎంపిక చేయనున్నారు. ఈ ప్రక్రియ దరఖాస్తుదారుల సమక్షంలో ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. క్యూర్ పరిధిలోని 14 బార్లకు 4,251 దరఖాస్తులు రాగా, ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని 27 బార్లకు 4,519 దరఖాస్తులు అందాయి. మొత్తంగా 41 బార్లకు 8,770 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ వెల్లడించింది. క్యూర్ పరిధిలోని 14 బార్లకు సంబంధించిన లక్కీ డ్రాను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ నిర్వహించనున్నారు. మిగిలిన జిల్లాల్లో ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో డ్రా ప్రక్రియ చేపట్టి బార్ లైసెన్సీలను ఎంపిక చేయనున్నారు. క్యూర్ పరిధిలోని బార్ల లైసెన్సుల ఎంపిక ప్రక్రియను సైబరాబాద్, గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షించనున్నారు.

క్యూర్ పరిధిలోని 14 బార్లకు సంబంధించిన లక్కీ డ్రాను నార్సింగి, గండిపేట మండలంలోని హైదరాబాద్ ది అడ్రస్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ కేంద్రంలో నిర్వహించనున్నట్లు సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్ తెలిపారు. సంబంధిత దరఖాస్తుదారులకు ఇప్పటికే వాట్సాప్, ఫోన్ సందేశాల ద్వారా సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులందరూ శుక్రవారం ఉదయం 9 గంటలకల్లా వేదిక వద్దకు చేరుకోవాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు.



## ఇఎస్ఐ ఆసుపత్రిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### మహిళా ఉద్యోగినుల ఆటపాటలతో సందడిగా వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను నాచారం ఇఎస్ఐ ఆసుపత్రిలో గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (టిజిఎంఇయు ఎఐటియుసి) ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆసుపత్రిలోని వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ క్విజ్ పోటీలు, పాటలు, ఉత్తమ బతుకమ్మ అలంకరణ పోటీలను నిర్వహించారు. మహిళా ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను రంగులమయం చేశారు. అనంతరం విజేతలకు ఇఎస్ఐ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ బహుమతులు అందజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో మహిళా ఉద్యోగినుల చొరవను ఆయన అభినందించారు. ఈ వేడుకల్లో యూనియన్ కార్యవర్గ సభ్యులు అంజని, శ్రీలత, అరుణ, భాగ్య, తదితరులు పాల్గొన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగుల మధ్య ఐక్యతను, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.




## ఆవిష్కరణలకు అనురాగ్ వేదిక

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** విద్యార్థుల్లో సాంకేతిక నైపుణాలు,నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ లో వేంకటాపూర్‌లోని అనురాగ్ వ్వివిద్యాలయంలో నిర్వహించిన జాతీయ స్థాయి హాకథాన్ రోబోథాన్ 2026 ముగిసింది.రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ప్రారంభోత్సవంలో సదాశివ చల్లా ముగింపు కార్యక్రమంలో విశ్వనాథ్ చలమల్ల యువ ఇంజినీర్లు ఓటముల నుంచి పాఠాలు నేర్చుకొని,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేపట్టి దేశ ప్రగతికి తోడ్పడాలని సూచించారు. రోబోటిక్స్ ఆటోమేషన్,త్రీడీ ముద్రణతో పాటు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుయతులు అందజేశారు. కార్యక్రమంలో డా.వి. విజయకుమార్, డా.ఎండి.సికిందర్ బాబా, డా.కె కృష్ణయ్య, డా.ఎస్ జష్ కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

### మాజీ డిప్యూటీ రెడ్డి శెట్టి మేయర్ శ్రీనివాస్ గుప్తా

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** విజయదశమి పండుగను పురస్కరించుకుని జవహర్‌నగర్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా, నాగరాణి దంపతులు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు రేయింబవళ్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. పండుగ వేళ వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతోనే ఈ చిన్న సాయం అందించామని తెలిపారు. సమాజానికి నిరంతరం సేవ చేసే పారిశుద్ధ్య కార్మికులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారి సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దసరా పండుగ వేళ తమను గుర్తుంచుకుని నూతన వస్త్రాలు అందించడంపై మున్సిపల్ సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తూ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, నాయకులు బుజ్జి, శంకర్ తదితర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై బిజెపి అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించా రు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ వినోద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై గురువారం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరారావు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శేఖర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, రహదారి భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ సిగ్నళ్లను గౌరవించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ముఖ్యంగా యువత రహదారి భద్రతపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, ఇతరులకు కూడా ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒబిసి మోర్చా నాయకులు, కూకట్‌పల్లి నియోజకవర్గ బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలి

- నిరంతర గస్తీ, సాంకేతిక నిఘాతో నేరాల నియంత్రణ
- మల్కాజిగిరి కమిషనరేట్ సమీక్షలో డిజిపి సి.వి. ఆనంద్ ఆదేశాలు






**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేరాల నియంత్రణలో నిరంతర పెట్రోలింగ్, పటిష్ఠ నిఘా, సత్వర స్పందన కీలకమని డిజిపి సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని, ప్రజలు పోలీసుల స్పందనను బట్టే శాఖ పనితీరును అంచనా వేస్తారని పేర్కొన్నారు. గురువారం మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్‌లో సిపి బి.సుమతితో పాటు ఇతర అధికారులతో నిర్వహించిన సమీక్షలో నేరాల నియంత్రణ, దర్యాప్తు, రాత్రి గస్తీ, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై పలు సూచనలు చేశారు.

బొల్లారం కైకూరులోని విల్లా ఆర్కిడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో ఐదేళ్ల బాలిక హత్య ఘటనను ప్రస్తావిస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని డిజిపి సూచించారు. గేటెడ్ కమ్యూనిటీల్లో సిసిటివి నిఘాను పటిష్ఠం చేయాలని, ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న నేపాల్ గ్యాంగ్ సహా ఆస్తి నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రాత్రిగస్తీ ముమ్మరం చేయడంతోపాటు పాత నేరగాళ్లు, రౌడీషీటర్ల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పోక్సో కేసులను సమర్థంగా దర్యాప్తు చేయాలని, గడువులోగా చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. కళాశాలలు, గేటెడ్ కమ్యూనిటీల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, దర్యాప్తు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని చెప్పారు. డయల్ 112 ఫిర్యాదులపై సత్వరం స్పందించడంతోపాటు డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ పోలీసు స్టేషన్ సేవలను వినియోగించుకోవాలని ఆదేశించారు.

కీసర, చర్లపల్లి, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాద మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాద ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. విజయవాడ–వరంగల్ మార్గం, ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో గస్తీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు.

మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 2024లో18,778, 2025లో 18,480 కేసులు నమోదుకాగా, 2026లో ఇప్పటివరకు 23,747 కేసులు నమోదైనట్లు అధికారులు వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 2,196 దొంగతనాల కేసులు, 2,789 మోసాల కేసులు నమోదయ్యాయి. రోడ్డు ప్రమాద మరణాలు 340కు చేరినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో నేరాల విశ్లేషణ ఆధారంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిజిపి సూచించారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు సమన్వయంతో పనిచేయాల ని, సొత్తు రికవరీతోపాటు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా దర్యాప్తు చేపట్టాలని ఆదేశించా రు. కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణ అనంతరం మల్కాజిగిరికి 235 పోస్టులు రావాల్సి ఉందని కమిషనర్ బి.సుమతి వివరించారు. సమావేశంలో డిసిపిలు, ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

### కలెక్టర్ దీపక్ తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్:** వర్షపు నీరు వృధా కాకుండా భూగర్భ జలాలను పెంపొందించేందుకు విబిజి రామ్ కింద చేపట్టే పనులను వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. గురువారం వికారాబాద్ మండల పరిధి గోదుమగూడ గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ నీటి సంరక్షణ భూగర్భ జలాల పెంపునకు విబిజి రామ్ కింద చేపట్టిన వివిధ పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామంలో చేపట్టిన పామ్ పాండ్స్ బోర్‌వెల్ రీచార్జ్ పనులు, పైకప్పు నీటి సేకరణ, వ్యక్తిగత సామూహిక ఇంకుడు గుంతల పనుల పురోగతిని పర్యవేక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నీటి సంరక్షణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను నివారించవచ్చని తెలిపారు. వర్షపు నీటి సంరక్షణ భూగర్భ జలాల రీచార్జ్ పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ విబిజి రామ్ కింద చేపడుతున్న పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, గ్రామపంచాయతీ ఆవరణలో ఇంకుడు గుంతలు తప్పని సరిగా ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వారిని ఆదేశించారు. వికారాబాద్ మండలంలో మంజూరైన 72 ఫాం పాండులు, 47బోర్‌వెల్ రీచార్జ్, 16 పైకప్పు నీటి సేకరణ, 119వ్యక్తిగత, 33 సామూహిక ఇంకుడు గుంతల పనుల లక్ష్యాలను అధిగమించే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో డిఆర్‌డిఒ శ్రీనివాస్, ఎంపిడిఒ వినయ్‌కుమార్, సర్పంచ్ స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**వైద్య కళాశాల వసతి గృహంలో మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు**

వైద్య కళాశాల వసతి గృహంలో నాణ్యమైన భోజనంతో పాటు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు. గురువారం అనంతగిరి గుట్ట వైద్య కళాశాలను జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారితో కలసి జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సందర్శించి వివిధ పనుల సమస్యలు, సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కనీస మౌళిక వసతులను కల్పనకై కృషి చేయాలని సూచించారు. విద్యార్థులతో సంప్రదించి వారికి సౌలభ్యంగా ఉండే కమిటీలను ఏర్పాటు చేసి మెనూను రూపొందించుకొని భోజన సౌకర్యానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మెనూ విషయంలో పర్యవేక్షణ ఉండాలని అన్నారు. వసతి గృహం, కిచెన్ షెడ్లకు సంబంధించి గ్రిల్స్ మరమ్మత్తు పనులను అంచనాలకు సమర్పించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఇఒ సుధీర్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ దీన్ దయాళ్‌బంగ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శుభోదయ్, డిప్యూటి సూపరిండెంట్ డాక్టర్ రాంచంద్రయ్య, సంబంధిత అధికారులు పాల్గోన్నారు.



## ఇందిరమ్మ పథకంతో సొంతింటి కల నెరవేరుతుంది

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కల నెరవెరుతుందని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. గురువారం అలియాబాద్ మున్సిపాలిటి మజీద్‌పూర్‌లో అంతాయిపల్లి నవనీత నాగేష్ దంపతుల నూతన గృహ ప్రవేశాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బొమ్మల పల్లి నర్సింహాయాదవ్, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, కౌన్సిలర్లు సరసం వనజ అశోక్‌రెడ్డి, ముద్దం సుధాకర్‌రెడ్డి, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నా రు.

## ఘనంగా ఆరెకపూడి గాంధీ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం /కూకట్‌పల్లి:** వివేకానంద్‌నగర్‌లోని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ నివాసంలో ఆయన జన్మదిన వేడుకలు గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి, పుష్పాగుచ్చాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరిస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన ఆయురారోగ్యాలతో, ప్రజలకు సేవలందిస్తూ ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



## జగద్గిరిగుట్టలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** తెలంగాణ ప్రజానాట్య మండలి, భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువా రం జగద్గిరిగుట్ట చివరి బస్‌స్టాప్ వద్ద బతుకమ్మ సంబరాలను ఘనం గా నిర్వహించారు. వివిధ బస్తీల నుంచి పెద్ద సంఖ్య లో మహిళలు తరలివచ్చి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు. సుమారు 3గంటల పాటు సాగిన ఈ సంబరాలు మహిళల ఉత్సాహం, ఐక్యతను చాటిచెప్పాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండి యూసుఫ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర నాయకులు ఏసురత్నం హాజరయ్యారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ వేడుకల్లో ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు హైమావతి, మాధవి, ప్రమీల, వెంకటాచారి, గౌరవాధ్యక్షులు ప్రవీణ్, భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జె.లక్ష్మి , జిల్లా కార్యవర్గ సభ్యులు మహాలక్ష్మి , చంద్రమ్మ, నీలమ్మ, దీపిక, స్థానిక సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి రాములు, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, యువజన సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ నిర్లక్ష్యం.. నరకయాతనలో జవహర్ నగర్ ప్రజలు!

### దోమలు, ఈగలతో వ్యాధుల భయం.. ముక్కుపుటలు అదిరిపోతున్న దుర్వాసన

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** స్వచ్ఛ భారత్ నినాదం క్షేత్రస్థాయిలో నీరుగారుతోంది. జవహ ర్ నగర్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా గాడి తప్పడంతో స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నా రు. గత పది రోజులుగా కాలనీల్లో ఇంటింటికీ రావాల్సిన మున్సిపల్ చెత్త బండ్లు రాకపోవడంతో, ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి వీధులు వ్యర్థాల కుప్పలుగా మారాయి. రోడ్ల పక్కనే చెత్త కొండలా పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాలన్నీ విపరీతమైన దుర్వాసనతో కమ్మే సి, ప్రజలు ఇళ్లలోనూ ప్రశాంతంగా గడపలేని దారుణ పరిస్థితి ఏర్పడింది. ఈ చెత్త కుప్పల వద్ద దోమలు, ఈగలు భారీగా పెరిగిపోవడంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, వీధి కుక్కలు, పశువులు ఈ వ్యర్థాలను రోడ్లపైకి లాగడంతో పాదచారు లు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కమిషనర్‌కు దూరభారం, స్పందించని యంత్రాంగం ఇక్కడి నివాసితుల్లో ఎక్కువ మం ది నిరుపేదలు, రోజువారీ కూలీలే ఉన్నా రు. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేద్దామంటే కీసరలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఇక్కడికి ఏకంగా 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. అంత దూరం వెళ్తే పూట గడవని పరిస్థితి కావడంతో, బాధితులు ఫోన్లలో సంప్రదించడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే, మున్సిపల్ అధికారులు మాత్రం ఫోన్లు ఎత్తడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేలా ఉందని నివాసితులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు మరియు మున్సిపల్ యంత్రాంగం తక్షణ మే స్పందించి, పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని, ఇకపై రోజూ మున్సిపల్ వాహనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.





## మహిళా రైతులు మరింతగా రాణించాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** దేశంలోని వివిధ రంగాల మాదిరిగానే వ్యవసాయ రంగంలోనూ మహిళా రైతులు ప్రభుత్వ ప్రోత్సాహం, సలహాలను పాటిస్తూ మరింతగా రాణించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.చంద్రకళ సూచించారు. వ్యవసాయరంగంలో అన్ని ప్రాంతాల్లో పొలాల్లో ఏ మాత్రం తళుకూ బెరుకూ లేకుండా మహిళలు చేసే వ్యవసాయ పనులు అనితరమన్నారు. అంతర్జాతీయ మహిళా రైతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో విశేష కృషి చేసిన ఉత్తమ రైతులను ఘనంగా సత్కరించారు. విత్తనాల ఎంపిక, పంటల సాగు, ఎరువుల వినియోగం, సస్యరక్షణ తదితర వ్యవసాయ పనుల్లో మహిళలు నిమగ్నమై ఉండటం అభినందనీయమన్నారు. వ్యవసాయ రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి తోడ్పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆధునిక వ్యవసాయ పద్దతులు, సాంకేతిత పరిజ్ఞానాన్ని సైతం అందిపుచ్చుకోవటం, విద్యార్జన మరింత రాణింపుకు కారణమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సాంకేతిక అధికారి శిరీష, తదితరులు పాల్గొన్నారు.



## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలి

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ సవరణ చేసి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన తగిన వాటా కల్పించేందుకు పార్లమెంట్‌లో బిసి బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.దశరథ డిమాండ్ చేశారు. గురువారం యాప్రాల్ 189వ డివిజన్‌లోని సిపిఐ కార్యాలయం (ఏఆర్ దేవరాజు భవన్)లో బిసి హక్కుల సాధన సమితి ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ అల్వాల్ మండల సమితి కార్యదర్శి అమరావతి బాబు అధ్యక్షత వహించారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా రిజర్వేషన్లు అమలు చేయాలి ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సిహెచ్.దశరథ మాట్లాడుతూ, దేశంలో బిసిలకు ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఎదురుకాకుండా 42 రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రం పై ఉందన్నారు. బిసిల సంక్షేమం, హక్కుల పరిరక్షణను విస్మరిస్తున్న కేంద్రంలోని బిజెపి సర్కార్‌ను గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. నూతన కన్వీనర్‌గా బొడుసు రమేష్ యాదవ్ నియామకం ఈ సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి నూతన కన్వీనర్‌గా బొడుసు రమేష్ యాదవ్ ను ఎన్నుకొని, ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బొడుసు రమేష్ యాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు సమితి నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బిసిల హక్కుల సాధన కోసం పూర్తి సమయాన్ని కేటాయించి, నిరంతరం శ్రమిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాప్రాల్ శాఖ కార్యదర్శి వై. వెంకటేష్, సీనియర్ నాయకులు, రైతు సంఘం అధ్యక్షులు డి.జంగయ్య, చంద్రయ్య, నరేంద్ర చారి, నాగేష్ యాదవ్, కుమ్మరి రవి తదితరులు పాల్గొని, నూతన కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన రమేష్ యాదవ్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో ఈవేస్ట్‌పై అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** పర్యావర ణ పరిరక్షణలో భాగంగా ఇన్ఫోసిస్ పోచారం క్యాంపస్‌లో అధీకృత ఈవేస్ట్ రీసైక్లింగ్ సంస్థ ఎన్విరోకేర్ రీ సైక్లింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం ఈవేస్ట్ సేకరణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపస్ లో ఉపయోగించని, పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను బాధ్యతాయుతంగా పారవేసేందుకు ప్రత్యేక సేకరణ బిన్‌లను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్స్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరణ కేంద్రాలకు అందించేందుకు ఆసక్తి చూపించారని నిర్వాహకులు తెలిపారు.ఈ వేస్ట్ నిర్వహణపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన పజిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల సమర్థ నిర్వహణపై అవగాహన పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ పర్యావరణహిత కార్యక్రమాలను మరిన్ని చేపట్టేందుకు కృషి చేస్తామని ఎన్విరోకేర్ రీసైక్లింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పేర్కొన్నారు.




## వివాహం పేరిట యువతులను వంచిస్తున్న యువకుడి అరెస్టు

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ప్రభుత్వ ఉద్యోగినని, శిక్షణలో ఉన్నానంటూ వివాహ సంబంధిత యాప్‌లో ప్రొఫైల్ పెట్టి మాయమాటలతో నమ్మించి యువతులను మోసగిస్తున్న యువకుడు కటకటాల పాలైన ఉదంతమిది. పుల్లగూర సూర్యనారాయణ(33)అనే నిందితుడు శాదీ.కామ్ అనే వివాహ యాప్‌లో ప్రొఫైల్ పెట్టటం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పిడుగురాళ్ల ప్రాంతానికి చెందిన బాధితురాలు అనూష సంప్రదించింది. తాను రైల్వేలో ఉద్యోగానికి సంబంధించి శిక్షణలో ఉన్నానని నమ్మబలికి త్వరలో వివాహం చేసుకొంటానని చెప్పాడు. అతడిని నమ్మి గత జులై మాసంలో ఉప్పల్‌లో ఉన్న నిందితుడు ఉంటున్న గదికి వెళ్లింది. మాయమాటలతో ఆమెను శారీరకంగా లోబరచుకొన్న అతడు అప్పటి నుండి తన వద్ద ఆమె ప్రయివేట్ ఫొటోలున్నాయంటూ బెదిరించి పలుమార్లు శారీరకంగా లోబరచుకోవటమేకాక తన ఉద్యోగ నిమిత్తం అవసరం ఉందని రూ.1.1 లక్ష లు తీసుకొన్నాడు. ఆ తర్వాత వివాహం ఎప్పుడు చేసుకొంటావని నిలదీయటంతో ఫోన్ ఎత్తక పోగా కనిపించటం మానేసాడని, దీంతో అనుమానించిన తాను విచారించగా అతడికి గతంలో వివాహం జరిగిందని, ఇదే తరహాలో మరో యువతిని సైతం వంచించినట్లు తెలిసిందని, అతడిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శుక్రవారం
16-10-2026
www.prajapaksham.in

ప్రజాపక్షం
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



హైదరాబాద్‌లో | వేములవాడలో | కీసరలో

## ప్రభుత్వాధికారులు

(మొదటి పేజీ తరువాయి)

పండాల సంధ్యారాకేశ్, వేములవాడ రూరల్ తహసీల్దార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... ఆరు కొత్త విద్యుత్ మీటర్ల మంజూరు కోసం రూ.1.20 లక్షల లంచం తీసుకుంటూ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్) అసిస్టెంట్ ఇంజినీర్ ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్ సబ్ డివిజన్ పరిధి మదన్నపేట సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పండాల సంధ్య రాకేశ్ గురువారం లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పాత విద్యుత్ మీటర్లు కనిపించకపోవడంతో వాటి స్థానంలో ఆరు కొత్త మీటర్లు మంజూరు చేయాలని ఫిర్యాదుదారుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించారు. ఆ దరఖాస్తులను ఆమోదించి కొత్త మీటర్లు మంజూరు చేసేందుకు ఎఇ రూ.1.20 లక్షల లంచం డిమాండ్ చేశారు. దీంతో ఫిర్యాదుదారుడి నుంచి లంచం స్వీకరిస్తున్న సమయంలో ఎసిబి అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఎఇ వద్ద నుంచి ఆయన సూచన మేరకు లంచం సొమ్ము రూ.1.20 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నాంపల్లిలోని అవినీతి నిరోధక చట్టం కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి, న్యాయ రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపింది.

**కీసర మండల రెవెన్యూ కార్యాలయ డిప్యూటీ తహసీల్దారు**

ఓ భూ సంబంధిత లావాదేవీలకు సంబంధించి అధికారిక పని అనుకూలంగా చేసేందుకు రూ. 5 లక్షలు డిమాండ్ చేసి రూ.2.5 లక్షలు లంచంగా తీసుకొంటుండగా ఎసిబి అధికారులు నిర్వహించిన దాడుల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండల రెవెన్యూ కార్యాలయ డిప్యూటి తహసీల్దారుతో పాటు మరో ఇద్దరు ఉద్యోగులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. కీసర ప్రాంతానికి చెందిన పన్నాల బుచ్చిరెడ్డి భార్య సుశీల ఇటీవల మృతి చెందటంతో ఆమె పేరిట సర్వే నంబర్ 183, 184లో ఉన్న మూడెకరాల భూమిని తన పేరిట వారసత్వంగా (సక్సెషన్)మ్యూటేషన్ కోసం కుమారుడు పన్నాల గిరిధర్‌రెడ్డి కొద్ది నెలల క్రితం కీసర తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకున్నాడు. అప్పటి నుండి కార్యాలయానికి తరచూ వెళుతున్న క్రమంలో సంబంధిత భూమి 22 ఎ పరిధిలోకి వస్తోందని, దీన్ని మ్యూటేషన్ చేయాంటే 22ఎ పరిధిలోంచి ముందుగా తొలగించాల్సి ఉంటుందని, దీని కోసం తమకు రూ. 5 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని, ఈ డబ్బులోంచి కొంత తాము ఆర్‌డిఓ కార్యాలయ అధికారులకు సైతం ఇవ్వాల్సి ఉంటుందని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డి దరఖాస్తుదారుడితో చెప్పాడు. అంత సొమ్ము తామిచ్చుకోలేమని ఎంత బతిమిలాడినా వినక పోగా దరఖాస్తును ఏ మాత్రం పట్టించుకోవటంతో దరఖాస్తుదారుడు గిరిధర్‌రెడ్డి విసిగి పోయి ఎసిబి అధికారులను ఆశ్రయించి లిఖిత పూర్వకంగా తనను లంచంగా డిమాండ్ చేస్తున్న విషయాన్ని ఫిర్యాదు చేశాడు. దీంతో ముందస్తు పథకం ప్రకారం గిరిధర్‌రెడ్డి డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డిని కలిసి తొలి విడతగా రూ. 2.5 లక్షలు ఇస్తానని చెప్పాడు. దీనికి అంగీకరించిన డిప్యూటీ తహసీల్దార్ తెలిపిన ప్రకారం గురువారం సదరు సొమ్మును గిరిధర్‌రెడ్డి కార్యాలయంలోని విజయకుమార్‌కు ఇవ్వగా అతడి నుండి రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణ తీసుకొని డిటి సందీప్‌రెడ్డి గదిలోకి తీసుకొని వెళ్లి బ్యాగ్‌లో పెడుతున్న సమయంలో పథకం ప్రకారం అక్కడ వెన్నంటి ఉన్న ఎసిబి అధికారులు దాడి చేసి లంచంగా బాధితుడు ఇచ్చిన రూ. 2.5 లక్షలు స్వాధీనం చేసుకొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డితో పాటు అతడికి సహకరించిన ఇద్దరు ఉద్యోగులు విజయకుమార్‌రెడ్డి,బాలకృష్ణలను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎసిబి అధికారులు తెలిపారు

**వేములవాడ రూరల్ తహసిల్దార్ కార్యాలయంలో**

వేములవాడ రూరల్ తహసిల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం సాయంత్రం ఆకస్మికంగా సోదాలు నిరహించారు. భూ సంబంధిత పనుల కోసం చెక్కపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ రైతు ల్యాండ్ గిఫ్ట్ డిడి విషయంలో డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారంలో వచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించి రూ. 8,000 లంచం తీసుకుంటుండగా కంప్యూటర్/భూభారతి ఆపరేటర్‌ను, తహసీల్దార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడు ఒక పని నిమిత్తం జులై నెలలో స్లాట్ బుక్ చేసుకోగా, రకరకాల కారణాలు చూపుతూ దానిని తిరస్కరించి, పని పూర్తి చేయడానికి అధికారులు రూ. 10,000 లంచం డిమాండ్ చేశారని, చివరకు రూ. 8,000 ఇచ్చేందుకు ఒప్పందం కుదరడంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించారని. బాధితుడి ఫిర్యాదు మేరకు పథకం ప్రకారం దాడులు నిర్వహించామన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు భూభారతి ఆపరేటర్ అనిల్ బాధితుడి నుంచి రూ. 8,000 లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. లంచం తీసుకున్న భూభారతి ఆపరేటర్‌తో పాటు తహసీల్దార్‌ను కూడా అదుపులోకి తీసుకుని, వారిని ఎసిబి ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు డిఎస్పీ మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

## వ్యవసాయ అధికారుల పదోన్నతులకు లైన్ క్లియర్

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు టిఎడిఎ కృతజ్ఞతలు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యాయపరమైన చిక్కులతో నిలిచిపోయిన వ్యవసాయ అధికారుల పదోన్నతుల ప్రక్రియకు మార్గం సుగమం కావడంపై తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ (టిఎడిఎ) హర్షం వ్యక్తం చేసింది. బిసి,ఎస్‌సి, ఎస్‌టి మహిళా అధికారులకు న్యాయం జరిగేలా చొరవ తీసుకున్న సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు టిఎడిఎ ప్రతినిధుల బృందం కృతజ్ఞతలు తెలిపారు. మెరిట్ వర్సెస్ రోస్టర్ సీనియారిటీ కేసులో హైకోర్టు స్టే ఎత్తివేతతో పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగేందుకు మార్గం ఏర్పడిందనిటిఎడిఎ రాష్ట్ర అధ్యక్షుడు సల్మాన్ నాయక్, ప్రధాన కార్యదర్శి జె. తిరుపతి నాయక్‌లు పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ జనరల్, న్యాయశాఖ కార్యదర్శి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమన్వయం చేస్తూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎంతో కృషి చేశారన్నారు. అర్హత, సీనియారిటీ, రోస్టర్ నిబంధనల ప్రకారం మిగిలిన పదోన్నతులను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా టిఎడిఎ రాష్ట్ర అధ్యక్షుడు సల్మాన్ నాయక్, ప్రధాన కార్యదర్శి జె. తిరుపతి నాయక్, కోశాధికారి మధుమోహన్ సహా పలు జిల్లాల ప్రతినిధులు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఎడిఎ రాష్ట్ర కోశాధికారి మధుమోహన్ సహా కరీంనగర్, మంచిర్యాల, సిద్దిపేట, జగిత్యాల, నిర్మల్, మెదక్, సిరిసిల్ల జిల్లాల ప్రతినిధులు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జగిత్యాల డిఎఇఒభాస్కర్, ఎడిఎ రామచందర్, నిశాంత్, అనిల్, అంజిత్, ఖాదర్, తిరుమల్, సురేందర్, పరశురాం రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్‌లో ఫుడ్ పాయిజనింగ్

**75 మంది బిఎస్‌ఎఫ్ జవాన్‌లు ఆసుపత్రిలో చేరిక!**

**ఇంఫాల్:** మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో తీవ్ర కలకలం రేగింది. అనుమానాస్పద ఫుడ్ పాయిజన్ కారణంగా 75 మంది బిఎస్‌ఎఫ్ (బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్) జవాన్లు, మరో ముగ్గురు పౌరులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని వెంటనే చికిత్స నిమిత్తం గురువారం నగరంలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చినట్లు అధికారులు తెలిపారు. ఉదయం తర్వాత జవాన్లతో పాటు ముగ్గురు పౌరులకు వాంతులు, కడుపులో వికారం వంటి లక్షణాలు కనిపించాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో వారిని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రిమ్స్ (ఆర్‌ఐఎమ్‌ఎస్) ఆసుపత్రి అధికారి మాట్లాడుతూ.. 'బిఎస్‌ఎఫ్ సిబ్బందికి, ము గ్గురు పౌరులకు అత్యవసర విభాగంలో వెం టనే ప్రాథమిక చికిత్స అందించాము. ప్ర స్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆహారం విషపూరితం కావడంతోనే వీరు అస్వస్థతకు గురయ్యారు' అని వెల్లడించారు.



























Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com